www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

గురువారం | 16-10-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 198 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, ఆశ్వయుజమాసం, బహుళపక్షం, తిథి: నవమి ఉ.10:34 తదుపరి దశమి, నక్షత్రం: పుష్యమి మ.12:00 తదుపరి ఆశ్లేష, వర్జ్యం: రా.1:10-2:49, దుర్ముహూర్తం: ఉ.11:37-12:24, అమృతఘడియలు: శేషం ఉ. 7.10 వరకు, రాహుకాలం: మ.12:00-1:30, సూర్యోదయం: 6:11, సూర్యాస్తమయం: 5:49 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

లలిత సంగీత 'సరస్వతి'.. సెలవు



సుప్రసిద్ధ సినీ నేపథ్య గాయని రావు బాల సరస్వతీదేవి కన్నుమూత

నాలుగో ఏటనే స్టేజి మీద పాటలు.. ఆరో ఏట గ్రామ్‌ఫోన్ రికార్డు

'భాగ్యలక్ష్మి' చిత్రంతో నేపథ్య గాయనిగా సినీ రంగ ప్రవేశం

తెలుగు, తమిళ, కన్నడ, సింహళం భాషల్లో 2 వేలకుపైగా పాటలు

ఆకాశవాణి లలిత సంగీతం కార్యక్రమం ఆమె పాటతోనే ప్రారంభం

6

ఆశన్న కూడా..

లొంగుబాటుకు సిద్ధమవుతున్న మరో మావోయిస్టు అగ్రనేత

70 మంది సహచరులతో కలిసి

నేడు ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి ఎదుటకు

ఆశన్న అసలు పేరు తక్కళ్లపల్లి వాసుదేవరావు

స్వస్థలం ములుగు జిల్లా వెంకటాపూర్

ఛత్తీస్‌గఢ్‌లో ఒక్కరోజే 78 మంది

లొంగుబాటు.. వీరిలో 48 మంది మహిళలు

11కు తగ్గిన నక్సల్ ప్రభావిత జిల్లాల సంఖ్య

ములుగు, చర్ల, గడ్చిరోలి, కాంకేర్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మావోయిస్టు పార్టీకి వరుస ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. ఇప్పటికే ఆ పార్టీ అగ్రనేత మల్లోజుల వేణుగోపాల్‌రావు అలియాస్ అభయ్ 60 మంది సహచరులతో కలిసి మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడణవీస్ ఎదుట లొంగిపోగా.. ఆ పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు తక్కళ్లపల్లి వాసుదేవరావు అలియాస్ ఆశన్న తన సహచరులు 70 మందితో కలిసి ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి విష్ణుదేవ్ సాయ్ ఎదుట గురువారం లొంగిపోయేందుకు సిద్ధమైనట్లు సమాచారం. మల్లోజుల టీమ్ లొంగిపోయిన 24 గంటల వ్యవధిలోనే ఆశన్న కూడా తన సహచరులతో కలిసి అదే బాట పట్టడం

మిగతా 2వ పేజీలో...



మహారాష్ట్ర సీఎం ఫడణవీస్‌కు తుపాకీని అప్పగిస్తున్న మల్లోజుల వేణుగోపాల్‌రావు

మల్లోజుల ముందుకొస్తే మా బ్రాండ్ అంబాసిడర్‌గా నియమిస్తాం

లొంగిపోయిన మిగతా నక్సల్స్‌కూ పని కల్పిస్తాం

ఓ మైనింగ్ కంపెనీ ప్రకటన

2

మహారాష్ట్ర సీఎం ఎదుట మల్లోజుల సరెండర్

మరో 60 మందితో కలిసి..

ఆయుధాల అప్పగింత

నక్సల్స్ పతనానికి మల్లోజుల లొంగుబాటు నాంది: ఫడణవీస్

రూ.6 కోట్ల రివార్డు వేణుగోపాల్‌కే అప్పగింత

2



తెలంగాణ, ఏపీలకు కేటాయించిన ఐపీఎస్‌లు

ఐపీఎస్‌లలో పెరుగుతున్న మహిళల సంఖ్య

ప్రస్తుత బ్యాచ్‌లో 36 శాతానికి చేరిక

తగ్గుతున్న ఇంజనీరింగ్ పట్టభద్రులు, పెరుగుతున్న ఆర్ట్స్, సైన్స్ విద్యార్థులు

3

25 ఏళ్లలోపే చేరినవారు 12 శాతం

నేషనల్ పోలీసు అకాడమీ డైరెక్టర్ గర్గ్

బీసీ రిజర్వేషన్లపై సుప్రీంకోర్టులో
నేడే విచారణ

విక్రమ్‌నాథ్ నేతృత్వంలోని బెంచ్ ముందుకు రాష్ట్ర ప్రభుత్వ పిటిషన్

సుప్రీంకోర్టు ఏం చెబుతుందన్న దానిపై ఉత్కంఠ

తదనుగుణంగా నిర్ణయం తీసుకునేందుకు రాష్ట్ర మంత్రివర్గం సిద్ధం

నేడు మధ్యాహ్నం క్యాబినెట్ భేటీ.. స్థానిక ఎన్నికలపై స్పష్టత వచ్చే చాన్స్



న్యూఢిల్లీ/హైదరాబాద్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో 42శాతం బీసీ రిజర్వేషన్ల కల్పన అంశంపై ఉత్కంఠ నెలకొంది. గురువారం జరిగే విచారణలో సుప్రీంకోర్టు ఎలా స్పందిస్తుందన్నది ఆసక్తి రేపుతోంది. మరోవైపు కోర్టు ఏం చెబుతుంది? తర్వాత ఎలాంటి చర్యలు చేపట్టాలనే దానిపై చర్చించేందుకు గురువారం మధ్యాహ్నం రాష్ట్ర మంత్రివర్గం

మిగతా 13వ పేజీలో...



మంత్రి కొండా సురేఖ ఇంటి ముందు
హైడ్రామా

ఆమె మాజీ ఓఎస్డీ సుమంత్ కోసం మంత్రి నివాసానికి వచ్చిన పోలీసులు

వాగ్వాదానికి దిగిన సురేఖ కుమార్తె సుస్మిత

తమ కుటుంబంపై సీఎం రేవంత్, పొంగులేటి, వేం నరేందర్ కుట్రలు చేస్తున్నారని ఆరోపణలు

రెడ్లు అంతా కలిసి బీసీ మంత్రి అయిన తన తల్లిని అణగదొక్కేందుకు ప్రయత్నిస్తున్నారని ఫైర్

సుమంత్ డెక్కన్ సిమెంట్స్ ప్రతినిధులను రివాల్వర్‌తో బెదిరించారని ఆరోపణలు

ఉత్తమ్ ఫిర్యాదు మేరకు పోలీసుల చర్యలు?



మఫ్టీలో ఉన్న పోలీసుతో మాట్లాడుతున్న మంత్రి కొండా సురేఖ కుమార్తె సుస్మిత

హైదరాబాద్/ వరంగల్/ బంజారాహిల్స్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మంత్రి కొండా సురేఖ మాజీ ఓఎస్డీ సుమంత్ వ్యవహారం సంచలనంగా మారింది. ప్రభుత్వం సుమంత్‌ను మంగళవారమే ఓఎస్డీ పోస్టు నుంచి తొలగించగా.. బుధవారం ఆయనను అరెస్టు చేసేందుకు పోలీసులు ప్రయత్నించారు. జూబ్లీహిల్స్ రోడ్ నంబర్ 10లోని మంత్రి నివాసంలో

మిగతా 11వ పేజీలో...



13

జూబ్లీహిల్స్ బీజేపీ అభ్యర్థి లంకల దీపక్ రెడ్డి

పార్టీ అధిష్ఠానం ప్రకటన

2023 అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఇదే స్థానం నుంచి పోటీ పడిన దీపక్ రెడ్డి

రైల్లో మహిళపై అత్యాచారం

మహిళా బోగీలో దారుణం

బాధితురాలు ఒక్కరే ఉండటంతో

కత్తితో బెదిరించి అఘాయిత్యం

ఆపై నగదు, ఫోన్‌తో పరార్

3

సంత్రగచి-చర్లపల్లి స్పెషల్ ట్రైన్‌లో గుంటూరు సమీపంలో ఘటన

సికింద్రాబాద్ రైల్వే పోలీసులకు ఫిర్యాదు


ఆశన్న కూడా..

(మొదటిపేజీ తరువాయి)

గమనార్హం. ఆశన్న స్వస్థలం ములుగు జిల్లా జిల్లా వెంకటాపూర్ మండలంలోని నర్సింగాపూర్. ఈ గ్రామానికి చెందిన తక్కళ్లపల్లి భిక్షపతిరావు, సరోజన దంపతులకు ఇద్దరు సంతానం. పెద్ద కుమారుడు వాసుదేవరావు (ఆశన్న). చిన్న కుమారుడు సహదేవరావు. ఆశన్న ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకు వెంకటాపూర్ మండలంలోని లక్ష్మీదేవిపేట ప్రభుత్వ పాఠశాలలో విద్యాభ్యాసం చేశాడు. అనంతరం కాజీపేట ఫాతిమా స్కూల్‌లో సెకండరీ విద్యను అభ్యసించాడు. చిన్నతనంలోనే మావోయిస్టు భావజాలానికి ఆకర్షితుడై 1990లో అడవి బాట పట్టాడు. ఆశన్నపై 38 సంవత్సరాల క్రితం వెంకటాపూర్ పోలీస్‌స్టేషన్‌లో తొలి కేసు నమోదైంది. మొదట కాకతీయ యూనివర్సిటీ సీపీఐ(ఎంఎల్) పీపుల్స్‌వార్ అనుబంధ రాడికల్ స్టూడెంట్ యూనియన్‌కు ఆశన్న నాయకత్వం వహించారు. ఐపీఎస్ ఉమేష్‌చంద్ర, మాజీ హోంమంత్రి మాధవరెడ్డి హత్యలో కూడా ఆశన్న పాత్ర ఉంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అప్పటి సీఎం చంద్రబాబునాయుడిపై 2003 అక్టోబరు 1న అలిపిరిలో జరిగిన దాడిలో కీలకపాత్ర ఆశన్నదే. మావోయిస్టు పార్టీలో రాజకీయ వ్యూహాలు, సైనిక కార్యకలాపాల్లో ప్రచార విషయాల్లో కీలకంగా వ్యవహరిస్తున్న ఆశన్న.. 2024 నవంబరులో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మరణించినట్టు వదంతులు వ్యాపించాయి. కాగా.. ఆశన్న అజ్ఞాతంలోకి వెళ్లిన కొద్దిరోజులకే ఆయన తండ్రి మరణించారని, తల్లి సరోజన చిన్న కుమారుడి వద్ద ఉంటోందని గ్రామస్థులు తెలిపారు. ప్రస్తుతం ఆశన్న వయసు 60 సంవత్సరాలు పైబడి ఉండొచ్చని ఇంటలిజెన్స్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఆయన లొంగుబాటు మావోయిస్టు పార్టీకి గట్టి దెబ్బే!

లొంగుబాట్ల పర్వం

దేశంలోని 16 రాష్ట్రాల్లో సమాంతర ప్రభుత్వం నడిపిన మావోయిస్టులు 'ఆపరేషన్ కగార్' దెబ్బకు కకావికలం అవుతున్నారు. ఎన్‌కౌంటర్ల ధాటికి ఆయుధాలను అప్పగిస్తున్నారు. రోజురోజుకూ సరెండర్ల సంఖ్య పెరుగుతోంది. పార్టీ అగ్రనేత మల్లోజుల వేణుగోపాల్ మహారాష్ట్ర సీఎం ఎదుట తన సహచరులు 60 మందితో సహా లొంగిపోగా.. ఛత్తీస్‌గఢ్‌లోను మావోయిస్టులు భారీగా అదే బాట పట్టారు. కాంకేర్, సుక్మాల్లో బుధవారం 78 మంది నక్సల్స్ పోలీసు అధికారుల ఎదుట లొంగిపోయారు. వీరిలో 42 మంది మహిళా మావోయిస్టులు ఉన్నారు. దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీకి చెందిన ఇద్దరు నేతలు కూడా ఉన్నట్టు పోలీసు వర్గాలు తెలిపాయి. సుక్మాలో పదిమంది మహిళలు సహా 27 మంది.. పోలీసుల ఎదుట అస్త్రసన్యాసం చేశారు. ఇందులో 16 మందిపై రూ.50 లక్షల చొప్పున రివార్డు ఉంది. కాంకేర్‌లో 32 మంది మహిళలు సహా 51 మంది.. బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్ ఎదుట లొంగిపోయారు. 39 తుపాకులను కూడా సమర్పించారు. వీరిలో దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ (డీఎస్‌జడ్‌సీ) సభ్యుల నుంచి డివిజనల్ కమిటీలు, పలు పార్టీ విభాగాలకు చెందిన మావోయిస్టులు ఉన్నారు. డీఎస్‌జడ్‌సీ నుంచి రాజు సలామ్, రాజ్‌మల్ మందావీ ఉన్నారు. ఇక గురువారంనాడు.. మాడ్ ఏరియా కమిటీ సభ్యులు సుమారు 70 నుంచి 100 మంది జగ్దల్‌పూర్ పోలీసుల ఎదుట లొంగిపోనున్నట్లు సమాచారం. ఇదే టీంలో కేంద్ర కమిటీ సభ్యుడు ఆశన్న కూడా ఉన్నట్లు తెలుస్తోంది. ఆయనతో పాటు మాడ్ ఏరియాకు చెందిన సాల్మన్, రాజు, రజిత ఉన్నట్టు చెబుతున్నారు. ఇప్పటికే వీరంతా జగ్దల్‌పూర్ పోలీస్ హెడ్ క్వార్టర్‌కు చేరుకున్నట్లు సమాచారం.



మల్లోజుల వేణుగోపాల్‌కు రాజ్యాంగాన్ని అందజేస్తున్న మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడణవీస్



బుధవారం ఛత్తీస్‌గఢ్‌లోని కాంకేర్‌లో లొంగిపోయిన నక్సలైట్లు

అగ్రనాయకులు ఇంకెవరున్నారు?

లొంగుబాట్లు, అరెస్టుల తరువాత మావోయిస్టు పార్టీలో అగ్రనాయకులు ఇంకెవరు ఉన్నారు అంటే.. తెలంగాణలో పార్టీ కార్యదర్శి దామోదర్, చంద్రన్న, ఆజాద్ ఉన్నారు. ఛత్తీస్‌గఢ్‌లో హిడ్మా, బాలు, పాపారావు, తిప్పరి తిరుపతి, మల్లా రాజిరెడ్డి, సంగ్రాం, ఘణపతి, విశ్వనాథ్, ఘనేష్, విశేష్ బెహరా అలియాస్ భాష్కర్, తునాన్‌దా ఇతరులు ఉన్నట్లు తెలుస్తోంది. మావోయిస్టు ఉద్యమ ప్రస్థానంలో తెలంగాణ చెందిన పలువురు నాయకులు కీలక ప్రాత పోషించారు. వారి మాటలతో అనేక మంది మావోయిస్టు పార్టీలో చేరారు. వారి వల్ల సాయుధ పోరాటం తీవ్రస్థాయికి చేరింది. అలాంటివారు ఇప్పుడు తాము లొంగిపోవడమే కాక పదుల సంఖ్యలో తమ సహచరులను కూడా లొంగిపోయేలా చేయడం గమనార్హం.



మల్లోజులతో పాటు లొంగిపోయిన నక్సలైట్లు



ఆశన్న (ఫైల్ ఫొటో)

మిగిలింది మూడు జిల్లాలే: కేంద్రం

మావోయిస్టుల అత్యధిక ప్రాబల్యం ఉన్న జిల్లాల సంఖ్య ఆరు నుంచి మూడుకు, ప్రాబల్య జిల్లాల సంఖ్య 18 నుంచి 11కు చేరుకున్నదని కేంద్ర హోంశాఖ ఒక ప్రకటనలో తెలిపింది. బీజాపూర్, సుక్మా, నారాయణ్‌పూర్‌లకు మాత్రమే నక్సల్స్ కదలికలు పరిమితం అయ్యాయని పేర్కొంది. 'మావోయిస్టు రహిత భారతదేశ నిర్మాణం దిశగా భారీ అడుగులు పడుతున్నాయి. ఈ క్రమంలోనే మావోయిస్టు అడ్డాలు తగ్గిపోతున్నాయి' అని కేంద్ర హోం శాఖ వ్యాఖ్యానించింది. ఈ ఒక్క ఏడాదిలోనే మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ కార్యదర్శి, ఎనిమిదిమంది పొలిట్‌బ్యూరో/కేంద్ర కమిటీ సభ్యులు సహా 312 మంది కాల్పుల్లో మరణించారని.. 836 మంది అరెస్టుకాగా, 1,639 మంది లొంగిపోయారని పేర్కొంది. లొంగిపోయినవారిలో పొలిట్‌బ్యూరో, కేంద్ర కమిటీకి చెందిన ఇద్దరు ఉన్నారని వివరించింది.

మల్లోజులను మా బ్రాండ్ అంబాసిడర్‌గా నియమిస్తాం

- లొంగిపోయిన మిగతా నక్సల్స్‌కూ పని కల్పిస్తాం
- ఓ మైనింగ్ కంపెనీ ప్రకటన

లొంగిపోయిన మావోయిస్టులకు ఉపాధి కల్పించేందుకు లాయిడ్స్ మెటల్స్ అండ్ ఎనర్జీ అనే కంపెనీ ముందుకొచ్చింది. శిక్షణ ఇచ్చి తమ కంపెనీలో పనికి పెట్టుకుంటామని ఈ కంపెనీ ఎండీ బి. ప్రభాకరన్ ప్రకటించారు. "తన సిద్ధాంతం కోసం అడవిలో 30 ఏళ్లకు పైగా పనిచేసిన మల్లోజుల వేణుగోపాల్ జనజీవన స్రవంతిలో కలిశారు. ఆయనతో కలిసి పనిచేయడానికి మాకిది మంచి అవకాశం. ఆయన ముందుకొస్తే మా కంపెనీ బ్రాండ్ అంబాసిడర్‌గా నియమిస్తాం. మిగతా లొంగిపోయిన నక్సల్స్‌ను కూడా మా కంపెనీలో భాగం చేసుకుని, వారు చేయగల పని ఇవ్వడంపై దృష్టి సారించాం" అని ప్రభాకరన్ తెలిపారు.



సంచలన లొంగుబాటు

- నాలుగు దశాబ్దాల పోరును వదిలి మల్లోజుల వేణుగోపాల్ సరెండర్
- రూ.6కోట్ల రివార్డు వేణుగోపాల్‌కే అప్పగింత

పెద్దపల్లి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): భారత విప్లవోద్యమ చరిత్రలోనే సంచలనం! లొంగుబాటు ఘట్టాల్లో అతి భారీ సన్నివేశం బుధవారం మహారాష్ట్రలోని గడ్చిరోలిలో ఆవిష్కృతమైంది. నాలుగు దశాబ్దాల సాయుధ పోరాటాన్ని వదిలి మావోయిస్టు పార్టీ పొలిట్ బ్యూరో సభ్యుడు, సిద్ధాంతకర్త మల్లోజుల వేణుగోపాల్ అలియాస్ అభయ్, సోను దాదా, భూపతి జనజీవన స్రవంతిలో కలిశారు. మరో 60మంది మావోయిస్టులతో కలిసి ఆయుధాలతో సహా మహారాష్ట్ర సీఎం ఫడణవీస్ సమక్షంలో ఆయన లొంగిపోయారు. మల్లోజుల లొంగుబాటు మహారాష్ట్ర సహా రెడ్ కారిడార్ పరిధిలోని తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ తదితర రాష్ట్రాల్లో మావోయిస్టుల పతనానికి నాంది పలికిందని ఈ సందర్భంగా ఫడణవీస్ వ్యాఖ్యానించారు. కాగా, వేణుగోపాల్‌పై రూ.ఆరు కోట్ల రివార్డు ఉంది. ఆ రివార్డును ఆయనకు సీఎం అందించారు. వేణుగోపాల్‌ది ఉమ్మడి కరీంనగర్ జిల్లా పెద్దపల్లి పట్టణం. కాగా, ఆయనతో పాటు తెలంగాణకు చెందిన మరో ఇద్దరు కూడా లొంగిపోయారు. మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి పట్టణానికి చెందిన దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ కార్యదర్శి సలాకుల సరోజ అలియాస్ లత, నిర్మల్ జిల్లా కుంచనపల్లికి చెందిన దండకారణ్య కమిటీ సభ్యుడు ఇర్రి మోహన్‌రెడ్డి అలియాస్ వివేక్ వీరిలో ఉన్నారు.

లేఖల యుద్ధంతో మొదలై..

సీపీఐ(ఎంఎల్) పీపుల్స్ వార్, ఎంసీసీలు 2004లో ఏకమై సీపీఐ మావోయిస్టు పార్టీగా అవతరించిన నాటి నుంచి పెద్దఎత్తున ఆయుధాలతో ఒక పొలిట్‌బ్యూరో స్థాయి నేత లొంగిపోవడం ఇదే ప్రథమం. వివిధ కారణాలతో గతంలో అనేకమంది నక్సలైట్లు లొంగిపోయారు. కానీ, ఇంత పెద్ద మొత్తంలో లొంగిపోయిన ఉదంతం ఇదే కావడం గమనార్హం. వచ్చే ఏడాది మార్చి నెలాఖరు నాటికి దేశంలో మావోయిస్టు పార్టీని లేకుండా చేయాలని కంకణం కట్టుకున్న కేంద్ర ప్రభుత్వం గత ఏడాదిన్నర క్రితం ఆపరేషన్ కగార్ చేపట్టింది. దండకారణ్యం, కర్రెగుట్టలు, అబూజ్‌మడ్ కేంద్రంగా మావోయిస్టులను మట్టుబెడుతోంది. ఈ ఏడాది మే నెలలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు అలియాస్ బసవరాజు సహా 27మంది ప్రాణాలు కోల్పోవడం సంచలనం రేపింది. ఆ తర్వాత మరో ఇద్దరు కేంద్రకమిటీ సభ్యులు కూడా ఎన్‌కౌంటర్‌లో మృతిచెందారు. కగార్‌ని నిలిపివేయాలని, శాంతి చర్చలు జరపాలని ప్రజా సంఘాలు, మావోయిస్టులు కోరుతున్నప్పటికీ, తగ్గేదిలేదంటూ కేంద్ర ప్రభుత్వం తేల్చిచెబుతోంది. ఇదేక్రమంలో నెలరోజుల క్రితం సాయుధ పోరాటాన్ని వదిలి పెట్టాలనీ, ప్రజా సమస్యలపై ఉద్యమాలు చేపట్టి పార్టీని రక్షించుకోవాలంటూ మల్లోజుల వేణుగోపాలరా విడుదల చేసిన లేఖ విప్లవ శిబిరంలో కలకలం రేపింది. ఆయన వైఖరిని మావోయిస్టులు ఖండించారు. లొంగి పోవాలనుకుంటే ఆయుధాలను పార్టీకి ఇచ్చి లొంగిపోవాలని ఆయనకు అల్టిమేటం జారీచేశారు.

భార్యాభర్తలిద్దరూ సీఎం ఎదుట లొంగుబాటు..

మల్లోజుల వేణుగోపాల్ సహచరి, కేంద్రకమిటీ సభ్యురాలు సిదాం విమల చంద్ర అలియాస్ తార ఈ ఏడాది జనవరి 1న ఫడణవీస్ ఎదుట లొంగిపోగా, వేణుగోపాలరావు కూడా ఆయన ఎదుటే లొంగిపోయారు. ఆయన హైదరాబాద్‌లో డీజీపీ ఎదుట లొంగిపోనున్నారని వారం రోజుల క్రితం వార్తలు వచ్చాయి. కాగా, తార లొంగిపోయినప్పుడు సీఎం ఫడణవీస్ మాట్లాడుతూ, వేణుగోపాల్ కూడా ఆరుమాసాల్లో వస్తాడని తమకు సమాచారం ఉందని వ్యాఖ్యానించారు. అలాగే వేణుగోపాల్ సోదరుడు మల్లోజుల కోటేశ్వరరావు సహచరి, కేంద్ర కమిటీ సభ్యురాలు పోతుల సుజాత అలియాస్ మైనా ఈ ఏడాది సెప్టెంబరు 13వ తేదీన హైదరాబాద్‌లో డీజీపీ ఎదుట లొంగిపోయారు.

ఢిల్లీ-ఎన్‌సీఆర్‌లో హరిత టపాసులకు సుప్రీంకోర్టు ఓకే

- దీపావళి నేపథ్యంలో పలు షరతులతో అనుమతి
- 19, 20వ తేదీల్లో 3 గంటల చొప్పున మాత్రమే..

న్యూఢిల్లీ, అక్టోబరు 15: దీపావళి సందర్భంగా ఢిల్లీ-జాతీయ రాజధాని ప్రాంతం (ఎన్‌సీఆర్)లో పర్యావరణ హిత టపాసుల విక్రయాలు, వినియోగానికి సుప్రీంకోర్టు అనుమతించింది. ఇది తాత్కాలికమేనని.. ఇందుకు సంబంధించి పలు షరతులను కూడా విధించింది. ఈనెల 18 నుంచి 20వ తేదీ వరకే పర్యావరణ హిత బాణసంచా అమ్మకాలకు అనుమతి ఉంటుందని.. అలాగే 19, 20వ తేదీ (దీపావళి)న మాత్రమే ఆ టపాసులు కాల్చుకోవచ్చని స్పష్టం చేసింది. అది కూడా ఈ రెండు రోజుల్లో ఉదయం 6 నుంచి 7 గంటల వరకు.. రాత్రి 8 నుంచి 10 గంటల వరకు మాత్రమేనని వివరించింది. గతేడాది ఢిల్లీలో టపాసులపై విధించిన పూర్తి నిషేధాన్ని సడలించాలంటూ కేంద్రం, ఢిల్లీ సర్కారు సంయుక్తంగా చేసిన అభ్యర్థనను, గ్రీన్ క్రాకర్స్ తయారీదారుల విజ్ఞప్తులను పరిగణనలోకి తీసుకొని ధర్మాసనం బుధవారం అనుమతునిచ్చింది. 'నీరి (సీఎస్ఐఆర్-జాతీయ పర్యావరణ ఇంజనీరింగ్ సంస్థ) ఆమోదించిన గ్రీన్ క్రాకర్స్‌ను మాత్రమే అనుమతిస్తారు.

జపాన్‌లో ఫ్లూ కలకలం..135 బడుల మూసివేత

టోక్యో, అక్టోబరు 15: కొవిడ్ మహమ్మారి అనంతరం, తాజాగా ఇన్‌ఫ్లూయెంజా (ఫ్లూ) విజృంభణతో జపాన్‌లో కలకలం రేగింది. సాధారణ ఫ్లూ సీజన్ కంటే దాదాపు నెల రోజుల ముందుగానే ఇన్‌ఫెక్షన్లు తీవ్ర స్థాయికి చేరడంతో దేశవ్యాప్తంగా ఫ్లూ మహమ్మారి వ్యాప్తిని ప్రభుత్వం అధికారికంగా ప్రకటించింది. దేశవ్యాప్తంగా 6వేల మందికి పైగా రోగులు తీవ్ర జ్వరం, దగ్గు, ఒళ్లు నొప్పుల వంటి లక్షణాలతో ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. ఈ ఫ్లూ ముఖ్యంగా పిల్లలపై ప్రభావం చూపుతోంది. దీంతో టోక్యో, ఒకినావా, కగోషిమా వంటి నగరాల్లో 135 పాఠశాలలతో పాటు శిశు సంరక్షణ కేంద్రాలను తాత్కాలికంగా మూసివేశారు. పరిస్థితిని అదుపులోకి తీసుకురావడానికి అధికారులు దేశవ్యాప్తంగా కొవిడ్-19 నిబంధనలను కూడా అమలు చేస్తున్నారు. ఫ్లూ వ్యాప్తిని చూసి మరోసారి కొవిడ్ లాంటి మహమ్మారి ముంచుకొస్తుందేమోనని ప్రజలు భయపడుతున్నారు.

పాక్- అఫ్గాన్ మధ్య 48 గంటల కాల్పుల విరమణ

ఇస్లామాబాద్, అక్టోబరు 15: పాకిస్థాన్- అఫ్గానిస్థాన్ సరిహద్దు ఘర్షణల నేపథ్యంలో ఇరుదేశాలు కీలక నిర్ణయం తీసుకున్నాయి. తాత్కాలిక కాల్పుల విరమణకు అంగీకరించాయి. బుధవారం సాయంత్రం నుంచి 48 గంటల పాటు కాల్పుల విరమణ ఒప్పందం అమలులో ఉండనున్నట్లు పాకిస్థాన్ విదేశాంగ కార్యాలయం ప్రకటించింది. ఈ విషయాన్ని రాయిటర్స్ వార్తా సంస్థ బుధవారం వెల్లడించింది. కాగా, పాకిస్థాన్ జరిపిన తాజా దాడుల్లో కనీసం 12 మంది పౌరులు మృతి చెందగా, వంద మందికి పైగా గాయపడ్డారని, ఆ దాడులను సమర్థంగా ఎదుర్కొన్నామని తాలిబన్ ప్రభుత్వం ప్రకటించింది. ఘర్షణల నేపథ్యంలో ఇరుదేశాలు సరిహద్దు వాణిజ్య మార్గాలను మూసివేయడంతో వాటి మధ్య సరుకుల రవాణా నిలిచిపోయింది.

అమెరికా రహస్య పత్రాలు చైనాకు..

- భారత మూలాలున్న రక్షణ వ్యూహ నిపుణుడు ఆష్లే అరెస్టు

వాషింగ్టన్, అక్టోబరు 15 : అమెరికాకు చెందిన కీలక రక్షణ పత్రాలను చైనా అధికారులకు చేరవేసిన కేసులో భారత సంతతికి చెందిన రక్షణ వ్యూహ నిపుణుడు ఆష్లే టెల్లీస్‌ను అరెస్టు చేశారు. అమెరికా పౌరులకు తీవ్రమైన ముప్పును కలిగించే సమాచారం, పత్రాలు టెల్లీస్ వద్ద లభించాయని పోలీసు అధికారులు ప్రకటించారు. రోమ్‌కు పారిపోయే ప్రయత్నంలో ఉండగా, ఈనెల 11వ తేదీన పోలీసులు ఆయనను అదుపులోకి తీసుకున్నారని యూఎస్ న్యాయవాది లిండ్సే హాలిగన్ తెలిపారు. టెల్లీస్‌పై నమోదైన అఫిడవిట్‌ను అనుసరించి.. అమెరికా రక్షణ విభాగానికి చెందిన వెయ్యి పేజీల రహస్య పత్రాలను ఆయన తస్కరించారు. ఇలాంటి కేసుల్లో గరిష్ఠంగా పదేళ్ల జైలు శిక్ష విధిస్తారు.

తమిళనాట హిందీ నిషేధం దుమారం

- ప్రభుత్వం అసెంబ్లీలో బిల్లు ప్రవేశపెడుతుందంటూ వార్తలు
- దేశ వ్యాప్తంగా పెల్లుబికిన వ్యతిరేకత, వెనక్కి తగ్గిన డీఎంకే
- బిల్లు ప్రతిపాదన అవాస్తవమంటూ శాసనసభ కార్యదర్శితో వివరణ



బుధవారం అసెంబ్లీలో మాట్లాడుతున్న స్టాలిన్

చెన్నై, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): తమిళనాట హిందీ భాషా వినియోగంపై నిషేధం విధిస్తున్నారని, ఇందుకోసం ఆ రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో బిల్లు ప్రవేశపెడుతోందని బుధవారం జరిగిన ప్రచారంతో దేశ వ్యాప్తంగా దుమారం రేగింది. తమిళనాడులో మరో ఏడు నెలల్లో అసెంబ్లీ ఎన్నికలు ఉండడం, నూతన విద్యా విధానం అమలు అంశంలో కేంద్రం, తమిళనాడు మధ్య వివాదం నడుస్తుండడం ఈ దుమారానికి మరింత ఊతం ఇచ్చింది. రాష్ట్ర వ్యాప్తంగా హిందీ హోర్డింగులు, బోర్డులు, సినిమాలు, పాటల్లో హిందీ భాషను ఉపయోగించడాన్ని నిషేధిస్తూ అసెంబ్లీలో బిల్లు ప్రవేశపెట్టాలని సీఎం భావిస్తున్నట్లు జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. దీంతో తీవ్ర చర్చ మొదలవ్వగా.. ప్రాంతీయ భాషలపై హిందీని రుద్దడానికి ప్రతిస్పందనగా ఈ బిల్లు తీసుకువస్తున్నట్లు డీఎంకే వర్గాలు ఆ వార్తలను సమర్థించాయి. అయితే, తాము రాజ్యాంగానికి వ్యతిరేకంగా ఏమీ చేయబోమని, దానికి కట్టుబడే చర్యలు ఉంటాయని డీఎంకే సీనియర్ నేత టీకేఎస్ ఇళంగోవన్ ఓ మీడియా సంస్థతో వ్యాఖ్యానించారు. మరోపక్క, ఎన్నికల నేపథ్యంలో అన్నాడీఎంకేను ఇరుకున పెట్టేందుకే సీఎం స్టాలిన్ హిందీ నిషేధం బిల్లును తెరపైకి తెచ్చారనే చర్చ కూడా జరిగింది. ఒకవేళ ఆ బిల్లును ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశపెడితే బీజేపీతో పొత్తుపెట్టుకున్న అన్నాడీఎంకే.. బిల్లుకు మద్దతిస్తే బీజేపీని విభేదించినట్లవుతుంది. మద్దతు ఇవ్వకపోతే స్వరాష్ట్రంలో విమర్శలు ఎదుర్కొనేది. అయితే, తమిళనాడులో హిందీ భాష వినియోగంపై నిషేధమనే వార్తలపై దేశ వ్యాప్తంగా తీవ్ర వ్యతిరేకత పెల్లుబికింది. దీంతో పునరాలోచనలో పడ్డ స్టాలిన్ ప్రభుత్వం వెనక్కితగ్గి హిందీ నిషేధ వార్తలను బుధవారం రాత్రి ఖండించింది. హిందీ భాష నిషేధానికి సంబంధించిన బిల్లును అసెంబ్లీలో ప్రవేశ పెడుతున్నారనే వార్తలను తీవ్రంగా తప్పు పట్టింది. అలాంటి బిల్లు ప్రతిపాదన ఏదీ తమకు అందలేదని తమిళనాడు శాసనసభ కార్యదర్శి స్పష్టం చేశారంటూ తమిళనాడు ప్రభుత్వ అధికారిక సామాజిక ఖాతా 'టీఎన్ ఫ్యాక్ట్ చెక్'లో బుధవారం రాత్రి ప్రకటన చేసింది.

కేంద్ర కేబినెట్ పరిశీలనకు

కనీస పింఛను పెంపు!

- కార్మిక మంత్రి మాండవీయ వెల్లడి

న్యూఢిల్లీ, అక్టోబరు 15: కనీస పింఛనును రూ.7,500కి పెంచాలన్న ప్రతిపాదనపై ఈపీఎఫ్‌వో ట్రస్టీల బోర్డు తాజా సమావేశంలో చర్చించకపోవడంపై పెన్షనర్లలో తీవ్ర అసంతృప్తి నెలకొంది. ముఖ్యంగా ఈపీఎస్-95 కేటగిరీలోకి వచ్చే పింఛనుదారులు గత సోమవారం ప్రత్యక్ష ఆందోళనకు దిగారు. ఈపీఎఫ్‌వో ప్రధాన కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తంచేశారు. దీనిపై కేంద్ర కార్మిక-ఉపాధికల్పన మంత్రి మన్‌సుఖ్ మాండవీయ తాజాగా స్పందించారు. కనీస పింఛనును రూ.7,500కి పెంచాలన్న ప్రతిపాదన తమ పరిశీలనలో ఉందని.. దానిని కేంద్ర మంత్రివర్గం ముందుకు తీసుకెళ్లనున్నట్లు వెల్లడించారు. ఇది గనుక ఆమోదం పొందితే.. 6.5 కోట్ల మంది ఈపీఎఫ్ సభ్యులకు లబ్ధి చేకూరుతుంది. ఇటీవల ఈపీఎఫ్‌వో ట్రస్టీల సెంట్రల్ బోర్డ్ సమావేశమై.. పీఎఫ్ ఖాతాల నుంచి వంద శాతం విత్‌డ్రా చేసుకునేందుకు ఆమోదం తెలిపింది. కొన్ని నిబంధనలను సడలించింది. అయితే ఈపీఎస్-95 జాతీయ ఉద్యమ కమిటీ చేసిన కీలక సుదీర్ఘ డిమాండ్లపై చర్చించలేదు. రూ.7,500కి కనీస పింఛను పెంపు, పూర్తిస్థాయిలో డీఏ, వైద్య ప్రయోజనాల తక్షణ పునరుద్ధరణ, అధిక వేతనాలకు తగినట్లుగా పెన్షన్ల క్రమబద్ధీకరణ వీటిలో ముఖ్యమైనవి. వీటిని నెరవేర్చాలంటూ పలు రాష్ట్రాల్లో ఈపీఎస్-95 పెన్షనర్లు కొద్ది నెలలుగా ఆందోళన చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే కేంద్ర మంత్రి మాండవీయ హామీ వారికి కాస్త ఉపశమనం కలిగించింది. మరోవైపు.. ఉద్యోగులు పీఎఫ్ ఖాతాలో దాచుకున్న మొత్తంలో 25% కనీస బ్యాలెన్సుగా ఉంటుందని.. పీఎఫ్ తుది సెటిల్మెంట్‌ను గతంలో మాదిరిగా 2నెలలకు గాక ఏడాదికి పెంచుతూ ట్రస్టీల బోర్డు తీసుకున్న నిర్ణయాలపై కాంగ్రెస్ మండిపడింది. తప్పుడు విధానాలతో వేతన జీవులను శిక్షిస్తున్నారని.. ప్రధాని మోదీ జోక్యం చేసుకుని ఇలాంటి నిరంకుశ నిబంధనలు తీసుకురాకుండా కార్మిక మంత్రిని అడ్డుకోవాలని ఆ పార్టీ ఎంపీ మాణిక్యం ఠాగూర్ బుధవారం డిమాండ్ చేశారు. ఆయన విమర్శలను మాండవీయ తోసిపుచ్చారు.

మాజీ సైనికోద్యోగుల పిల్లల వివాహానికి రూ.లక్ష

న్యూఢిల్లీ, అక్టోబరు 15: దేశంలో పింఛనుకు అర్హులు కాని మాజీ సైనికోద్యోగులకు అందిస్తున్న ఆర్థిక సాయాన్ని రక్షణ శాఖ 100% పెంచింది. ఈ ప్రతిపాదనలకు రక్షణ మంత్రి రాజ్‌నాథ్ ఆమోదం తెలిపారు. కేంద్రీయ సైనిక బోర్డు ద్వారా మాజీ సైనికోద్యోగులు, వారిపై ఆధారపడిన వారికి వివిధ సంక్షేమ పథకాల కింద అందిస్తున్న మొత్తాలను రెట్టింపు చేసినట్టు రక్షణ శాఖ బుధవారం ఓ ప్రకటనలో తెలిపింది. ఈ పెంపు కోసం నవంబరు 1 నుంచి దరఖాస్తులు సమర్పించాల్సి ఉంటుందని పేర్కొంది. కాగా, ప్రస్తుతం ఏటా 32 లక్షల మంది ఆర్థిక సాయం పొందుతున్నారని, ప్రతి సంవత్సరం 60 వేల మంది కొత్తగా ఈ పథకాలకు దరఖాస్తు చేసుకుంటున్నారని తెలిపింది.

- పెన్షన్‌కు అర్హులు కానీ మాజీ సైనికోద్యోగులకు ప్రస్తుత ఇస్తున్న పెనరీ గ్రాంట్‌ను రూ.4 వేల నుంచి రూ.8 వేలకు పెంచారు.
- పెన్షన్‌కు అర్హులు కాని సైనికోద్యోగుల భార్యలకు(వితంతువులు) కూడా రూ.8 వేల చొప్పున ఇస్తారు. ఇది ఎలాంటి ఆదాయం లేని, 65 ఏళ్లు పైబడిన వారికి వర్తిస్తుంది.
- సైనికోద్యోగుల కుటుంబాల్లో ఇద్దరు పిల్లల చదువులకు ప్రస్తుతం నెలవారీ ఇస్తున్న రూ.వెయ్యిని రూ.2 వేలకు పెంచారు. వితంతువులు పోస్టుగ్రాడ్యుయేషన్ పూర్తి చేసేందుకు కూడా ఇస్తారు.
- సైనికోద్యోగుల కుటుంబాల్లోని యువతుల వివాహానికి ఇస్తున్న రూ.50 వేల సాయాన్ని రూ.లక్షకు పెంచారు. ఇది ఇద్దరు కుమార్తెల వరకు వర్తిస్తుంది.

బిహార్‌లో బీజేపీ రెండో జాబితా విడుదల

న్యూఢిల్లీ, పట్నా, హాజీపూర్, అక్టోబరు 15 : బిహార్ అసెంబ్లీ ఎన్నికలకు 12 మందితో బీజేపీ రెండో జాబితా విడుదల చేసింది. ప్రముఖ గాయని మైథిలి ఠాకూర్‌కు అలీ నగర్ సీటు కేటాయించింది. అలాగే మాజీ ఐపీఎస్ అధికారి ఆనంద్ మిశ్రాకు బక్సార్ సీటు కేటాయించింది. దీంతో మొత్తం 83 సీట్లకు ఆ పార్టీ అభ్యర్థులను ప్రకటించినట్లయ్యింది. కాగా బిహార్ అసెంబ్లీ ఎన్నికలకు ప్రధాని నరేంద్ర మోదీ తన స్లోగన్‌ను ప్రకటించారు. 'ఐక్య ఎన్డీయే, ఐక్య బిహార్.. తెస్తాయి బిహార్‌కు సుపరిపాలన..' అని బిహార్ కార్యకర్తలతో పేర్కొన్నారు. ఇంటింటికీ వెళ్లి కేంద్రం, నీతీశ్ కుమార్ ప్రభుత్వం అమలుచేస్తోన్న పథకాలను వివరించాలని వారికి సూచించారు. కాగా ఆర్జేడీ నేత తేజస్వి యాదవ్(35) రఘోపూర్ నియోజకవర్గం నుంచి పోటీకి తల్లిదండ్రులు లాలు, రబ్రీదేవి సమక్షంలో బుధవారం హాజీపూర్‌లో నామినేషన్ దాఖలు చేశారు. ఇక్కడి నుంచి ఇప్పటికే రెండుసార్లు గెలిచిన ఆయన హ్యాట్రిక్ విజయంపై కన్ను వేశారు. గతంలో ఇదే నియోజకవర్గం నుంచి గెలిచి లాలు, రబ్రీదేవి బిహార్ సీఎంలుగా పనిచేశారు. మరోవైపు బిహార్ సీఎం నీతీశ్‌కుమార్ పార్టీ జేడీయూ 57 మందితో తన తొలి జాబితాను విడుదల చేసింది. ఇదిలా ఉండగా, అసెంబ్లీ ఎన్నికల్లో తాను పోటీ చేయడం లేదని జన్‌సురాజ్ పార్టీ అధినేత ప్రశాంత్ కిశోర్ ప్రకటించారు. తాను ఎన్నికల బరిలో ఉంటే పార్టీ సంస్థాగత వ్యవహారాల నుంచి దృష్టి మరలిపోయే ప్రమాదం ఉందన్నారు.


రక్షణ భూముల స్వాధీనానికి మార్గదర్శకాలు ఇవ్వండి

- సుప్రీంకోర్టుకు కేంద్రం విజ్ఞప్తి

న్యూఢిల్లీ, అక్టోబరు 15: దేశంలో వివిధ ప్రాంతాల్లో ఆక్రమణకు గురైన రక్షణశాఖ భూములను తిరిగి స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నామని సుప్రీంకోర్టుకు కేంద్ర ప్రభుత్వం తెలియజేసింది. ఈ మేరకు ఏర్పాటైన హైపవర్ కమిటీ ఆక్రమణలు జరిగిన ప్రాంతాలను సందర్శించి వివరాలు సేకరిస్తోందని వెల్లడించింది. భూముల స్వాధీనంలో కోర్టు స్టేలు, స్థానిక యంత్రాంగం సహకరించకపోవటం వంటి అంశాలు అడ్డంకిగా నిలుస్తున్నాయని.. దీనిని నివారించటానికి అత్యున్నత న్యాయస్థానం మార్గదర్శకాలను విడుదల చేయాలని విజ్ఞప్తి చేసింది. రక్షణశాఖ భూములను ఆక్రమణల నుంచి తిరిగి స్వాధీనం చేసుకోవాలంటూ కామన్‌కాజ్ అనే స్వచ్ఛందసంస్థ 2014లో దాఖలు చేసిన పిల్ మీద విచారణను సుప్రీంకోర్టు బుధవారం కొనసాగించింది. దేశంలో 75,629 ఎకరాల రక్షణశాఖ భూములు ఉండగా.. వాటిలో 4,418 ఎకరాలు ఆక్రమణలో ఉన్నాయని రక్షణశాఖ ఈ ఏడాది జూలైలో కోర్టుకు సమర్పించిన నివేదికలో వివరించింది.

చైనాను ఎదుర్కోవడానికి భారత్ సాయం కావాలి

- అమెరికా ఆర్థిక మంత్రి స్కాట్ బెసెంట్ వ్యాఖ్యలు



వాషింగ్టన్, అక్టోబరు 15: భారత్‌పై అడ్డగోలుగా 50శాతం సుంకాలు విధించిన అమెరికా.. ఇప్పుడు చైనాను ఎదుర్కొనేందుకు మాత్రం భారత్ సాయం కావాలని కోరుకుంటోంది. అమెరికాలోని టెక్, రక్షణ, వాహన కంపెనీలకు అత్యంత కీలకమైన అరుదైన లోహాల సరఫరాపై చైనా నియంత్రణలు విధించడమే దీనికి కారణం. అమెరికాలో ఓ చానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆ దేశ ఆర్థిక మంత్రి స్కాట్ బెసెంట్ మాట్లాడుతూ.."ఇది చైనాకు, ప్రపంచానికి మధ్య జరుగుతున్న పోరు. మొత్తం ప్రపంచ పారిశ్రామిక, పంపిణీ వ్యవస్థలపైనే చైనా బల్లెం ఎక్కుపెట్టింది. అది మనల్ని నియంత్రించలేదు. దీనిపై మేం మా మిత్రదేశాలతో మాట్లాడుతున్నాం. ఈ వారంలో సమావేశం కాబోతున్నాం. ఈ అంశంలో యూరప్ దేశాలు, భారత్‌తోపాటు ఆసియాలోని ప్రజాస్వామ్య దేశాల సహకారం కోరుతున్నాం. అమెరికా ప్రపంచ శాంతి కోసం కృషి చేస్తుంటే.. చైనా యుద్ధానికి దిగుతోంది" అని పేర్కొన్నారు. ప్రపంచంలో అరుదైన ఖనిజాలు, లోహాల సరఫరాలో 90% చైనా నుంచే జరుగుతుంది. పలు దేశాల్లో అరుదైన ఖనిజాలు దొరికినా.. వాటిని ప్రాసెస్ చేసి, లోహాలుగా మార్చే సామర్థ్యం చైనాకు మాత్రమే ఉంది. అలాంటి వాటిపై చైనా నియంత్రణ విధించడంతో అమెరికా గందరగోళంలో పడింది. ఈ క్రమంలోనే నవంబర్ 1 నుంచి చైనాపై 100శాతం అదనపు టారిఫ్‌లు విధిస్తామని ట్రంప్ హెచ్చరించారు.

ఇలాంటి కొడుకులొద్దు 'తండ్రీ'!

- తాము ఉంటోంది అద్దె ఇళ్లు అని చెప్పి తండ్రి మృతదేహాన్ని పెట్టనీయని కుమారులు
- రైతు వేదిక వద్ద మృతదేహం.. రాత్రంతా తల్లి శవజాగారం.. సిద్దిపేట జిల్లాలో ఘటన

సిద్దిపేట రూరల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ఇద్దరు చెట్టంత కొడుకులున్నా.. వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులను నిర్దయగా దూరం పెట్టారు. తండ్రి అనారోగ్యంతో చనిపోతే.. ముందుండి అంత్యక్రియలు నిర్వహించాల్సింది పోయి, తాము ఉంటున్నది అద్దె ఇళ్లలో అని చెబుతూ మృతదేహాన్ని తీసివేయించారు. తప్పనిసరి పరిస్థితుల్లో మృతదేహాన్ని కొద్దిసేపు బస్టాండ్‌లో, ఆ తర్వాత రైతు వేదిక వద్ద ఉంచితే అక్కడే రాత్రంతా శవజాగారం చేసిన ఆ వృద్ధురాలు చివరికి తానొక్కత్తే భర్త అంత్యక్రియలు నిర్వహించింది. మానవతావాదులను కన్నీరు పెట్టించేలా ఉన్న ఈ ఘటన సిద్దిపేట జిల్లా రూరల్ మండలం పుల్లూరు గ్రామంలో జరిగింది. గ్రామానికి చెందిన గొడుకు పోచయ్య(67), యాదవ్వ దంపతులకు ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. అందరికీ పెళ్లిళ్లయ్యాయి. చిన్న కుమారుడు పొరుగూరికి ఇల్లరికం వెళితే, పెద్ద కుమారుడు అదే ఊర్లో తల్లిదండ్రులకు దూరంగా ఓ అద్దె ఇంట్లో ఉంటున్నాడు. వృద్ధ దంపతులు విడిగా ఓ అద్దె ఇంట్లో ఉంటున్నారు. అనారోగ్య సమస్యలతో మంగళవారం రాత్రి పోచయ్య చనిపోగా.. మృతదేహాన్ని తాము ఉంటున్న ఇంటి వద్ద ఉంచే పరిస్థితి లేకపోవడంతో పెద్ద కుమారుడు ఉంటున్న ఇంటికి తీసుకెళ్లారు. తానుంటోంది అద్దె ఇల్లు అని, మృతదేహాన్ని ఇక్కడ ఉంచొద్దంటూ పెద్ద కొడుకు చెప్పాడు. చిన్న కొడుకూ ఇదేమాట చెప్పడంతో మృతదేహాన్ని గ్రామంలోని బస్టాండ్‌కు తీసుకువచ్చి ఉంచారు. కొద్దిసేపటికి.. గ్రామస్థుల సూచనతో గ్రామంలోని రైతు వేదిక భవనంలోకి మృతదేహాన్ని తరలించారు. తన భర్త మృతదేహానికి నీడనివ్వని కుమారులు.. అంత్యక్రియలు కూడా చేయాల్సిన అవసరం లేదని, తానే చేస్తానంటూ యాదవ్వ తానే నిర్వహించింది.

మేఘా కృష్ణారెడ్డి మాతృమూర్తికి ప్రముఖుల నివాళి

హైదరాబాద్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పారిశ్రామికవేత్త మేఘా కృష్ణారెడ్డి మాతృమూర్తి పురిటిపాటి విజయలక్ష్మికి ఏపీ గవర్నర్ ఎస్ అబ్దుల్ నజీర్, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు పలువురు ప్రముఖులు నివాళులు అర్పించారు. హైదరాబాద్ హైటెక్స్‌లో జరిగిన సంస్మరణ కార్యక్రమంలో విజయలక్ష్మి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. నివాళులర్పించిన వారిలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, కేంద్ర మంత్రులు జి కిషన్ రెడ్డి, శ్రీనివాసవర్మ, బండి సంజయ్, మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్య నాయుడు, సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ, ఏపీ శాసనసభ ఉప సభాపతి ఆర్ రఘురామకృష్ణంరాజు, తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ప్రభుత్వ సలహాదారులు వేం నరేందర్ రెడ్డి, మహమ్మద్ అలీ షబ్బీర్ తదితరులున్నారు. సినీ నటులు చిరంజీవి, దగ్గుబాటి వెంకటేష్, మాజీ ఎంపీలు కేవీపీ రామచంద్రరావు, జితేందర్ రెడ్డి, మధుయాష్కీ గౌడ్, హోం శాఖ ముఖ్య కార్యదర్శి సీవీ ఆనంద్, తదితరులు నివాళులర్పించినవారిలో ఉన్నారు. ఏబీఎన్ ఆంధ్రజ్యోతి ఎండీ వేమూరి రాధాకృష్ణ, మై హోమ్ గ్రూప్ సంస్థల చైర్మన్ జూపల్లి రామేశ్వర రావు, సినీ నిర్మాత దగ్గుబాటి సురేష్ తదితరులు విజయలక్ష్మికి నివాళులర్పించారు.

రైల్లో మహిళపై అత్యాచారం

బాధితురాలికి మాయమాటలు చెప్పి మహిళా బోగీలో దూరిన దుండగుడు

- ఒక్కరే ఉండటంతో కత్తితో బెదిరించి అఘాయిత్యం.. నగదు, ఫోన్‌తో పరార్
- సంత్రగచి-చర్లపల్లి స్పెషల్ ట్రైన్‌లో గుంటూరు సమీపంలో ఘటన
- సికింద్రాబాద్ రైల్వే పోలీసులకు ఫిర్యాదు

హైదరాబాద్ సిటీ/సికింద్రాబాద్ రైల్వేస్టేషన్/గుంటూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): కదులుతున్న రైల్లోనే ఓ మహిళా ప్రయాణికురాలు అత్యాచారానికి గురైంది. బాధితురాలికి మాయమాటలు చెప్పి మహిళా బోగీలోకి దూరిన దుండగుడు.. ఆమె ఒక్కరే ఉండటంతో కత్తి చూపి బెదిరింపులకు పాల్పడ్డాడు. ఆపై దాడి చేసి అఘాయిత్యానికి ఒడిగట్టాడు. తేరుకునేలోపే ఆమె బ్యాగులో ఉన్న నగదు, మొబైల్ తీసుకొని రైలు దిగి పారిపోయాడు. సోమవారం రాత్రి ఏపీలోని రాజమండ్రి నుంచి బయలుదేరిన సంత్రగచి- చర్లపల్లి స్పెషల్ ట్రైన్‌లో గుంటూరు సమీపంలో ఈ ఘటన చోటు చేసుకుంది. బాధితురాలు మంగళవారం సికింద్రాబాద్ రైల్వే పోలీసులను ఆశ్రయించగా వారు.. ఆ మేరకు కేసు (జీరో ఎఫ్ఐఆర్) నమోదు చేశారు. ఫిర్యాదులోని వివరాల మేరకు.. ఏపీలోని తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రి అర్బన్ మండల పరిధిలోని ఓ గ్రామానికి చెందిన మహిళ (35) బతుకుదెరువు కోసం హైదరాబాద్‌కు వస్తోంది. నాచారంలోని ఓ ప్రైవేటు సంస్థలో పని చేయాల్సి ఉండగా.. చర్లపల్లిలో దిగేందుకు సోమవారం రాత్రి రాజమండ్రి స్టేషన్‌లో సంత్రగచి స్పెషల్ రైల్లోని మహిళా బోగీలో ఎక్కింది. రైలు గుంటూరు స్టేషన్‌కు చేరుకునేసరికి తోటి మహిళా ప్రయాణికులంతా దిగిపోయారు. ఈ క్రమంలోనే రైలు కదులుతుండగా.. సుమారు 40 ఏళ్ల వయసున్న ఆగంతకుడు వచ్చి మిగతా బోగీల డోర్లన్నీ లాక్ చేసి ఉన్నాయని తీయమని బతిమాలాడటంతో తీసింది. దీంతో అందులోకి ఎక్కిన దుండగుడు.. 20 నిమిషాల తర్వాత తన వద్దనున్న కత్తి చూపి బెదిరించాడు. దీంతో డబ్బులున్న బ్యాగు, మొబైల్ ఫోన్‌ను అక్కడే వదిలేసిన బాధితురాలు బాత్రూంలోకి వెళ్లి గడియ పెట్టుకుంది. బ్యాగు కింద పారేస్తానని బెదిరించడంతో ఆమె డోర్ తీసి చూడబోగా బలవంతంగా బాత్రూం బయటకు లాగిన ఆగంతకుడు ఆమెపై దాడి చేశాడు. ఆపై అత్యాచారానికి ఒడిగట్టాడు. పెదకూరపాడు స్టేషన్ సమీపంలో రైలు నెమ్మదించడంతో బ్యాగులో ఉన్న నగదు రూ.5,600, ఫోన్ తీసుకొని కిందకు దూకి పారిపోయాడు. బాధితురాలు చర్లపల్లిలో దిగి స్టేషన్ సిబ్బందికి జరిగిన విషయాన్ని వివరించగా.. వారి సూచనతో సికింద్రాబాద్ రైల్వే పోలీసులను ఆశ్రయించింది. ఈ నేపథ్యంలోనే జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసిన అక్కడి పోలీసులు.. బాధితురాలిని వైద్య పరీక్షల నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఘటన జరిగిన ప్రాంతం ఏపీలోని నడికుడి పోలీస్ స్టేషన్ పరిధిలోనిది కావడంతో కేసును అక్కడికి బదిలీ చేశారు.



రైళ్లలో భద్రతపై అనుమానాలు..

రైల్లో అత్యాచారం, దోపిడీ ఘటన రైల్వేలో కలకలం రేకెత్తిస్తోంది. ప్రయాణికులకు రైల్వే శాఖ కల్పించే భద్రత ఇదేనా అన్న విమర్శలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. ఈ సంఘటన గుంటూరు లాంటి ప్రధాన రైల్వేస్టేషన్‌లో భద్రతా వైఫల్యాన్ని స్పష్టం చేస్తోంది. నిబంధనల ప్రకారం మహిళల కోచ్ రైలు వెనుకభాగంలో సిగ్నల్ ఇచ్చే గార్డు కోచ్‌కు ఆనుకునే ఉంటుంది. గుంటూరు స్టేషన్‌లో రైలు బయలుదేరే ముందు గార్డు సిగ్నల్ ఇస్తారు. రైలు కదిలే సమయంలోనే ఆగంతకుడు మహిళా కోచ్‌లోకి ఎక్కాడని బాధితురాలు చెబుతున్నారు. మరి ఆ సమయంలో గార్డు ఎందుకు గుర్తించి ఆగంతకుడిని కిందికి దించలేదనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. అలానే ఆర్‌పీఎఫ్ సిబ్బంది కూడా సంతకం కోసం గుంటూరు స్టేషన్‌లో దిగుతారు. కనీసం వారైనా పట్టించుకోలేదని తెలుస్తోంది. ఉదయం బయలుదేరాల్సిన రైలు 8 గంటలు ఆలస్యమవ్వడంతో రాత్రి ప్రయాణం కావడంతో దుండగుడికి అనువైన వాతావరణం ఏర్పడిందనే వాదనలు వినిపిస్తున్నాయి.

మృత్యు టిప్పర్.. మింగేసింది!

- ఒకే కుటుంబంలో నలుగురి దుర్మరణం



ప్రమాదంలో మృతి చెందిన తండ్రి కూతురు బాల్‌కిషన్, జాస్విన్

భిక్కనూరు, బోనకల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): రాంగ్ రూట్‌లో దూసుకొచ్చిన టిప్పర్ ఆ కుటుంబం పాలిట మృత్యు శకటంగా మారింది. ఇద్దరు చిన్నారులు సహా నలుగురి ప్రాణాలు బలిగొంది. కామారెడ్డి జిల్లా భిక్కనూరు మండలంలోని జంగంపల్లి గ్రామం వద్ద 44వ జాతీయరహదారిపై బుధవారం జరిగిన ఈ దుర్ఘటన ఆ కుటుంబంలో తీరని విషాదాన్ని నింపింది. ఆదిలాబాద్‌కు చెందిన పాస్టర్ బాల్‌కిషన్ (53) భార్య కొన్నేళ్ల క్రితం మరణించింది. అప్పటినుంచి కామారెడ్డిలోని షాబ్దిపూర్ రోడ్డులో తన తల్లిదండ్రులతో అద్దెకు ఉంటున్నాడు. తన కూతురు జాస్విన్(29)ను ఖమ్మం జిల్లాకు చెందిన పాస్టర్ ప్రకాశ్‌తో ఐదేళ్ల క్రితం వివాహం జరిపించగా వీరికి ఇద్దరు బాలురు జోయల్ ప్రకాశ్ (4), జోయల్ జాట్సన్(4 నెలలు)ఉన్నారు. 20రోజుల క్రితం జాస్విన్ తన తండ్రి బాల్‌కిషన్ వద్దకు రాగా బుధవారం ఉదయం చిన్న బాబుకు భిక్కనూరు ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో వ్యాక్సిన్ ఇప్పించేందుకు స్కూటీపై బయల్దేరారు. స్కూటీని బాల్‌కిషన్ నడుపుతుండగా వెనక జాస్విన్‌తో పాటు ఆమె ఇద్దరు కుమారులు ఉన్నారు. వాహనం భిక్కనూరు మండలం జంగంపల్లి గ్రామానికి చేరుకోగానే 44వ జాతీయరహదారిపై రాంగ్‌రూట్‌లో ఎదురుగా దూసుకొచ్చిన టిప్పర్ ఢీకొట్టింది. దీంతో ఈ ప్రమాదంలో బాల్‌కిషన్, జాస్విన్, జోయల్ ప్రకాశ్‌కు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందగా జాట్సన్ కామారెడ్డి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ప్రమాదం విషయం తెలుసుకున్న భిక్కనూరు ఎస్సై ఆంజనేయులు.. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి జిల్లా ఆస్పత్రికి తరలించారు. రోడ్డు ప్రమాదం కారణంగా దాదాపుగా రెండు కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి.

10 మందికి పైగా పిల్లలపై లైంగిక దాడి!

- సైదాబాద్ జువైనల్ హోం స్టాఫ్‌గార్డుపై మరో పోక్సో కేసు నమోదు

సైదాబాద్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని సైదాబాద్ జువైనల్ హోంలో స్టాఫ్ గార్డ్ రహమాన్ చేసిన అకృత్యాలు ఒకొక్కటి వెలుగులోకి వస్తున్నాయి. తాజాగా మరో బాలుడిపై లైంగిక దాడికి సంబంధించిన ఫిర్యాదు రావడంతో పోలీసులు రహమాన్‌పై రెండో పోక్సో కేసు నమోదు చేశారు. ఈ కేసుకు సంబంధించి పోలీసులు, జువెనైల్ శాఖ అధికారులు చేసిన విచారణలో సంచలన విషయాలు బయటపడ్డాయి. నిందితుడు కొంతకాలంగా 10 మందికి పైగా బాలలను బెదిరించి రాత్రివేళల్లో లైంగిక దాడికి పాల్పడినట్లు ప్రాథమికంగా నిర్ధారణ అయినట్లు తెలిసింది. మొదటి కేసు నమోదైన వెంటనే సైదాబాద్ పోలీసులు నిందితుడిని అరెస్టు చేసి రిమాండుకు తరలించారు. అయితే, ఈ కేసులకు సంబంధించి మరింత లోతుగా దర్యాప్తు చేసి, వివరాలు సేకరించేందుకు రిమాండ్‌లో ఉన్న రహమాన్‌ను కోర్టు అనుమతితో కస్టడీకి తీసుకునేందుకు పోలీసులు సిద్ధమవుతున్నారు. మరోవైపు, చైల్డ్ ప్రొటెక్షన్ కమిటీ సభ్యులు బుధవారం జువైనల్ హోంను సందర్శించి, పిల్లలకు భరోసానిచ్చారు.

ఐపీఎస్‌లలో 36శాతానికి పెరిగిన మహిళల వాటా

- తెలంగాణ నుంచి తగ్గిన ప్రాతినిధ్యం.. 4 నుంచి 1 శాతానికి చేరిక
- నేషనల్ పోలీసు అకాడమీ డైరెక్టర్ అమిత్‌గర్గ్ వెల్లడి
- తెలంగాణ, ఏపీలకు నలుగురు చొప్పున ఐపీఎస్‌ల కేటాయింపు

హైదరాబాద్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): దేశంలో ఐపీఎస్‌లో చేరుతున్న మహిళల సంఖ్య ఐదేళ్లుగా పెరుగుతూ వచ్చి, ప్రస్తుతం 36శాతానికి చేరిందని సర్దార్ వల్లభ్‌భాయ్ నేషనల్ పోలీసు అకాడమీ డైరెక్టర్ అమిత్ గార్గ్ వెల్లడించారు. ఈ నెల 17న అకాడమీలో 77వ బ్యాచ్ ఐపీఎస్ అధికారుల పాసింగ్ అవుట్ పరేడ్ నిర్వహిస్తున్న క్రమంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. 77వ బ్యాచ్‌లో మొత్తం 190 మందికి ఇన్‌డోర్, అవుట్‌డోర్ శిక్షణ ఇచ్చామని, వారిలో 174 మంది డైరెక్ట్ ఐపీఎస్‌లు కాగా.. 16 మంది నేపాల్, భూటాన్, మాల్దీవులకు చెందిన పోలీసు అధికారులు ఉన్నారని చెప్పారు. దేశానికి చెందిన 174మందిలో 65మంది మహిళా అధికారులని.. ఐదేళ్ల క్రితం మహిళా అధికారులు 20.66 శాతంకాగా, ఈసారి 35.63 శాతానికి పెరిగిందని తెలిపారు. ఐపీఎస్‌లో చేరుతున్న వారిలో గతంలో ఇంజనీరింగ్ చదివినవారు 69శాతం ఉండేవారని, ప్రస్తుతం 50శాతానికి తగ్గిందని.. ఆర్ట్స్, సైన్స్ గ్రూపుల నుంచి చేరుతున్న వారి సంఖ్య పెరిగిందని అమిత్‌గార్గ్ తెలిపారు. 25ఏళ్ల వయసులోపు ఐపీఎస్ సాధిస్తున్న యువత శాతం పెరుగుతోందని.. ఐదేళ్ల క్రితం ఇలాంటివారు 4శాతమే ఉంటే, ఈసారి 12శాతం ఉన్నారని తెలిపారు. మరోవైపు 28 ఏళ్లుదాటిన తర్వాత ఐపీఎస్‌లో చేరుతున్నవారి సంఖ్య బాగా తగ్గిపోయిందని వెల్లడించారు. తెలంగాణ నుంచి ఐపీఎస్‌కు ఎంపికవుతున్న వారి సంఖ్య గత ఐదేళ్లలో గణనీయంగా తగ్గిపోయిందని చెప్పారు. ఐదేళ్ల క్రితం 4శాతం ఉంటే, గత మూడేళ్లు 3శాతం, ఈసారి కేవలం ఒక్కశాతమే ఉన్నారని వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించి కూడా 5శాతం నుంచి 3 శాతానికి ప్రాతినిధ్యం పడిపోయిందన్నారు. ప్రస్తుతం ప్రపంచం ఎదుర్కొంటున్న పెనుసవాళ్లలో ఒకటైన సైబర్ క్రైమ్‌పై యువ ఐపీఎస్‌లకు శిక్షణ ఇచ్చామని గార్గ్ తెలిపారు. ప్రస్తుత ఐపీఎస్ బ్యాచ్‌లో ఏపీకి చెందిన కొయ్యే చిట్టిరాజు, కాకుమాను అశ్విన్ మణిదీప్, కె.శ్రీనివాసులు, మర్రిపాటి నాగభరత్, మన్నం సుజిత్ సంపత్, తెలంగాణకు చెందిన అభిజిత్ పాండే, ఎస్.దీప్తిచౌహాన్ ఉన్నట్టు తెలిపారు. ఇక తెలంగాణ కేడర్‌కు రానున్న ఐపీఎస్‌లలో.. ఆయేషా ఫాతిమా (ఎంపీ), సోహం సునీల్(మహరాష్ట్ర), మనీషా నెహ్రా (రాజస్థాన్), రాహుల్ కాంత్ (జార్ఖండ్) ఉన్నారు. ఏపీకి రానున్నవారిలో.. కాకుమాను అశ్విన్ మణిదీప్ (ఏపీ), జాదవ్ రావ్ నిరంజన్(మహరాష్ట్ర), జయశర్మ (ఢిల్లీ), తరుణ్ (హర్యానా) ఉన్నారు.

ప్రియుడితో భర్తను చంపించిన భార్య

- వివాహేతర సంబంధానికి అడ్డొస్తున్నాడనే దారుణం
- ఆమె, ప్రియుడు అరెస్టు.. సహకరించిన మరో ఇద్దరు

నాగర్‌కర్నూల్ క్రైం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): వివాహేతర సంబంధానికి భర్త అడ్డొస్తున్నాడని, అతడిని తన ప్రియుడితో కలిసి చంపించిందా భార్య. ఆపై ప్రియుడితో కలిసి ఘటనను రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించేందుకు విఫలయత్నం చేసింది. నాగర్‌కర్నూల్ జిల్లాలో ఈ ఘటన జరిగింది. రూరల్ మండలం శ్రీపురం గ్రామానికి చెందిన మైనగాని రాముడు (37)కు, పెద్దకొత్తపల్లి మండలం వెన్నచెర్లకు చెందిన మానసతో 14 ఏళ్ల క్రితం పెళ్లయింది. ఈ దంపతులు నాగర్‌కర్నూల్‌లోని అద్దె ఇంట్లో ఉంటున్నారు. వీరికి ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. ఆరు నెలల క్రితం మానసకు పెద్దముద్దునూర్‌కు చెందిన సురేశ్ గౌడ్‌తో పరిచయం ఏర్పడి.. అది వివాహేతర సంబంధానికి దారితీసింది. ఈ క్రమంలో భర్తను అడ్డు తొలగించుకోవాలని మానస నిర్ణయించుకుంది. ప్రియుడు కౌకుంట్ల సురేశ్‌గౌడ్‌తో కలిసి పథకం వేసింది. ఈనెల 11న పెద్దమద్దనూర్‌లో పార్టీ ఉందని.. రాముడికి సురేశ్ ఫోన్ చేసి చెప్పాడు. రాముడు పెద్దముద్దునూరుకు వెళ్లాక అందరూ కలిసి మద్యం తాగారు. ఆ తర్వాత సురేశ్.. తన వెంట తెచ్చుకున్న పెద్ద ప్లాస్టర్‌ను రాముడి ముక్కు, నోటిపై అతికించాడు. దీంతో అతడు ఊపిరి ఆడక చనిపోయాడు. ఆ తర్వాత మృతదేహాన్ని కంకర రోడ్డుపై పడేసి రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించారు. తన కుమారుడు మృతిపై అనుమానం ఉందంటూ పోలీసులకు రాముడి తండ్రి ఫిర్యాదు చేయగా.. అసలు విషయం బట్టబయలైంది. ఆమెతో పాటు, ప్రియుడు సురేశ్ సహకరించిన బాలపీరు, హనుమంతును అరెస్టు చేశారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

కరూర్‌లో సెప్టెంబర్ 27న జరిగిన తొక్కిసలాటమీద బుధవారం తమిళనాడులోని శాసనసభలో చర్చకంటే రచ్చ అధికంగా జరిగింది. తమిళగ వెట్రి కళగం (టీవీకే)అధినేత, నటుడు సి.జోసెఫ్ విజయ్ పేరు ప్రస్తావించకుండా ముఖ్యమంత్రి స్టాలిన్ చాలా విమర్శలు చేశారు. కరూర్‌లో తలపెట్టిన ర్యాలీకి విజయ్ ఆలస్యంగా రావడం ఈ తొక్కిసలాటకు దారితీసి, ఘోరాతి ఘోరంగా నలభై ఒక్కమంది ప్రాణాలు పోయాయంటూ బాధిత కుటుంబాలకు ఆయన సభాముఖంగా తీవ్ర సానుభూతి తెలియ చేశారు. పోలీసుల నుంచి అనుమతి తీసుకున్న సమయానికి ఏ మాత్రం కట్టుబడకుండా టీవీకే పూర్తి భిన్నంగా, నిర్లక్ష్యంగా వ్యవహరించిందన్నారు. విజయ్ ఏడుగంటలు ఆలస్యంగా రావడంతో పాటు, ఆయన భారీ ప్రచారవాహనం జనం మధ్యనుంచి వెడుతున్న క్రమంలో గందరగోళం, తొక్కిసలాట చోటుచేసుకున్నాయని, ఈ క్రమంలో కొందరు జనరేటర్ గదిలోకి ప్రవేశించి దానిని నిలిపి వేశారని, ప్రజలకు కనీసం మంచినీళ్ళు కూడా ఆ పార్టీ ఏర్పాటు చేయలేదని స్టాలిన్ విమర్శించారు. క్షతగాత్రులకు సాయపడేందుకు వైద్యసిబ్బంది ప్రయత్నిస్తుంటే, టీవీకే కార్యకర్తలు రెండు అంబులెన్స్‌లమీద దాడిచేశారనీ, పదకొండు నిబంధనలతో పోలీసులు ఈ ర్యాలీకి అనుమతి మంజూరు చేస్తే, విజయ్‌పార్టీ వాటిని పాటించలేదనీ స్టాలిన్ ఆరోపణ. ఈ దారుణం జరగకుండా నివారించాల్సింది ప్రభుత్వమేననీ, స్టాలిన్ తన వైఫల్యం ఒప్పుకోవాల్సిందేనంటూ అన్నాడీఎంకె సభలో టీవీకేనీ, విజయ్‌నీ సమర్థించుకుంటూ వచ్చినందుకు ముఖ్యమంత్రికి మాచెడ్డకోపం వచ్చింది. మన విపక్షం మరోపార్టీ పక్షాన ఇంతగా ఎందుకు గొంతుచించుకుంటున్నదీ అంటే, పొత్తు కోసం... ఏది జరిగినా అధికారం మళ్ళీ మాదేనంటూ స్టాలిన్ ప్రకటించారు. కరూర్ విషాద ఘటన జరగ్గానే, పోలీసులు చెప్పిన విషయాలు, మంత్రులు చేసిన ఆరోపణలనే స్టాలిన్ చట్టసభలోనూ పునరుద్ఘాటించినట్టు కనిపిస్తున్నప్పటికీ, సీబీఐ దర్యాప్తుతో ఈ అంశం చేజారిపోతున్న కోపం, బాధ ఆయనకు ఉండటం సహజం.

కరూర్ ప్రశ్నలు...

సుప్రీంకోర్టు సోమవారం తీసుకున్న నిర్ణయంమీద విభిన్నమైన అభిప్రాయాలు, విశ్లేషణలూ సాగుతున్నాయి. ఒక ప్రఖ్యాత నటుడు, రాజకీయనాయకుడిగా అవతారమెత్తి ఒక భారీ ర్యాలీ సంకల్పించినప్పుడు సంభవించిన ఈ విషాదంమీద లోతైన దర్యాప్తు జరగాల్సిందే. అంచనాలను మించి జనాన్ని పోగేస్తున్న నిర్వాహకులు, అనుమతులు ఇచ్చిన ప్రభుత్వ వ్యవస్థలు బాధ్యతగా వ్యవహరించిందీ లేనిదీ తేలవలసిందే. ఆ పాపంలో ఎవరివాటాలూ కోటాలూ ఎంతో సీబీఐ అయితే కచ్చితంగా, పక్షపాతరహితంగా నిగ్గుతేలుస్తుందని అధికుల నమ్మకం. దీనికితోడు, సీబీఐ జరపబోయే ఈ దర్యాప్తు పర్యవేక్షణకు సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి అజయ్‌రస్తోగీ నేతృత్వంలో ముగ్గురు సభ్యుల కమిటీని కూడా సర్వోన్నత న్యాయస్థానం నియమించినందున, అటు కేంద్రం, ఇటు రాష్ట్రం ప్రమేయం ఉండదని ఓ నమ్మకం. దేశాన్ని కుదిపేసిన ఈ విషాదఘటనను తమిళనాట పార్టీలన్నీ రాజకీయం చేస్తున్న తరుణంలో వాటి ప్రభావాలకు అతీతంగా, అందనంత ఎత్తులో ఈ దర్యాప్తు జరగాలన్నది సుప్రీంకోర్టు అభిప్రాయం కావచ్చు.

అయితే, సుప్రీం నిర్ణయం మీద మద్రాస్ హైకోర్టు వైఖరి అధికంగా పనిచేసినట్టు కనిపిస్తోంది. టీవీకే కోరుతున్నట్టుగా సీబీఐ దర్యాప్తుకు హైకోర్టు అంగీకరించకపోవడమే కాక, విజయ్‌కు నాయకత్వ లక్షణాలు లేవని, ఘటన జరగ్గానే వారంతా పారిపోయారని సదరు న్యాయమూర్తి విమర్శలు చేయడంతోపాటు, విజయ్‌ను ఎందుకు అరెస్టు చేయలేకపోయారంటూ కొన్ని అనవసర, వివాదాస్పద వ్యాఖ్యలు చేయడం టీవీకే పార్టీకి కలిసొచ్చింది. రాష్ట్ర పోలీసుల మీద తమకు నమ్మకంలేదని, అది నియమించిన విచారణ కమిటీ తమకు వ్యతిరేకంగా పనిచేస్తున్నదని ఆరోపణలు చేస్తూ సీబీఐ దర్యాప్తును కోరుతున్న టీవీకే పార్టీ హైకోర్టు తీర్పును కూడా బూచిగా చూపడం, దానిని సుప్రీంకోర్టు అంగీకరించడంతో అంతిమంగా విజయ్ వాదనే నెగ్గింది. ఇప్పటివరకూ రాష్ట్రస్థాయిలో జరిగిన దర్యాప్తును అధ్యయనం చేసి, అందులో తీవ్రమైన లోటుపాట్లు ఉన్నపక్షంలో సీబీఐ గురించి సర్వోన్నత న్యాయస్థానం ఆలోచించివుంటే బాగుండేది. కానీ, విషాదానికి కారకులైనవారే తమకు ఏ విధంగా న్యాయం జరుగుతోందో చెప్పడం, తాము కోరుకున్న దానినే చివరకు సాధించుకోవడం విచిత్రం. మా పోలీసులమీద మాకు నమ్మకం లేదని ఓ రాజకీయనాయకుడో, ఓ పార్టీయో అన్నంతమాత్రాన సీబీఐ దర్యాప్తుకు ఆదేశిస్తే ఎలా? అని గతంలో వ్యాఖ్యానించిన సర్వోన్నతన్యాయస్థానమే, 'పంజరంలో చిలుక' అంటూ తాను తప్పుబట్టిన సంస్థకే ఈ కేసు అప్పగించడం విశేషం. మరో ఆరేడునెలల్లో తమిళనాడు ఎన్నికలకు వెళ్లనున్న నేపథ్యంలో, అంతలోగా నిజాలు వెలుగుచూడాలని కోరుకుందాం.

సనాతనమా, సామాజిక న్యాయమా?


భారత ప్రధాన న్యాయమూర్తి భూషణ్ రామకృష్ణ గవాయ్‌పై నిండు న్యాయస్థానంలో ఆయన విధి నిర్వహణలో ఉండగా జరిగిన బూటు దాడి అత్యంత ఆందోళనకరమైనది. దీని మీద దేశంలో ఆశించిన స్థాయిలో నిరసన వ్యక్తం కాలేదు. ముఖ్యంగా రాజ్యాంగ రక్షణ బాధ్యత గల ప్రభుత్వం నుంచి, పాలక పక్షం నుంచి తగిన స్థాయిలో ఖండన వెల్లడి కాలేదు. ఈ దాడి చేసిన లాయర్ రాకేశ్ కిశోర్ సనాతన ధర్మాన్ని ప్రస్తావించారు. దానిని కాపాడడమే తన దాడి ఉద్దేశమని స్పష్టం చేశారు. నేడు దేశాన్ని పాలిస్తున్నవారు అదే ధర్మానికి అండగా నిలబడినవారు కావడం ఇక్కడ గమనించవలసిన విషయం. తాను కూడా దళితుడనేనని 71 సంవత్సరాల రాకేశ్ కిశోర్ ప్రకటించారు. దళిత కోణానికి ఎక్కువ ప్రాధాన్యం లభించకుండా చూడడానికి ఈ దాడి చేయించినవారు అందుకు దళితుడినే ఉపయోగించారని భావించవచ్చు.

ఈ వివాదం నేపథ్యంలోకి వెళ్తే– ఖజురహోలో ముఖం తొలగించిన దేవతామూర్తి విగ్రహం తాను ఇష్టంగా ఆరాధించే విష్ణువు విగ్రహమనీ, దానిని పూర్వస్థితికి తీసుకువచ్చేలా కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించాలనీ కోరుతూ రాకేశ్ దలాల్ అనే వ్యక్తి సుప్రీంకోర్టులో దావా వేశారు. ఈ విగ్రహం మధ్యప్రదేశ్‌లోని ఖజురహో సముదాయంలోని జవారి ఆలయంలో ఉన్నది. ఖజురహో ఐక్యరాజ్యసమితి విద్య, వైజ్ఞానిక, సాంస్కృతిక సంస్థ – యునెస్కో పరిధిలోనిది. మొగలాయీల కాలంలో దెబ్బతిన్నదని చెబుతున్న ఈ విగ్రహం శతాబ్దాలుగా భారత పురాసర్వే సంస్థ (Archeological Survey of India–ఏఎస్ఐ) నిరాదరణకు గురి అవుతున్నదని పిటిషనర్ అభిప్రాయపడ్డారు. తమ ఇష్టదైవం పరిపూర్ణ విగ్రహాన్ని ఆరాధించడానికి భక్తులకు గల ప్రాథమిక హక్కును ఇది ఉల్లంఘిస్తున్నదని అన్నారు. దేశ పౌరులకు ఆరాధనా స్వేచ్ఛను హామీ ఇస్తున్న రాజ్యాంగం 25వ అధికరణ కింద జనహిత వ్యాజ్యాన్ని పిటిషనర్ దాఖలు చేశారు.

దేశంలోని ప్రార్థనాలయాలు స్వాతంత్ర్యం వచ్చిన నాటికి ఏ స్థితిలో ఉన్నాయో వాటిని అలాగే కొనసాగనివ్వాలని చెప్పుకున్న గాఢ సంకల్పానికి విరుద్ధంగా సాగుతున్న మతోన్మత్తత సమాజాన్ని విభజించి ఎంత అల్లకల్లోలాన్ని సృష్టిస్తున్నదో సీజేఐకి తెలుసు. అటువంటి మరో విపత్తు తలెత్తరాదన్న జాగరూకతతోనే పిటిషనర్‌ను నిరుత్సాహపరిచే వ్యాఖ్యలను ఆయన చేశారని బోధపడుతున్నది.

దీనికి సమాధానంగా 'ముఖం కోల్పోయిన పురాతన విగ్రహాన్ని అలాగే ఉంచవలసిన బాధ్యత తమపై ఉన్నదనీ, దాని స్థానంలో కొత్త దానిని చేర్చడం పురా సంపద పరిరక్షణ నియమాలనూ, ఆ మేరకు గల అంతర్జాతీయ వారసత్వ నిబంధనలనూ ఉల్లంఘించడమే అవుతుందనీ ఏఎస్ఐ స్పష్టం చేసింది. జస్టిస్ గవాయ్ సారథ్యంలోని ధర్మాసనం ఇదే విషయాన్ని విశదీకరించి పిటిషన్‌ను కొట్టివేసింది. దీనిని ప్రజాప్రయోజన వ్యాజ్యం అనడానికి బదులు ప్రచార ప్రయోజన వ్యాజ్యం (publicity interest litigation) అని జస్టిస్ గవాయ్ వ్యాఖ్యానించారు. 'మీరు గాఢమైన విష్ణుభక్తుడినని చెప్పుకుంటున్నారు కాబట్టి విగ్రహ పునరుద్ధరణకు ఆయన్నే ప్రార్థించండి' అని విచారణ సమయంలో పిటిషనర్‌ను ఉద్దేశించి జస్టిస్ గవాయ్ అన్నారని తెలిసింది. "సనాతన ధర్మాన్ని అవహేళన చేయడాన్ని సహించబోము" అని లాయర్ రాకేశ్ కిశోర్ బూటు విసురుతూ అరిచారు.

తనపై దాడి సమయంలో గవాయ్ మెచ్చుకోదగిన ప్రశాంతతను, పరిణతిని ప్రదర్శించారు. ఆయన తలచుకుంటే రాకేశ్ కిశోర్ అరెస్టుకు ఆదేశించి ఉండవచ్చు, ఆగ్రహోదగ్రులు కావొచ్చు. కాని కోపం తెచ్చుకోలేదు. తన పని తాను చేసుకుంటూ పోయారు. పైపెచ్చు "ఇటువంటి ఘటనలను పట్టించుకోవద్దు, మేమూ పట్టించుకోవడం లేదు, ఇటువంటివి నన్ను ప్రభావితం చేయజాలవు" అన్నారు. దాడి చేసిన వ్యక్తిపై ఎటువంటి చర్యా తీసుకోవద్దని కోర్టును ఆదేశించారు. అప్పటికీ పిటిషనర్ ఆధ్యాత్మిక విశ్వాసాలను, దైవ భక్తిని సీజేఐ అవహేళన చేశారనీ భక్తుల మనోభావాలను గాయపరిచారనీ ఆరోపించేవారు ఉంటారు. అత్యున్నత న్యాయస్థానం దేశ సెక్యులర్ మనుగడకు అభయమిచ్చే రాజ్యాంగానికి రక్షణ కోట. దేశంలోని ప్రార్థనాలయాలు స్వాతంత్ర్యం వచ్చిన నాటికి ఏ స్థితిలో ఉన్నాయో వాటిని అలాగే కొనసాగనివ్వాలని చెప్పుకున్న గాఢ సంకల్పానికి విరుద్ధంగా సాగుతున్న మతోన్మత్తత సమాజాన్ని విభజించి ఎంత అల్లకల్లోలాన్ని సృష్టిస్తున్నదో



సీజేఐకి తెలుసు. అటువంటి మరో విపత్తు తలెత్తరాదన్న జాగరూకతతోనే పిటిషనర్‌ను నిరుత్సాహపరిచే వ్యాఖ్యలను ఆయన చేశారని బోధపడుతున్నది. విగ్రహాలను చెక్కేసి వాటి రూపు రేఖలను కప్పిపుచ్చి అన్యమత విగ్రహాలుగా మార్చడం గురించి చాలా చర్చ జరిగింది. బౌద్ధ విగ్రహాలను హిందూ దేవతల విగ్రహాలుగా మార్చారనే విమర్శ కొత్తది కాదు. ప్రస్తుత కేసులో విష్ణు విగ్రహంగా పిటిషనర్ పేర్కొంటున్న విగ్రహం కూడా బుద్ధ విగ్రహం అయి ఉంటే ఆశ్చర్యపోవలసినపని లేదని కొందరు మేధావుల అభిప్రాయం.

ఈ కేసులో పిటిషనర్ తన వాదనకు మద్దతుగా పేర్కొన్న రాజ్యాంగ అధికరణ 25 గురించి చూద్దాం. ఎటువంటి విశ్వాసాన్నైనా కలిగివుండే స్వాతంత్ర్యాన్ని భారత పౌరులకు ఈ అధికరణ ఇస్తున్నది. అలాగే శాంతిభద్రతలకు భంగం వాటిల్లని రీతిలో తన మతాన్ని అవలంబించే, దానిని ప్రచారం చేసుకునే స్వేచ్ఛనూ ప్రసాదిస్తున్నది. భారత రాజ్యాంగం 49వ అధికరణ జాతీయ ప్రాధాన్యం గల విగ్రహాలు, కళాఖండాలు, స్థలాలు మున్నగువాటిని కాపాడే బాధ్యతను ప్రభుత్వంపై ఉంచుతున్నది. తవ్వకాల్లో, ఇతరత్రా లభించిన విగ్రహాలను దొరికినవాటిని దొరికినట్టు భద్రపరచవలసిన బాధ్యత ఇందులో ఇమిడి ఉంది. వాటికి ఎటువంటి మార్పులు చేసినా సీజేఐ అన్నట్టు దానివల్ల వాటి సాధికారత దెబ్బ తింటుంది. ఇది ఆర్టికల్ 49కి విరుద్ధం.

సర్వమత సమానత్వాన్ని కాంక్షించే రాజ్యాంగాన్ని విఫలం చేయించడానికి బీజేపీ పడుతున్న తాపత్రయం తెలిసిందే. సనాతనం కుల వ్యవస్థను పెంచి పోషించిందనీ, మెజారిటీ ప్రజలను శారీరక శ్రమకు పరిమితం చేసి, వారిని, స్త్రీలను విద్యకు, జ్ఞానానికి దూరంగా ఉంచిందనీ సామాజిక న్యాయవాదులు స్పష్టం చేస్తుండగా, సనాతనవాదులు అది ఎలా అబద్ధమో చెప్పలేకపోతున్నారు. కులవివక్ష, స్త్రీలపై అణచివేత అంతరించి దేశం ముందుకు పోవాలంటే సనాతనం వెనుకడుగు వేయాలి. దానిని కాపాడుకోవలసిన అవసరమేమిటో సనాతనవాదులు చెప్పలేకపోతున్నారు. దానికి బదులు ప్రగతివాదులపై దాడులకు సమకడుతున్నారు.

జస్టిస్ గవాయ్ ఇటీవల వియత్నాంలో ఒక సభలో మాట్లాడుతూ, కింది కులంలో పుట్టిన తాను రాజ్యాంగం వల్లనే సమానత్వాన్ని చవి చూసి పైకి వచ్చానని చెప్పుకున్నారు. ఇంత కాలానికి సనాతనాన్ని పునరుద్ధరించాలని కోరే శక్తులది పైచేయి అయింది. కింది కులాలకు అందిన ఈ సౌభాగ్యాన్ని వారికి దూరం చేసి దానిని నిర్మూలించాలని అవి చూస్తున్నాయి. సామాజిక దోపిడీని స్థిరపరచిన సంప్రదాయాన్ని, సనాతనాన్ని కనుమరుగు చేయడానికి అవసరమైన సాంస్కృతిక విప్లవం మన దేశంలో చోటుచేసుకోకపోవడమే ఇందుకు ముఖ్య కారణం. చైనాలో మావో తెచ్చిన సాంస్కృతిక విప్లవాన్ని ఎవరు ఎన్ని విధాలుగా విమర్శించినా అది తీసుకొచ్చిన సామాజిక చైతన్యాన్ని గుర్తించకుండా ఉండలేం. అది చైనా సమాజంలోని సంప్రదాయ సామాజిక శ్రేణులను, హెచ్చు తగ్గులను తొలగించింది. శతాబ్దాలుగా ఊడలు తన్నుకున్న ఫ్యూడల్ ఆధిపత్య వర్గాల కాడిని కిందికి దించి, వారికి ప్రశ్నించడం నేర్పి గ్రామీణుల చేతి ఆయుధమైంది. అంతవరకు ఉన్నతవర్గాల గుప్పెట్లోగల విద్య, జ్ఞానం ప్రజాపరం అయ్యేలా చేసింది. హేతువుకు, శాస్త్రీయ విద్యకు ప్రాణం పోసింది. మన దేశంలో కూడా అటువంటిది రెక్క విప్పుకోవాలి. సనాతన వాదుల ఉక్కు కౌగిట్లో రాజ్యాంగనీతి విలవిలలాడుతున్నది. దీని ఫలితమే సీజేఐపై బూటు దాడి.

◆ గార శ్రీరామమూర్తి

ఆరెస్సెస్‌ను లాగడం ఎందుకు?

'ఈ అధర్మ దాడికి జవాబుదారీ ఎవరు?' అనే శీర్షికతో అక్టోబర్ 10న రాజ్‌దీప్ సర్దేశాయి రాసిన వ్యాసానికి నా ప్రతిస్పందన ఇది. ఈ వ్యాసం వాస్తవ విషయాలను కప్పిపుచ్చేలా ఉంది. భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్ గవాయ్‌పై రాకేశ్ కిశోర్ అనే లాయర్ బూటును విసిరివేయడానికి, ఆరెస్సెస్ ఆలోచనా విధానానికి సంబంధం ఏమిటి? ఈ దేశ హితాన్ని కోరే ఏ భారతీయుణ్ణి అడిగినా రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ త్యాగం, శీలం, సేవాభావం, దేశభక్తి, అనుశాసనం, కర్తవ్యం, నిష్ఠ వంటి విషయాలలో తన కార్యకర్తలకు శిక్షణ ఇస్తుందని ఠక్కున చెబుతాడు. అదే భారతీయుడు ఈ సంస్థను పనిగట్టుకుని అనవసరంగా, అసందర్భంగా దూషించే వాళ్ళ నైజాన్ని కూడా చక్కగానే చెబుతాడు.

ఇక సీజేఐపై బూటు విసిరిన వ్యక్తి రాకేశ్ కిశోర్ కాకుండా రహీంఖాన్ అయి ఉంటే ఏమి జరిగేది? అనే ప్రశ్నకు– '15 నిమిషాలు పోలీసులను పక్కన పెడితే, ఈ దేశంలో ఉండే హిందువులందరినీ (ఇందులోకి ఈ దేశంలోని హిందూ న్యాయమూర్తులు అందరూ వస్తారని ఒప్పుకుంటే) ముస్లింలు మట్టుపెడతార'ని గతంలో భీషణ ప్రతిజ్ఞ చేసిన అక్బరుద్దీన్ ఓవైసీ వ్యాఖ్యే సరైన సమాధానం.

ఇక ఖజురహో ఆలయంలోని విష్ణుమూర్తి విగ్రహ విషయమై ఒక వ్యక్తి దాఖలు చేసిన పిటిషన్ విషయంపై ప్రధాన న్యాయమూర్తి చేసిన వ్యంగ్య వ్యాఖ్యలపై దేశంలో పెద్ద చర్చ చెలరేగింది. ఆయన వ్యాఖ్యలపై అనేకమంది సోషల్ మీడియా ప్లాట్ ఫామ్స్‌పై తమ నిరసనలను వ్యక్తం చేశారు. వాస్తవంగా ఆయన అలాంటి వ్యాఖ్యలు చేయకూడదు. ఇస్లాం మతంపై తప్పుడు వ్యాఖ్యలు చేసిన నుపుర్ శర్మ విషయంలో సుప్రీంకోర్టు న్యాయమూర్తులు దేశ ప్రజలకు చెప్పిన సుద్దుల కథ ఏమిటి? లౌకికవాద ముసుగు వేసుకున్న ప్రతి రాజకీయ నాయకుడు హిందువుల ఆచారాలను, సంప్రదాయాలను, జీవన విధానాలను దునుమాడడమే లౌకికవాద పరిరక్షణగా భావిస్తున్న ఈ దేశంలో న్యాయమూర్తులకు కూడా ఆ హక్కు ఉంటుందని భావించాలా?



సీజేఐపై దాడి జరుగుతుంది కాబట్టి తాను వెంటనే స్పందించడానికి రెడీగా ఉండాలని ప్రధానమంత్రి ఊహిస్తారా? గాడ్సే గాంధీని చంపడానికి, సీజేఐపై ఒక లాయర్ బూటు విసరడానికి సంబంధం ఏమైనా ఉందా? దీనిని విజ్ఞులు ఒప్పుకుంటారా? ఈ దాడి ఆరెస్సెస్ భావజాల పరంపరలోనిదని చెప్పడం విడ్డూరంగా ఉంది. ఆరెస్సెస్ హింసను ప్రేరేపించదు.

సీజేఐపై దాడి గురించి న్యాయశాఖ మంత్రి మౌనంగా ఉన్నారని, ఈ ఘటన సంభవించిన ఎనిమిది గంటల అనంతరం ప్రధానమంత్రి స్పందించారని చెప్పడం, ఈ విషయానికి సంబంధం లేని బీజేపీ ఎంపీ ప్రజ్ఞాఠాకూర్ సింగ్ విషయాన్ని ఇందుకు జోడించి చెప్పడం వెనుక వ్యాసకర్త దురుద్దేశం అర్థమైంది. కేంద్ర మంత్రివర్గాన్ని నడిపించేది ప్రధానమంత్రి. దేశానికి సంబంధించిన ముఖ్యమైన విషయంపై ఆయనే మాట్లాడాలి. ఇది పార్లమెంటరీ వ్యవస్థలో ఒక నియమం. సీజేఐపై దాడి జరుగుతుంది కాబట్టి తాను వెంటనే స్పందించడానికి రెడీగా ఉండాలని ప్రధానమంత్రి ఊహిస్తారా? గాడ్సే గాంధీని చంపడానికి, సీజేఐపై ఒక లాయర్ బూటు విసరడానికి సంబంధం ఏమైనా ఉందా? దీనిని విజ్ఞులు ఒప్పుకుంటారా?

ఇక ప్రస్తుత ప్రధాన న్యాయమూర్తి రెండవ దళితుడని చెప్పడం... కుల వైషమ్యాలను ప్రోదిచేసేలా ఉంది. వాస్తవంగా జస్టిస్ బి.ఆర్ గవాయ్ తాను తొలి బౌద్ధ న్యాయమూర్తినని చెప్పుకున్నారు. బౌద్ధంలో కులాలు లేవు అనే విషయం ఈ వ్యాసకర్తకు తెలియదేమో! దళిత ఉద్యమంతో కుటుంబ మూలాలు ఉన్నందువల్ల ఈ దాడి జరిగిందని చెప్పడం పచ్చి అబద్ధం. దళిత ఉద్యమాల నేపథ్యమున్న అనేకమంది ఆరెస్సెస్‌లో ప్రముఖ బాధ్యతల్లో ఉన్నారు. ఈ దాడి ఆరెస్సెస్ భావజాల పరంపరలోనిదని చెప్పడం విడ్డూరంగా ఉంది. ఆరెస్సెస్ హింసను ప్రేరేపించదు. ఈ దేశం నాది అనే భావనను దేశీయులలో నిర్మాణం చేస్తుంది.

ఇక బుల్డోజర్ న్యాయానికి వ్యతిరేకంగా జస్టిస్ బి.ఆర్ గవాయ్ తీర్పు హిందుత్వవాదులకు కోపం తెప్పించిందని చెప్పడంలో అంతర్యం ఏమిటి? బూటు విసిరిన రాకేశ్ కిశోర్ హిందుత్వ సంస్థల ప్రతినిధి కాదే! ఆయన ఏనాడు హిందుత్వ సంస్థల కార్యకలాపాలలో పాల్గొన్న దాఖలాలు కూడా లేవు. బీజేపీ ప్రతినిధి నుపుర్ శర్మ ఫొటోను స్టేటస్‌లో పెట్టుకున్నందుకు టైలర్ కన్హయ్య లాల్‌ను హత్య చేసి, వీడియోను తీసిన సంఘటనతో పోలిస్తే, రాకేశ్ కిశోర్ చేసిన పని ఎలాంటిది? దోషులు హిందువులు అయితే ఒక వాదన, ముస్లింలు అయితే మరొక వాదన. ఈ వాదనల పరంపరతోనే ఘనత వహించిన వక్రబుద్ధి లౌకికవాదం నడుస్తోంది.

ఇక ఈ బూటు దాడి ఒక రాజకీయ లక్ష్యంతో జరిగిందని చెప్పడం పెద్ద జోక్. ఒక వ్యక్తి తన మత భావాలను అవహేళన చేశాడనే క్షణికావేశంతో చేసిన చర్యకు ఇలాంటి పెద్ద పెద్ద విశ్లేషణలు చేయడం విజ్ఞత అనిపించుకోదు. రాకేశ్ కిశోర్ తన బూటు దాడిలో జస్టిస్ గవాయ్‌నే కాకుండా వివేకవంతమైన, న్యాయబద్ధంగా, వివక్షారహితంగా పనిచేస్తున్న న్యాయ వ్యవస్థను కూడా లక్ష్యంగా చేసుకున్నారని చెప్పడం వెనక అంతర్యం ఏమిటి? మన దేశ న్యాయ వ్యవస్థలో పనిచేసే న్యాయమూర్తుల్లో సగం మంది అవినీతిపరులని సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ మార్కండేయ ఖట్జూ వ్యాఖ్యానించిన విషయం విదితమే. అలాగే జస్టిస్ తరుణ్ గొగోయ్‌పై లైంగిక వేధింపుల కేసు, జస్టిస్ రామస్వామిపై అవినీతి ఆరోపణలు, ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి యశ్వంత్ వర్మ ఇంట్లో నోట్ల కట్టలు దొరకడం, తమకు అనుకూలమైన వ్యక్తులను కొలీజియం ద్వారా న్యాయమూర్తులుగా అపాయింట్ చేసుకోవడం, భయంకరమైన నేరాల విషయంలో బెయిల్ మంజూరు చేయడంలో కపిల్ సిబల్ లాంటి లాయర్ల ప్రభావానికి లోనుకావడం వంటి విషయాలను పరిశీలిస్తే మన న్యాయ వ్యవస్థ వివేకవంతమైనది, వివక్షారహితమైందని చెప్పడానికి సరైన ఆనవాళ్లు దొరకవు.

ఇక చివరగా కులాన్ని, మతాన్ని, భాషను, ప్రాంతాన్ని, ఆలంబనగా చేసుకుని, గోరంతను కొండంతలుగా చిత్రీకరించి తాము మాత్రమే మేధావులమని, తాము చెప్పింది నిజమని భ్రమింపజేయాలని ప్రయత్నించేవారు మితవాదులైనా, కుహనా లౌకికవాదులైనా భంగపాటు తప్పదు.

• ఉల్లి బాలరంగయ్య
సామాజిక, రాజకీయ విశ్లేషకులు

తెలుగు తల్లి – తెలంగాణ తల్లి

తెలంగాణ ఉద్యమం కేవలం రాజకీయ సరిహద్దుల కోసం జరగలేదు. అది ఒక భావోద్వేగ, సాంస్కృతిక, ఆత్మగౌరవ ఉద్యమం. ఈ ఉద్యమంలో 'తెలంగాణ తల్లి' అనే ప్రతీక తెలంగాణ ఆత్మను ప్రతిబింబిస్తూ అవతరించింది. ఆ ప్రతీక తెలంగాణ ప్రజల చరిత్ర, భూభాగం, సంస్కృతి, యాసలకు ప్రతీకగా నిలిచింది. ఈ సాంస్కృతిక నిర్మాణంలో ఒక గందరగోళం కూడా రూపుదిద్దుకుంది. అదే 'తెలుగు తల్లి, తెలంగాణ తల్లి' అనే రెండు భావనల మధ్య ఉన్న అస్పష్టత.

హైదరాబాద్‌లోని తెలుగుతల్లి ఫ్లైఓవర్‌ను 'తెలంగాణ తల్లి' ఫ్లైఓవర్‌గా మారుస్తూ ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ఈ చర్చను మరింత ఉధృతం చేసింది. ఒక వర్గం దీన్ని తెలంగాణ గౌరవానికి ప్రతీకగా స్వాగతిస్తే, మరొక వర్గం దీన్ని తెలుగు భాషా ఐక్యతకు విరుద్ధమని అభిప్రాయపడింది. ఈ సందర్భంలో తెలుగు భాషకు, తెలంగాణ భౌగోళిక అస్తిత్వానికి మధ్య స్పష్టమైన గీత గీయడం అత్యవసరం.

తెలుగు భాష కేవలం ఒక మాటల వ్యవహారమేమీ కాదు; అది శతాబ్దాల సాంస్కృతిక ప్రవాహం. నన్నయ, తిక్కన, పోతన, శ్రీనాథుడు, అన్నమయ్య, త్యాగయ్య, దాశరథి వంటి మహానుభావులు ఈ భాషకు దిశా నిర్దేశం చేశారు. ఈ భాష కేవలం ఆంధ్రప్రదేశ్‌ది కాదు, తెలంగాణదీ కాదు. రెండింటికీ సమానంగా సొంతం. కాకతీయుల గర్వం, శాతవాహనుల శక్తి, భద్రాచలం రామదాసు, బాసర సరస్వతి, కూచిపూడి, పేరిణీ నృత్యాలు... ఇవన్నీ రెండు ప్రాంతాల సంస్కృతిలో అంతర్భాగాలే. భౌగోళిక సరిహద్దులు మారినా ఈ వారసత్వం విడిపోదు. కానీ రాజకీయ అవసరాలు ఈ ఉమ్మడి సంస్కృతిని విభజించాలనే ప్రయత్నం చేస్తున్నాయి. 'తెలంగాణ యాస' అనేది తెలుగు భాషలోని ఒక విలువైన వర్ణం; అది స్వతంత్ర భాష కాదు. దానిని వేరు చేసి చూపించడం అంటే... భాషా ఐక్యతకు బీటలు వేయడమే.

ప్రపంచీకరణ యుగంలో స్థానిక భాషలు తమ అస్తిత్వం కోసం పోరాడుతున్నాయి. ఇంగ్లీష్, హిందీ ఆధిపత్యం పెరుగుతున్న వేళ తెలుగు భాష మనకోసం కాకుండా, మనమే దాని కోసం పోరాడాల్సిన సమయం వచ్చింది. రాజకీయ ప్రతీకల కోసం పేర్ల మార్పులు చేయడం, ఉత్సవాల్లో మాత్రమే తెలుగు మాట్లాడడం... వంటివి సరిపోవు. సాహిత్యం, సినిమా, విద్య, సాంకేతికత, సామాజిక మాధ్యమాల ద్వారా తెలుగు భాషను ఆధునికతతో మేళవించి యువతకు చేరువ చేయాలి.

భాషను కాపాడేది ప్రభుత్వాలు కాదు, ప్రజలు. మనందరిలోనూ తెలుగు భాష పట్ల గౌరవం ఉండాలి. పిల్లలు ఇతర భాషలు నేర్చుకోవడం తప్పు కాదు, కానీ తెలుగు మర్చిపోవడం తప్పు. తెలుగు పాఠ్యపుస్తకాలు, పత్రికలు, డిజిటల్ మీడియా, పాడ్‌కాస్ట్‌లు, సినిమాలు... ఇవన్నీ భాషా సంరక్షణకు సాధనాలుగా మారాలి. భాషకు సంబంధించినంత వరకూ తెలంగాణ, ఆంధ్రా అనే పేర్లు పెట్టుకుని విభజించుకోవడం కంటే 'మన తెలుగు' అనే భావనను బలపరచాలి. తెలుగు భాషలోని విభిన్న యాసలు, పదాలు, పాటలు అన్నీ కలిసి ఒక మహా ప్రవాహాన్ని సృష్టిస్తాయి. ఆ ప్రవాహాన్ని విభజించాలనుకోవడం అంటే సాహిత్యాన్ని కూడా రెండు సగాలుగా విడగొట్టడమే. పాలకులు, ప్రజలు, పండితులు... అందరూ ఈ భాషా వారసత్వాన్ని కొత్త తరాలకు అందించే కర్తవ్యాన్ని స్వీకరించాలి. తెలుగు తల్లి మన సాహిత్యానికి చిహ్నం, తెలంగాణ తల్లి మన సంస్కృతికి చిహ్నం. ఈ రెండూ కలిస్తేనే మన తెలుగు సంపూర్ణ రూపం.

– శ్రీనివాస్ గౌడ్ ముద్దం

లద్దాఖ్‌కు కొత్త పాలనా నమూనా

జమ్మూ-కశ్మీర్‌లో భాగంగా ఉన్న లద్దాఖ్‌ను 2019లో కేంద్ర పాలిత ప్రాంతం (యూటీ)గా ఏర్పాటు చేశారు. హిమాలయాల చెంతన సున్నితమైన పర్యావరణ వ్యవస్థతో మనుగడ సాగిస్తున్న తమ ప్రాంతం శీఘ్ర అభివృద్ధికి నోచుకోగలదని లద్దాఖీలు ఆశించారు. రాజకీయవేత్తలు, పాలనాధికారులు, ఉపాధి, ఉద్యోగాలను ఆశిస్తున్న యువజనులు తమ ఆకాంక్షలు నెరవేరే శుభ తరుణం ఆసన్నమయిందని యూటీ ఆవిర్భావాన్ని స్వాగతించారు. అయితే గత ఆరు సంవత్సరాలుగా ఎవరి ఆకాంక్షలు, ఆశాభావాలు నెరవేరనేలేదు. ఆందోళనలు, నిరాహార దీక్షలు, న్యూఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద ధర్నాలు కొనసాగుతున్నాయి. జమ్మూ-కశ్మీర్‌లో భాగంగా ఉన్నప్పుడు రాష్ట్ర కేబినెట్‌లో కనీసం తమ ప్రతినిధి ఒకరు ఉండేవారని, ఇప్పుడు బయటి నుంచి వచ్చిన లెఫ్టినెంట్ గవర్నర్ చేతుల్లోనే సమస్త అధికారాలు కేంద్రీకృతమయ్యాయని లద్దాఖీలు వాపోతున్నారు. తమ న్యాయబద్ధమైన 'స్వయం పాలనాహక్కు'ను కోల్పోయామని ఆగ్రహిస్తున్నారు. లోక్‌సభలో తమకు రెండు సీట్లు కేటాయించాలని, లేహ్‌తో పాటు కార్గిల్‌కు కూడా ప్రాతినిధ్యం కల్పించాలని లద్దాఖీలు డిమాండ్ చేస్తున్నారు. 1990ల్లోనే లద్దాఖ్‌ను యూటీగా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ లద్దాఖీలు పెద్ద ఎత్తున ఉద్యమించారు. హింసాత్మకంగా పరిణమించిన ఆ ఉద్యమాన్ని అదుపు చేసేందుకు జరిగిన పోలీసు కాల్పుల్లో పలువురు మరణించారు 2019లో యూటీ ప్రతిపత్తి లభించడంతో లద్దాఖ్‌కు ఢిల్లీ తరహాలో శాసనసభ ఉన్న యూటీగా చేయాలని లేదా భారత రాజ్యాంగంలోని 6వ షెడ్యూలులో చేర్చాలని లద్దాఖీలు డిమాండ్ చేస్తున్నారు. ఈ రెండు డిమాండ్లను రాజ్యాంగ నిబంధనలు, ప్రజాస్వామిక పాలనా పద్ధతుల ఆచరణ ప్రాతిపదికన నిశితంగా పరిశీలించవలసిన అవసరమున్నది.

1956లో భాషా ప్రయుక్తత సూత్ర ప్రాతిపదికన రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణ జరిగినప్పుడు దేశ సమగ్రత, సమైక్యతను సంరక్షించుకునే లక్ష్యంతో సరిహద్దు ప్రాంతాలను కేంద్ర పాలిత ప్రాంతాలుగా ఏర్పాటు చేయాలనే ప్రతిపాదన కూడా జస్టిస్ ఫజల్ అలీ కమిషన్ పరిశీలనకు వచ్చింది. అయితే బాహ్య సరిహద్దులు స్థిరమైనవని, అంతర్గత సరిహద్దులు పార్లమెంటు ఆమోదంతో మార్పు పొందగలిగేవని రాజ్యాంగంలోని అధికరణ 3 నిర్దేశించినందున ఆ ప్రతిపాదనను పరిశీలనకు తీసుకోలేదు. పశ్చిమ బెంగాల్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా (1964) కేసులో ఆరుగురు న్యాయమూర్తుల సుప్రీంకోర్టు ధర్మాసనం కూడా ఇదే విషయాన్ని స్పష్టం చేసింది. 'రాష్ట్రాల సరిహద్దుల మార్పుకు వ్యతిరేకంగా రాజ్యాంగబద్ధమైన హామీ ఏమీ లేదని' విపులంగా వివరిస్తూ ఆ ధర్మాసనం తన తీర్పును ఇలా ముక్తాయించింది: 'రాష్ట్రాల సరిహద్దులు మార్చేందుకు లేదా ఒక రాష్ట్రం భౌగోళిక వైశాల్యాన్ని కుదించేందుకు కూడా పార్లమెంటుకు అధికారమున్నది'. కేంద్ర ప్రభుత్వం, జాతీయ రాజధాని ప్రాంత (ఢిల్లీ) ప్రభుత్వం మధ్య అధికారాల విభజన విషయాన్ని పరిశీలించిన ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం మే 2023లో ఈ క్రింది అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది: 'ఇతర కేంద్ర పాలిత ప్రాంతాలను ఢిల్లీ నమూనా కేంద్ర పాలిత ప్రాంతంతో పోల్చడానికి వీలు లేదు. ఎన్‌సిటి (ఢిల్లీ) ఒకే ఒక్కటి. దాని తరహా కేంద్ర పాలిత ప్రాంతం మరొకటి లేదు. ఢిల్లీ నమూనాను మరే కేంద్ర పాలిత ప్రాంతం ఏర్పాటులో అనుసరించడానికి వీలు లేదు'.

లద్దాఖ్‌ను భారత రాజ్యాంగంలోని ఆరవ షెడ్యూలులో చేర్చాలన్న డిమాండ్ విషయాన్ని చూద్దాం. సున్నితమైన హిమాలయ పర్వత పర్యావరణ వ్యవస్థ ఉన్న లద్దాఖ్‌లోని గిరిజనుల ప్రత్యేక జీవన సంస్కృతిని సంరక్షించేందుకు ఈ కేంద్ర పాలిత ప్రాంతాన్ని ఆరవ షెడ్యూలులో చేర్చాలన్న లద్దాఖీల డిమాండ్‌కు విస్తృత మద్దతు కూడా లభిస్తోంది. 'ఆరవ షెడ్యూలు' ప్రస్తావనకు వచ్చినప్పుడు ఈశాన్య భారత రాష్ట్రమైన మేఘాలయ తప్పక గుర్తుకు వస్తుంది. రాజధాని షిల్లాంగ్ మినహా మిగతా మేఘాలయ అంతా పూర్తిగా ఆరవ షెడ్యూలులో ఉన్న రాష్ట్రం. షిల్లాంగ్ ఒక మునిసిపాలిటీ మాత్రమే. స్వాతంత్ర్యానికి పూర్వం ఈశాన్య భారత గిరిజన తెగలకు స్వతంత్ర ప్రతిపత్తి కల్పించాలని ఉద్యమించిన నికోలస్ రాయ్ (1884–1959), అసోం తొలి ముఖ్యమంత్రి గోపీనాథ్ బోర్డోలోయ్ (1890–1950) కృషి ఫలితంగా నాడు అసోంలో భాగంగా ఉన్న గిరిజన ప్రాంతాలకు స్వాతంత్ర్యానంతరం స్వతంత్ర ప్రతిపత్తి కల్పించారు. ఆరవ షెడ్యూలు రాష్ట్రంగా ఉండడమంటే ఏమిటి? మేఘాలయకు అదనపు అడ్వకేట్ జనరల్‌గా పనిచేసిన అనుభవంతో వాస్తవ పరిస్థితులను పేర్కొంటాను: మేఘాలయలో పంచాయత్‌లు గానీ, పురపాలక సంఘాలు గానీ లేవు. సంప్రదాయ గ్రామీణ పాలనా సంస్థలే ఇప్పటికీ కొనసాగుతున్నాయి. తెగ పెద్దలే వాటిని అజమాయిషీ చేస్తుంటారు. ఈ కారణంగా రాజ్యాంగ 73, 74 సవరణల ప్రకారం స్థానిక స్వపరిపాలనా సంస్థలకు కేంద్రం నుంచి రావాల్సిన నిధులు మేఘాలయకు దక్కడం లేదు. కనుకనే ఆరవ షెడ్యూలును జస్టిస్ హిదయతుల్లా 'రాజ్యాంగంలో రాజ్యాంగం'గా అభివర్ణించారు. ఆరవ షెడ్యూలుకు ఒక ప్రత్యేక ప్రతిపత్తి ఉన్నదని ఆయన వ్యాఖ్యానించారు.

భారత రాజ్యాంగంలోని అధికరణ 370 ప్రకారం జమ్మూ-కశ్మీర్‌కు సొంత రాజ్యాంగం ఉన్నది. ఆ రాష్ట్ర ప్రజలు ఎన్నుకున్న రాజ్యాంగ సభ ఆ ప్రత్యేక రాజ్యాంగాన్ని రూపొందించింది. అయితే అధికరణ 370 రద్దు జమ్మూ-కశ్మీర్ రాజ్యాంగం కింద కాకుండా రాష్ట్రపతి నోటిఫికేషన్ ద్వారా జరిగింది. ఇక్కడ ప్రశ్న ఏమిటంటే ఆరవ షెడ్యూలు లద్దాఖ్ ప్రజల ప్రత్యేక అవసరాలను ఎలా తీర్చగలుగుతుది? మేఘాలయలో విఫలమైన ఆరవ షెడ్యూలు లద్దాఖ్ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడంలో సఫలమవుతుందా? 2019లో రాష్ట్ర ఏర్పాటుకు ఒక ప్రమాణాన్ని నిర్ధారించకపోవడం వల్లే లద్దాఖ్ ప్రతిపత్తి సమస్యాత్మకంగా పరిణమించింది. ఢిల్లీ తరహా యూటీగా ఏర్పాటు చేయడం లేదా ఆరవ షెడ్యూలులో చేర్చడం అనేవి లద్దాఖ్ సమస్యలను పరిష్కరించలేవు. లద్దాఖ్ ప్రత్యేక పరిస్థితులు, అవసరాలకు అనుగుణంగా ఒక కొత్త సమాఖ్య పాలనా నమూనాను అనుసరించవలసిన అవసరమున్నది. ఇందుకు కొత్త రాష్ట్రాల సృష్టి ప్రక్రియకు ఒక ప్రాతిపదిక సూత్రాన్ని రూపొందించవలసి ఉన్నది. భారత్ ఒక సమాఖ్య రాజ్యం. కనుక కొత్త రాష్ట్రాల ఏర్పాటు, ఏర్పాటైన తరువాత పాలన ఎలా ఉంటుందో అంచనా వేసే ఫెడరల్ ఇండెక్స్ ఆఫ్ స్టేట్ ఫార్మేషన్ అండ్ రీ-ఆర్గనైజేషన్‌ను రూపొందించవల్సి ఉన్నది. ప్రత్యేక రాష్ట్రాల ఏర్పాటు డిమాండ్లను పరిశీలించి రాష్ట్రాలను పునర్వ్యవస్థీకరించేందుకు ఒక శాశ్వత రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణ కమిషన్‌ను ఏర్పాటు చేసే విషయాన్ని కేంద్ర ప్రభుత్వం తక్షణమే పరిశీలించాలి. స్వపరిపాలనను, స్వయం నిర్ణయాధికారాన్ని కోరుకుంటున్న ప్రజల ఆకాంక్షలను కొట్టివేయకుండా పరిగణనలోకి తీసుకుని అర్థవంతమైన నిర్ణయాలు తీసుకునేందుకు ఆ కమిషన్ విధ్యుక్త ధర్మంగా ఉండాలి. భారత్ లాంటి బహుళ సంస్కృతీ సంపన్న సమాజంలో 'సమాఖ్య పద్ధతి అనేది వైవిధ్యంలో కలిసిమెలిసి జీవించేందుకు ఉద్దేశించిన ఒక ఉదాత్త పాలనా ప్రణాళిక' అన్న రాజనీతిశాస్త్రవేత్త జోహాన్నెస్ అల్థూసియస్ స్ఫూర్తిదాయక మాటలను మనం విస్మరించకూడదు.

ఢిల్లీ తరహా యూటీగా ఏర్పాటు చేయడం లేదా భారత రాజ్యాంగ ఆరవ షెడ్యూలులో చేర్చడం అనేవి లద్దాఖ్ సమస్యలను పరిష్కరించలేవు. లద్దాఖ్ ప్రత్యేక పరిస్థితులు, అవసరాలకు అనుగుణంగా ఒక కొత్త సమాఖ్య పాలనా నమూనాను అనుసరించవలసిన అవసరమున్నది.



■ పి.నిరూప్
సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది


MARUTI SUZUKI
NEXA
THE GRAND DIWALI CELEBRATION.
AVAIL GST BENEFITS OF UP TO ₹1 07 000*
NOW STARTING AT ₹10 76 500*
GRAND VITARA
R17 MACHINED ALLOY WHEELS
AUTO PURIFY WITH PM2.5 DISPLAY
8-WAY DRIVER POWERED SEAT
EV MODE
6 AIRBAGS AS STANDARD
5 YEAR WARRANTY
3 YEARS + 2 YEARS COMPLIMENTARY
BENEFITS OF UP TO ₹ 2 07 100**
NEXA SAFETY SHIELD
FASTEST 3 LAKH SALES IN THE SEGMENT
SCAN TO CONNECT TO A SHOWROOM NEAR YOU
E-BOOK TODAY @ WWW.NEXAEXPERIENCE.COM
Contact us at
1800-200-6392
1800-102-6392
For detailed T&C kindly visit nearest dealership. Maruti Suzuki India Limited reserves the right to discontinue offers without notice and offers may vary across variants. *Ex showroom price shown is for Grand Vitara sigma variant in Delhi. **Offer includes consumer offer, exchange bonus and institutional or rural offer (wherever applicable) on select models/variants and valid till 23rd Oct 2025. Finance is at the sole discretion of financier. #Fuel efficiency as certified by test agency under rule 115 of CMVR 1989, with Fuel Tank capacity of 45L, range is 1258.65 km (45L x 27.97km/l) under standard test conditions. Results may differ depending on actual driving, road, and other conditions. Scrappage offer valid for limited period only and is brought to you by Maruti Suzuki Toyotsu India Private Limited (a joint venture company between Maruti Suzuki India Ltd and Toyota Tsusho Group). Above offers are valid for limited period only. Black glass shade on the vehicle is due to the lighting effect. Images used are for illustration purposes only. Car color may vary due to printing on paper. ^This extended warranty is applicable for Zeta+ and Alpha+ models of Grand Vitara.



‘సరస్వతీ’.. సెలవు

లలిత సంగీత సామ్రాజ్ఞి.. తేనెలూరే గళం, కోకిల స్వరంతో ఆణిముత్యాల్లాంటి పాటలను ఆలపించిన తొలితరం సినీ నేపథ్యగాయని.. రావు బాల సరస్వతీదేవి (97) ఇక లేరు. కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె బుధవారం ఉదయం ఎనిమిది గంటలకు మణికొండలోని స్వగృహంలో తుదిశ్వాస విడిచారు. ఆమె అసలు పేరు సరస్వతీదేవి. 1937లో వచ్చిన ‘బాలయోగిని’ చిత్రంలో ఆమె పేరును ‘బాల సరస్వతీ దేవి’గా వేశారు. అప్పటి నుంచీ అదే పేరు ఆమెకు స్థిరపడిపోయింది. సరస్వతీ దేవీ తన నాల్గవ ఏటనే స్వస్థలం గుంటూరులో రత్నమహల్ థియేటర్ స్టేజీ మీద పాటలు పాడారు. ఆరో ఏట హెచ్ఎంవీ గ్రామ్‌ఫోన్ రికార్డు కంపెనీ ద్వారా సోలోగా పాడి సంగీత ప్రియులను రంజింపజేశారు! దరిమిలా సినిమాల్లో తన అమృత గానంతో తెలుగు సినీ, సంగీత అభిమానుల హృదయాలలో చిరస్థానం సంపాదించుకున్నారు. కోలంక రాజాతో వివాహానంతరం ‘రావు బాల సరస్వతి’గా మారారు. సరస్వతీ దేవి 1929 ఆగస్టు 29న మద్రాసులో.. తన అమ్మమ్మగారింట జన్మించారు. ఆమె తల్లిదండ్రులు విశాలాక్షి, పార్థసారథి దంపతులు. తండ్రి సొంతూరు గుంటూరు. సుప్రసిద్ధ సినీ నటి, దర్శకురాలు, నిర్మాత.. అయిన విజయ నిర్మల బాలసరస్వతికి స్వయానా మేనమామ కూతురు. రావు బాల సరస్వతీ దేవి తన తండ్రి ప్రోత్సాహంతో ఆలత్తూర్ సుబ్బయ్య వద్ద కర్ణాటక సంగీతం, ముంబైలోని వసంత దేశాయ్ దగ్గర హిందుస్థానీ సంగీతం నేర్చుకున్నారు. హెచ్ఎంవీ వారి రికార్డులు విన్న దర్శకుడు సి.పుల్లయ్య ఆమెకు ‘సతీ అనసూయ’ సినిమాలో అవకాశం ఇచ్చారు. 1936లో ఈ చిత్రం విడుదల కాగా.. పారితోషికంగా ఆమెకు రూ.200 ఇచ్చారు. ‘భాగ్యలక్ష్మి’ చిత్రంలో ‘తిన్నె మీద సిన్నోడా..’ పాటతో నేపథ్య గాయనిగా పరిచయం అయ్యారు. అక్కడి నుంచి ‘దేవదాసు’, ‘షావుకారు’, ‘చెంచులక్ష్మి’, ‘జయసింహ’, ‘తెనాలి రామకృష్ణ’, ‘స్వప్న సుందరి’, ‘పిచ్చిపుల్లయ్య’ తదితర తెలుగు సినిమాలతో పాటు తమిళ, కన్నడ, సింహళ భాషల్లో రెండువేలకు పైగా పాటలు పాడారు.

ఆమె పాటతోనే ప్రారంభం



మద్రాసు ఆకాశవాణి కేంద్రంలో 1940లో లలిత సంగీతం బాలసరస్వతి పాటతోనే ప్రారంభమైంది. తర్వాత 1948లో విజయవాడ ఆకాశవాణి కేంద్రం కూడా ఆమె గాత్రంతోనే శ్రోతలకు పరిచయమైంది. 1940-50లమధ్య కాలంలో ఎస్.రాజేశ్వరరావుతో కలసి ఆమె ఆలపించిన లలిత గీతాలు రేడియో, గ్రామ్‌ఫోన్ రికార్డుల ద్వారా తెలుగునాట మారుమోగాయి. సాలూరి సన్యాసరాజు, దేవులపల్లి కృష్ణశాస్త్రి, ఆరుద్ర, ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి, బాలాంత్రపు రజనీకాంతరావు వంటి ఎందరో మహానుభావుల గీతాలు ఆమె కంఠంలో కొత్త హొయలు పోయాయంటే అతిశయోక్తి కాదు! మీరాబాయి భక్తిగీతాలకు సినారె తెలుగు అనువాదాలు ఆలపించి శ్రోతల నీరాజనాలు అందుకున్నారామె. హిందీలోనూ పలు భక్తిగీతాలు ఆలపించారు. కోలంక రాజా ప్రద్యుమ్న కృష్ణ సూర్యారావుతో 1944లో ఆమెకు వివాహమైంది. అప్పటి నుంచి అడపాదడపా పాడుతూ వస్తున్న రావు బాలసరస్వతి.. 1959 నుంచి సినిమాల్లో పాటలు పాడడం పూర్తిగా మానేశారు.

జయలలిత సాయం...

‘సతీ అనసూయ’ చిత్రంతో బాలనటిగా సినీరంగ ప్రవేశం చేసిన బాల సరస్వతి.. ‘అపవాదు’, ‘భక్తతుకారాం’, ‘ఇల్లాలు’, మహానంద’ తదితర తెలుగు చలనచిత్రాలలో సహాయనటిగా.. ‘సువర్ణమాల’, ‘రాధిక’ సినిమాలలో కథానాయికగా నటించారు. తమిళంలో ‘భక్తకుచేల’, ‘బాలయోగిని’, ‘తుకారాం’, తిరునీలకంఠన్‌తో పాటు ‘దాసెప్పెణ్’ చిత్రంలో ప్రముఖ నటుడు ఎంజీఆర్ సరసన కథానాయిక పాత్ర పోషించారు. భర్త మరణానంతరం తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఆ సమయంలో ముఖ్యమంత్రిగా ఉన్న ఎన్టీఆర్‌ను కలసి తన కష్టాలను వివరించడంతో, హైదరాబాద్‌కు తరలి రావాల్సిందిగా ఆమెకు సూచించారు. ప్రభుత్వం నుంచి తగిన సహాయసహకారాలు అందిస్తానని మాటిచ్చారు. అలా 1995లో సరస్వతి కుటుంబంతో సహా బెంగళూరు నుంచి హైదరాబాద్‌కు మారారు. కానీ.. ఆమె వచ్చిన మూడు నెలలకే ఎన్టీఆర్ మరణించడంతో తమకు సాయం చేసేవారు లేక చాలా అవస్థ పడినట్లు ఓ సందర్భంలో బాలసరస్వతి చెప్పారు. తర్వాత జయలలిత సీఎంగా ఉన్నప్పుడు అన్నా అవార్డుతో సత్కరించడంతో పాటు చెన్నైలో మూడు గదుల ఫ్లాటు, పదిలక్షల రూపాయల నగదును అందించారు. అలాగే ఏపీలోని గత ప్రభుత్వం పది లక్షల రూపాయల నగదుతో లైఫ్‌టైం అచీవ్‌మెంట్ అవార్డును ప్రదానం చేసింది. ఇంకా మరెన్నో అవార్డులు, సత్కారాలు ఆమె అందుకున్నారు.



గుర్తింపు తెచ్చిన పాటలు

బాల సరస్వతీ దేవిది మంత్ర స్వరం అని అభిమానులు కీర్తించేవారు. ఆమెది ఎవ్వరికీ అనుకరణ గాని సొంత గొంతుక అని ఆమెను ప్రశంసించేవారు. ‘అందం చూడవయా ఆనందించవయా ’, ‘తానే మారేనా’, ‘ఇంత తెలిసి ఉండి’ (దేవదాసు), ‘ఎల్లవేళలందు నీ చక్కని చిరునవ్వులకై’ (పిచ్చి పుల్లయ్య), ‘రారాదో రా చిలకో’ (చిన్న కోడలు), ‘గోపాల కృష్ణుడు’ (రాధిక), ‘ఓ ఊగుదునే ఉయ్యాల’(శాంతి) వంటి సినిమాల్లోని పాటలు ఆమెకు విశేష ఆదరణను తెచ్చిపెట్టాయి. అలానే, ‘ఓ పరదేశీ’, ‘మనసైన చెలి పిలుపు’, ‘మదిలోని మధుర భావం’ వంటివి ఆమె పాడిన హిట్ పాటల్లో మరికొన్ని. ఆహుతి(1951) సినిమాకు మహాకవి శ్రీశ్రీ రాసిన తొలి సినీ గీతం ‘ప్రణయమే పోయేనా బలియై..’ పాడింది ఆమే. భర్త మరణానంతరం 1974లో.. విజయనిర్మల కోరిక మేరకు ‘సంఘం చెక్కిన శిల్పాలు’ చిత్రంలో ‘పోయిరావమ్మ అత్తవారింటికి అపరంజి బొమ్మ’ అనే అంపకాల పాట పాడారు. అదే ఆమె చివరి సినీగీతం. తన 80వ ఏట స్వీయ సంగీత దర్శకత్వంలో కృష్ణుడిపై పలు గీతాలు ఆలపించారు. వాటిని ‘రాధా మాధవం’ సీడీగా తీసుకొచ్చారు. బాలీవుడ్ సంగీత దర్శకుడు నౌషాద్ బాలసరస్వతి గాత్రానికి ముగ్ధుడై ‘ఉడన్ ఖటోలా’ చిత్రానికి రెండు పాటలు పాడించడం విశేషం. అక్కడి సంగీత దర్శకులకు తన గొంతు నచ్చి ముంబైలో ఉండిపొమ్మన్నారని.. అయితే, తాను అక్కడ ఉంటే వాళ్లకు పాటలు పాడనని లతా మంగేష్కర్ చెప్పడంతో వాళ్లు తనకు క్షమాపణలు చెప్పి పంపేశారని బాల సరస్వతి ‘ఓపెన్‌హార్ట్ విత్ ఆర్కే’లో చెప్పారు.

సినీప్రముఖుల నివాళి..

రావు బాలసరస్వతి భౌతికకాయాన్ని ప్రముఖ సినీ నటులు జయసుధ, నరేష్ సందర్శించి నివాళులు అర్పించారు. ఆమె కుమారులు ఆర్వీఆర్‌కే సూర్యారావు, ఆర్వీకేఎం సూర్యారావులను ఓదార్చారు. బుధవారం జూబ్లీహిల్స్ మహాప్రస్థానంలో బాల సరస్వతీ దేవి అంత్యక్రియలు పూర్తయ్యాయి. బాల సరస్వతి మృతి పట్ల హీరో నందమూరి బాలకృష్ణ, తెలంగాణ ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి, ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌తో పాటు పలువురు సినీ ప్రముఖులు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు.

హైదరాబాద్ సిటీ (ఆంధ్రజ్యోతి)



ఏఐలో టాప్‌లేపింది..!

చదివిన చదువుకు మరింత నైపుణ్యాన్ని జోడించాలన్న పట్టుదలతో... ఆర్థిక పరిస్థితులు సహకరించకపోయినా ధైర్యంగా ముందడుగు వేసింది తాళ్లూరి పల్లవి. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ప్రోగ్రామింగ్‌లో శిక్షణ పొంది, జాతీయ స్థాయిలో టాపర్‌గా నిలిచింది. ప్రధాని నరేంద్రమోదీ చేతుల మీదుగా సర్టిఫికెట్ అందుకుంది. ఎందరికో స్ఫూర్తిగా నిలుస్తున్న పల్లవి ‘నవ్య’తో ప్రత్యేకంగా పంచుకున్న విశేషాలివి.

“గ్రామీణ ప్రాంతానికి చెందిన, ఆర్థిక ఇబ్బందులతో ఇబ్బంది పడిన నేను చదువులో రాణించి దేశ ప్రధాని నరేంద్రమోదీ చేతులమీదుగా సర్టిఫికెట్ అందుకుంటానని కలలో కూడా ఊహించలేదు. కానీ చదువుకోవాలన్న సంకల్పం, పట్టుదల, వృత్తి నైపుణ్యం కోసం నేను ఎంచుకున్న మార్గం దాన్ని సాధ్యం చేసింది. మాది ఖమ్మం జిల్లా ఆరెంపల గ్రామానికి చెందిన మధ్యతరగతి కుటుంబం. నాన్న తాళ్లూరి రవిప్రసాద్ ప్రైవేటు ఎలక్ట్రీషియన్. అమ్మ అజిత గృహిణి. మా అక్క లావణ్య ఎంబీఏ చదివి ప్రైవేట్ ఉద్యోగం చేస్తోంది. నేను పదోతరగతి వరకు ఖమ్మం రూరల్ మండలం నాయుడుపేటలో, ఇంటర్ ఖమ్మంలో చదివాను. కిందటి ఏడాది పాస్నెకల్‌లో బీటెక్ (సీఎస్ఈ) పూర్తి చేశాను. ఉద్యోగం కోసం అన్వేషిస్తున్నప్పుడు... నాకు మరింత నైపుణ్యం అవసరం అనిపించింది. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా కృత్రిమమేధ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్)కు డిమాండ్ ఉంది. ప్రైవేటు సంస్థల్లో ఆ కోర్సు నేర్చుకోవాలంటే ఖర్చుతో కూడుకున్న పని. దాన్ని మేము భరించలేం. మరో మార్గం కోసం వెతుకుతున్నప్పుడు... ఒక నోటిఫికేషన్ కనిపించింది. హైదరాబాద్ విద్యానగర్‌లోని ‘నేషనల్ స్కిల్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్’ (ఎన్ఎస్‌టీఐ)లో మహిళల కోసం ఏఐ కోర్సు ఉందని, దరఖాస్తులు చేసుకోవచ్చునని ఆ నోటిఫికేషన్ ఉంది. ఏడాది పాటు ఉండే ఈ కోర్సు ద్వారా వృత్తి నైపుణ్యం సాధిస్తే ఉద్యోగాన్వేషణలో విజయవంతం అవుతానని భావించా. అది కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ కావడంతో ఇక్కడ శిక్షణ తీసుకోవడం ద్వారా కొంత ఆర్థిక వెసులుబాటుతో పాటు ఆ సర్టిఫికెట్‌కు గుర్తింపు ఉంటుందనిపించింది.

> మా అమ్మాయి పల్లవి బీటెక్ తర్వాత ఎన్ఎస్‌టీఐలో శిక్షణ తీసుకొని, టాపర్‌గా నిలిచి ప్రధానమంత్రి నుంచి సర్టిఫికెట్ అందుకోవడం మాకు గర్వంగా ఉంది. ఈ సంగతి తెలిసి ఎంతోమంది మా అమ్మాయితోపాటు మమ్మల్ని కూడా అభినందిస్తున్నారు. మాకు ఇద్దరు అమ్మాయిలు. వారిని కష్టపడి చదివించాం. వారు ఉద్యోగాల్లో స్థిరపడితే అదే మాకు సంతోషం.
>
> **- పల్లవి తల్లిదండ్రులు రవిప్రసాద్, అజిత**

దరఖాస్తు చేశాను. సీటు లభించింది. ఏడాది శిక్షణ పూర్తి చేశాను. అక్కడే ఉచిత వసతి, భోజన సదుపాయం కల్పించారు. కంప్యూటర్ సైన్సు, ఏఐ విభాగంలో ప్రపంచవ్యాప్తంగా వస్తున్న మార్పులు, పోటీతత్వం, చేసే పనిలో ఉన్నత ఆలోచనలు తదితర అంశాలతోపాటు పైథాన్, డేటాసైన్సు, మిషన్ లెర్నింగ్, డీప్ లెర్నింగ్, ఏఐఎంఎల్, కంప్యూటర్ జనరేటింగ్ తదితర కోర్సుల్లో శిక్షణతీసుకున్నా. ఆ తరువాత జాతీయస్థాయిలో నిర్వహించిన పరీక్షలకు హాజరయ్యాను మొత్తం 600 మార్కులకు 598 మార్కులు సాధించి దేశంలోనే టాపర్‌గా నిలిచాను.

ఎంతో గర్వంగా ఉంది...

ఎన్ఎస్‌టీఐలో శిక్షణ పొంది, ఉత్తీర్ణులైనవారికి సర్టిఫికెట్ల ప్రదానం ఈ నెల నాలుగున ఢిల్లీలోని విజ్ఞాన్‌భవన్‌లో జరిగింది. ఎన్ఎస్‌టీఐ వారే హైదరాబాద్ నుంచి ఢిల్లీకి, అక్కడి నుంచి హైదరాబాద్‌కు విమానం టిక్కెట్లు బుక్ చేశారు. నేను విమానం ఎక్కడం అదే తొలిసారి. ఉత్తీర్ణులకు సాధారణంగా కేంద్రమంత్రులే సర్టిఫికెట్‌లు అందజేస్తారు. అయితే టాపర్‌గా నిలిచిన నేను, దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన ఉత్తీర్ణులు... ఈసారి ప్రధానమంత్రి నరేంద్రమోదీ



చేతుల మీదుగా సర్టిఫికెట్లు అందుకున్నాం. ఇది నేను ఏమాత్రం ఊహించని విషయం. ఎంతో మామూలు వ్యక్తిని అయిన నేను దేశ ప్రధానిని కలవడం సాధ్యంకాని పని. కానీ ఎన్ఎస్‌టీఐలో శిక్షణ తీసుకోవడం, టాపర్‌గా నిలవడంతో నాకు ఈ అవకాశం లభించింది. తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తదితరులు నన్ను అభినందించారు. ఇది నాకు ఎంతో గర్వంగా ఉంది. ఇప్పుడు ఉద్యోగం కోసం ప్రయత్నిస్తున్నాను. ఐటీ కంపెనీలనుంచి ఉద్యోగ సహకారం ఉంటుందని ఎదురుచూస్తున్నా. ప్రస్తుత పరిస్థితుల్లో విదేశాలు వెళ్లాలనే ఆలోచన నాకు లేదు. ఇక్కడే ఉద్యోగం సాధించి, నా తల్లిదండ్రులకు అండగా నిలవాలనుకుంటున్నా.

● నలజాల వెంకటరావు
ఫొటోలు: రవిశంకర్

చిత్రజ్యోతి
★ SINCE 1965 ★

ప్రేమకథ సరికొత్తగా ఉంటుంది



- నవీన్ యెర్నేని, వై. రవిశంకర్

‘డ్యూడ్’ చిత్రంలో హీరో హీరోయిన్ల ప్రేమను దర్శకుడు కొత్తగా ఆవిష్కరించారు. చాలా కొత్త కథలాగా అనిపిస్తుంది. సాధారణంగా ద్వితీయార్థంలో ఏం జరగబోతోందో ప్రేక్షకులు ముందే ఊహిస్తారు. కానీ ఈ చిత్రంలో మాత్రం ద్వితీయార్థంలో మలుపులను ప్రేక్షకులు ఊహించలేరు. పతాక సన్నివేశాల్లో భావోద్వేగాలు ప్రేక్షకులను ఆకట్టుకుంటాయి’ అని నిర్మాతలు నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ అన్నారు. ప్రదీప్ రంగనాథన్ కథానాయకుడిగా కీర్తీశ్వరన్ దర్శకత్వం వహించిన చిత్రమిది. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ నిర్మించారు. ఈ శుక్రవారం విడుదలవుతోన్న సందర్భంగా వారు సినిమా విశేషాలను మీడియాతో పంచుకున్నారు.

● ‘డ్యూడ్’ కథ చాలా కొత్తగా ఉంటుంది. దర్శకుడు కథ చెప్పిన దానికన్నా బాగా తెరకెక్కించారు. యువతను, కుటుంబ ప్రేక్షకులను మెప్పిస్తుంది. పాటలకు కూడా మంచి ఆదరణ దక్కింది. ఈ సినిమా అన్ని వర్గాల ప్రేక్షకులకు కనెక్ట్ అవుతుందనే నమ్మకం ఉంది. అనుకున్న బడ్జెట్, కాలపరిమితిలో సినిమాను పూర్తి చేశాం. మంచి లాభాలను తెచ్చిపెట్టే సినిమా అవుతుంది. తమిళంలోనూ మేమే సొంతంగా రిలీజ్ చేస్తున్నాం. అలాగే ఈ చిత్రం తెలుగులోనూ మంచి వసూళ్లను రాబడుతుందనే నమ్మకం ఉంది.




భావోద్వేగాల సంఘర్షణే ఈ చిత్రం

సిద్ధు జొన్నలగడ్డ

‘ఏడాదిగా ఒక వింత మనిషి బుర్రలో బతుకుతున్నాను. సినిమా విడుదల కాబోతోంది. వరుణ్ అనే క్యారెక్టర్‌కి గుడ్‌బై చెప్పేయాలి. ఆ క్యారెక్టర్ గురించి నేను ప్రత్యేకంగా ఎందుకు చెబుతున్నానో సినిమా చూస్తే మీకే అర్థమవుతుంది. ఈ సినిమాలో వరుణ్ ఒక్క చుక్క రక్తం చిందించకుండా భావోద్వేగాల సంఘర్షణ, మానసిక హింసను సృష్టిస్తాడు. ఒక్క మాటలో చెప్పాలంటే ‘తెలుసు కదా’ ఓ ముక్కోణ ప్రేమ కథ’ అని అన్నారు కథానాయకుడు సిద్ధు జొన్నలగడ్డ. ఆయన హీరోగా నీరజ కోన తెరకెక్కించిన చిత్రమిది. శ్రీనిధి శెట్టి, రాశీ ఖన్నా కథానాయికలు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బేనర్‌పై టీజీ విశ్వప్రసాద్, కృతి ప్రసాద్ నిర్మించారు. ఈనెల 17న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా చిత్రబృందం ప్రీ రిలీజ్ వేడుకను నిర్వహించింది. చిత్ర దర్శకురాలు నీరజ కోన మాట్లాడుతూ ‘ఈ సినిమా ఇంత అద్భుతంగా రావడానికి మా నిర్మాతలే కారణం. చిత్రానికి సిద్ధు వెన్నెముక లాంటి వారు. ఇద్దరు కథానాయికలు చాలా బాగా నటించారు. తమన్ సంగీతం ఈ సినిమాకు ప్రత్యేక ఆకర్షణ. మేము తీసిన సినిమాను మాకే కొత్తగా చూపించారు ఎడిటర్ నవీన్. ఈ చిత్రం కోసం పనిచేసిన అందరికీ పేరుపేరునా ధన్యవాదాలు’ అని అన్నారు. చిత్ర నిర్మాత కృతి ప్రసాద్ మాట్లాడుతూ ‘నాకు ప్రత్యేక చిత్రమిది. కథ విన్నప్పుడే కనెక్ట్ అయ్యాను. మీకు కూడా నచ్చుతుందని భావిస్తున్నా’ అని అన్నారు.

‘మిత్రమండలి’ నవ్విస్తుంది

‘మిత్రమండలి’ కథ విన్నంతసేపూ నేను బాగా ఎంజాయ్ చేశాను. మంచి ఎంటర్‌టైన్‌మెంట్ ఉందని అనిపించింది. ఇప్పుడు తెరపైన సినిమా చూసుకుంటే అదే ఫీలింగ్ కలిగింది. మా ‘మిత్రమండలి’ అందరినీ నవ్విస్తుంది.అందుకే సినిమా విజయంపై ధీమాతో ఉన్నాను’ అని ప్రియదర్శి అన్నారు. ఆయన కథానాయకుడిగా విజయేందర్ దర్శకత్వం వహించిన చిత్రమిది. కల్యాణ్ మంతెన, భాను ప్రతాప, డా. విజేందర్‌రెడ్డి తీగల నిర్మించారు. నేడు ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ సందర్భంగా ప్రియదర్శి మీడియాతో ముచ్చటించారు.



● ఎప్పుడూ ఒకే తరహా చిత్రాలు చేయడం నాకు ఇష్టం ఉండదు. ‘జాతి రత్నాలు’ తర్వాత ‘35 చిన్న కథ కాదు’, ‘కోర్ట్’ వంటి వైవిధ్యమైన చిత్రాలు చేశాను. అయితే ఈ చిత్రంపైన ‘జాతి రత్నాలు’ ప్రభావం లేదు. ఇది పూర్తిగా కొత్త తరహాలో సాగే కథ.

● ‘మిత్రమండలి’ అన్ని వర్గాల ప్రేక్షకులను అలరించేలా ఉంటుంది. ఇందులో కుల వ్యవస్థ మీద విజయేందర్ మంచి సీన్లు రాసుకున్నారు. కథలో అంతర్లీనంగా కొంత సందేశం ఉన్నా, సినిమా ఆద్యంతం వినోదాత్మకంగా సాగుతుంది.



బడుల బలోపేతం

హనుమకొండ, అక్టోబర్ 15 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ బడుల బలోపేతానికి రాష్ట్ర ప్రభుత్వం సమాయత్తం అవుతోంది. ప్రాథమిక స్థాయి నుంచి ఉన్నత పాఠశాలల వరకు ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేసి పకడ్బందీగా పర్యవేక్షించనున్నది. ప్రతీ 100 పాఠశాలలకు ఒక కమిటీని నియమించి విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను మెరుగుపరచాలని సంకల్పించింది. ప్రాథమిక పాఠశాల స్థాయిలో సెకండరీ గ్రేడ్ టీచర్ (ఎస్జీటీ) ప్రధానోపాధ్యాయులు, ప్రాథమికోన్నత పాఠశాలలకు స్కూల్ అసిస్టెంట్ (ఎస్ఏ), ఉన్నత పాఠశాలలకు పీజీ హెచ్ఎం సంబంధిత కమిటీలకు అధ్యక్షుడిగా వ్యవహరిస్తారు. వీరికి ప్రభుత్వమే రవాణా భత్యం చెల్లిస్తుంది. కమిటీలో చోటు దక్కించుకున్న ఉపాధ్యాయులు తమ పాఠశాలల్లో పాఠాలు బోధించాల్సిన అవసరం లేదు. సర్కారు కేటాయించిన పాఠశాలలను పర్యవేక్షిస్తూ వాటి స్థితిగతులపై ఎప్పటికప్పుడు జిల్లా విద్యాశాఖాధికారులకు నివేదిక అందించాలి.

కమిటీల్లో సభ్యులు వీరే..

పాఠశాలల తనిఖీ కమిటీలను కలెక్టర్, అదనపు కలెక్టర్, డీఈవో, సీనియర్ ఉపాధ్యాయుడు లేదా ఉపాధ్యాయురాలితో కూడిన కమిటీ నియమిస్తుంది. ప్రాథమిక స్థాయిలో ఒక్కో కమిటీలో ప్రాథమిక పాఠశాల హెడ్‌మాస్టర్‌తో పాటు ఇద్దరు ఎస్జీటీలు, ప్రాథమికోన్నత పాఠశాలల కమిటీలో స్కూల్ అసిస్టెంట్ (ఎస్ఏ), ప్రాథమిక పాఠశాల హెచ్ఎం, పీఈటీ , ఉన్నత పాఠశాలల కమిటీలో హైస్కూల్ హెచ్ఎం, ఏడుగురు సబ్జెక్టు టీచర్లు, ఒక పీఈటీ సభ్యులుగా ఉంటారు. ప్రాథమిక స్థాయిలో కమిటీ మౌలిక భాషా గణిత అభివృద్ధి (ఎఫ్ఎల్ఎన్)ని పరిశీలిస్తుంది. ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల కమిటీలు ఆరో తరగతి నుంచి తొమ్మిదో తరగతి వరకు అభ్యసన అభివృద్ధి కార్యక్రమం (ఎల్ఐపీ)ని పర్యవేక్షిస్తాయి. ఆయా కమిటీలు రోజువారీగా నివేదిక రూపొందించాలి. పాఠశాలల లోటుపాట్లను గుర్తించి ఉన్నతాధికారులకు నివేదించాలి. కమిటీల నివేదిక ఆధారంగా ంబంధిత అధికారులు మార్పులు, చేర్పులు చేపట్టవచ్చు.

ఏడు కమిటీలు

హనుమకొండజిల్లాలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు 127, ప్రాథమికోన్నత పాఠశాలలు 58, ప్రాథమిక పాఠశాలలు 272 ఉన్నాయి. ఈ పాఠశాలల తనఖీలకు మొత్తం ఏడు కమిటీలను ఏర్పాటు చేయనున్నారు. వీటిలో ప్రాథమిక పాఠశాలలకు 3, ఉన్నత పాఠశాలలకు 3, ప్రాథమికోన్నత పాఠశాలలకు 1 కమిటీని ఏర్పాటు చేస్తారు. పాఠశాల కమిటీల్లో సభ్యులుగా ఉండే అన్ని అర్హతలు కలిగిన ఉపాధ్యాయులను ఎంపిక చేసే ప్రక్రియ కొనసాగుతోంది. అర్హులను గుర్తించడానికి వారం రోజులు పట్టవచ్చు.

విధులు- బాధ్యతలు

ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల కమిటీలు మూడు నెలలకు ఒక సారి తమ పరిధిలోని 100 పాఠశాలలను, ఉన్నత పాఠశాల కమిటీలు 50 పాఠశాలలను తనఖీ చేయాల్సి ఉంటుంది. విద్యా ప్రగతిని అంచనా వేస్తాయి. గ్రంథాలయం, సైన్స్ ల్యాబ్‌ల వినియోగం తీరును గమనిస్తాయి. విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు, పనితీరు వివరాలు తెలుసుకుంటాయి. మధ్యాహ్న భోజన పథకం అమలు, పారిశుధ్య చర్యలు, మంచినీటి సదుపాయం, ఇతర వసతులను పరిశీలిస్తాయి. ఆ పాఠశాలల్లో జరుగుతున్న అన్ని విద్యా సంబంధమైన కార్యకలాపాలను ఈ కమిటీలు పరిశీలిస్తాయి. తరగతి గదుల్లో ఉపాధ్యాయుల బోధన తీరు, విద్యార్థుల నోట్స్ పరిశీలన, రికార్డులు, పరీక్షల నిర్వహణ తదితర అంశాలను తనిఖీ చేస్తాయి. పాఠశాలల్లో నెలకొన్న సమస్యలపై కూడా దృష్టిసారిస్తాయి. విద్యార్థులు, ఉపాధ్యాయులతో చర్చిస్తాయి. పాఠశాల అవసరాలను అడిగి తెలుసుకుంటాయి. తక్షణం కల్పించాల్సిన మౌళిక వసతులపై ప్రత్యేకంగా చర్చిస్తాయి. తనిఖీలో తమ దృష్టికి వచ్చిన అంశాలను ఏ రోజుకారోజు ఆన్‌లైన్ పోర్టల్ రికార్డు చేస్తాయి. వారానికి ఒక సారి నివేదికల రూపంలో డీఈవోకు అందజేస్తాయి. డీఈవో వీటన్నిటినీ క్రోడీకరించి జిల్లా కలెక్టర్ అధ్యక్షతన కలిగిన జిల్లా స్థాయి కమిటీకి అందజేస్తారు. ఈ కమిటీ నెలకు ఒక సారి సమావేశమై నివేదికపై చర్చించి చర్యలు తీసుకుంటాయి. ప్రతీ నెల డీఈవో పాఠశాల తనఖీ కమిటీలతో సమావేశమై తనఖీల సందర్భంగా గుర్తించిన అంశాలపై చర్చిస్తారు.

పాఠశాలల తనిఖీకి కమిటీల ఏర్పాటు

- వారం, పది రోజుల్లో ఎంపిక ప్రక్రియ పూర్తి
- ఆసక్తి కలిగిన ఉపాధ్యాయుల నుంచి దరఖాస్తుల ఆహ్వానం
- కమిటీలను ఎంపిక చేయనున్న జిల్లా స్థాయి కమిటీ
- ప్రతీ మూడు నెలల్లో 100 పాఠశాలల తనిఖీ
- పాఠశాలల తీరుపై ప్రతీ వారం నివేదిక
- విద్యార్థుల అభ్యసన సామర్థ్యం పెంచడమే లక్ష్యం

అర్హతలు

పాఠశాలల తనఖీ కమిటీలో పని చేయగోరే ఉపాధ్యాయుల నుంచి జిల్లా విద్యాశాఖ కార్యాలయం దరఖాస్తులను ఆహ్వానించింది. ఇందు కోసం ఒక ప్రత్యేక ఫార్మాట్‌ను రూపొందించింది. ప్రభుత్వ నిర్దేశిత మార్గదర్శకాల ప్రకారం అర్హులైవారు అన్ని వివరాలను ఈ ప్రోఫార్మలో పొందుపరచాల్సి ఉంటుంది. కమిటీ సభ్యులుగా ఉండేందుకు గల అర్హతలను విద్యాశాఖ స్పష్టంగా నిర్దేశించింది. పాఠశాల తనఖీ కమిటీల్లో సభ్యులుగా పని చేయగోరే సభ్యులు బోధనా రంగంలో గరిష్టంగా పదేళ్ల అనుభవం కలిగి ఉండాలి. ఇన్‌సర్వీస్ ట్రైనింగ్ చేసి ఉండాలి. కమ్యూనికేషన్ స్కిల్స్ తెలిసి ఉండాలి. క్రమశిక్షణపరమైన కేసులు ఉండకూడదు. కంప్యూటర్‌లో పరిజ్ఞానం కలిగి ఉండాలి. డిజిటల్ లిటరసీపై అవగాహన కలిగి ఉండాలి. విద్యార్థులకు పాఠాలను సులభంగా ఎలా బోధించాలో తెలియచెప్పే నైపుణ్యం, అవసరమైతే తనఖీల సందర్భంగా తరగతి గదుల్లో దీనిపై స్వయంగా డెమాన్‌స్ట్రేషన్ చేయగలిగే సామర్థ్యాలు, విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలను అంచనా వేయగలిగే అవగాహన కలిగి ఉండాలి.



కాంతమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీఎం రేవంత్ రెడ్డి

ఎమ్మెల్యే దొంతి తల్లికి సీఎం నివాళి

- మాతృవందనం కార్యక్రమంలో పాల్గొన్న రేవంత్ రెడ్డి
- ఎమ్మెల్యే కుటుంబ సభ్యులకు పరామర్శ
- హాజరైన మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు
- భారీ సంఖ్యలో పాల్గొన్న నర్సంపేట నియోజకవర్గ శ్రేణులు
- మంత్రులు, ఎమ్మెల్యేలతో కలిసి భోజనం
- 27 నిమిషాల పాటు ఫంక్షన్‌హాల్‌లో గడిపిన సీఎం

హనుమకొండ, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి అనుముల రేవంత్‌రెడ్డి బుధవారం నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి మాతృమూర్తి దొంతికాంతమ్మ దశదిన కర్మ సందర్భంగా ఏర్పాటు చేసిన మాతృవందనం కార్యక్రమంలో పాల్గొన్నారు. హనుమకొండ కేయూ 100 ఫీట్ల రోడ్డులోని పీజీఆర్ గార్డెన్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమానికి సీఎం హాజరై కాంతమ్మ చిత్రపటానికి పూలు సమర్పించి ఘనంగా నివాళులర్పించారు. దొంతి మాధవరెడ్డిని, ఆయన సోదరులు, కటుంబ సభ్యులను పరామర్శించారు. వారికి తన ప్రగాఢసానుభూతిని తెలియ చేశారు. సీఎం వెంటవచ్చిన మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజా ప్రతినిధులు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు కూడా కాంతమ్మ చిత్రపటం వద్ద పూలుచల్లి అంజలి ఘటించారు. దొంతిని పరామర్శించారు. అనంతరం సీఎం వేదికపై నుంచి ప్రజలకు, కాంగ్రెస్ శ్రేణులకు చేయి ఊపుతూ అభివాదం చేశారు. ఆ తర్వాత సీఎం రేవంత్‌రెడ్డి మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలతో కలిసి భోజనం చేసి మధ్యాహ్నం 2.37 నిమిషాలకు తిరిగి వెళ్లిపోయారు. ఈ కార్యక్రమంలో సీఎం 27 నిమిషాలపాటు ఉన్నారు.

గంట ఆలస్యంగా..

కార్యక్రమానికి రేవంత్‌రెడ్డి గంట ఆలస్యంగా హాజరయ్యారు. ముందుగా ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం సీఎం మధ్యాహ్నం 1.15గంటలకు ఫంక్షన్‌హాల్‌కు చేరుకోవాల్సి ఉంది. గంట ఆలస్యంగా మధ్యాహ్నం 2.11 గంటలకు వచ్చారు. హైదరాద్‌లోని ఎంహెచ్ఆర్‌డీ నుంచి హెలికాప్టర్‌లో బయలు దేరి హనుమకొండ సుబేదారిలోని (మిగతా 9వ పేజీలో)



సీఎంను చూడడానికి రోడ్డుపై వేచి ఉన్న పారిశుధ్య కార్మికులు, జనం



అథ్లెటిక్స్ పోటీలకు ముస్తాబైన జేఎన్ స్టేడియం

సమరానికి సై..

- నేటి నుంచి జాతీయస్థాయి అండర్-23 అథ్లెటిక్స్ పోటీలు
- జేఎన్ఎస్‌లో పూర్తయిన ఏర్పాట్లు
- దేశం నలుమూలల నుంచి 937మంది క్రీడాకారుల రాక
- ఉభయ రాష్ట్రాల నుంచి 25 మంది అథ్లెట్లు

వరంగల్ స్పోర్ట్స్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): చారిత్రక వరంగల్ నగరంలో క్రీడా సంరంభంలో పోటీ పడేందుకు దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాలకు చెందిన అథ్లెట్లు సిద్ధమయ్యారు. బుధవారం నుంచి ఈ నెల 18వరకు 5వ జాతీయస్థాయి అండర్-23 మెన్ అండ్ ఉమెన్ అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించడానికి హనుమకొండ నగరంలోని జవహర్‌లాల్‌నెహ్రూ స్టేడియం (జేఎన్ఎస్)తోపాటు నిట్ కళాశాల ముస్తాబైంది. రెండు తెలుగు రాష్ట్రాలతో సహ దేశం నలుమూలల నుంచి పలు అకాడమీలు, యూనిట్స్‌కు చెందిన 937మంది జాతీయ, అంతర్జాతీయస్థాయి అథ్లెటు 21 ఈ వెంట్లలో రికార్డుల మోత మోగించడానికి ఆత్మ విశ్వాసంతో జేఎన్ మైదానంలోకి అడుగుపెడుతున్నారు. జాతీయస్థాయి పోటీల్లో పాల్గొనడానికి నగరానికి వచ్చిన వివిధ రాష్ట్రాల క్రీడాకారులతో జేఎన్ఎస్ కలర్‌ఫుల్‌గా కళకళలాడుతోంది. అథ్లెటిక్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఏఎఫ్ఐ) నిబంధనల మేరకు జేఎన్ఎస్‌లో ఎల్ఈడీ స్క్రీన్‌లు, ఎలక్ట్రానిక్ డిస్టెన్స్ మేనేజ్‌మెంట్(ఈడీఎం), టైమింగ్ స్కోరింగ్ రిజల్ట్ (టీఎస్ఆర్), డోపింగ్ పరీక్షలతో పాటు ప్రపంచవ్యాప్తంగా జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీలు తిలకించడానికి లైవ్ టెలికాస్ట్ చేసే విధంగా ఏఎఫ్ఐ నిపుణులు ఏర్పాట్లను పూర్తి చేశారు. మూడు రోజుల పాటు ఉదయం 6గంటల నుంచి 10:30గంటల వరకు, మధ్యాహ్నం 2గంటల నుంచి 5:30గంటల వరకు పోటీలను కొనసాగనున్నాయి. ఏఎఫ్ఐ నిబంధనల మేరకు జాతీయస్థాయి పోటీల్లో పాల్గొనే (మిగతా 8వ పేజీలో)

కేయూ కట్టుదిట్టం

- క్యాంపస్‌లో ఇక పటిష్ట భద్రత
- సెక్యూరిటీ సిబ్బందికి లైసెన్స్‌డ్ ఆయుధాలు
- ఆందోళనలు, నిరసనలు అడ్డుకునేందుకు ప్రణాళిక
- విద్యార్థుల సమగ్ర సమాచారానికి ఐడీ కార్డులు
- అల్లరి మూకల రాకను నిరోధించేందుకు చర్యలు
- మెస్‌లోనూ విద్యార్థులకు ఫేస్ రికగ్నైజేషన్
- వర్సిటీ ఉన్నతాధికారుల సమాలోచనలు



కేయూ క్యాంపస్ అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ క్యాంపస్‌లో భద్రతా వ్యవస్థను పకడ్బందీగా రూపొందిస్తున్నారు. వర్సిటీలో సెక్యూరిటీ సిబ్బందిని మూడు కేటగిరీలుగా విభజించనున్నారు. అర్హులైన కొందరు సెక్యూరిటీ సిబ్బందికి లైసెన్స్‌డ్ ఆయుధాలను అందచేసి భద్రతను కట్టుదిట్టం చేయనున్నారు. సెక్యూరిటీ నిబంధనలను వర్సిటీలో పకడ్బందీగా అమలు చేసేందుకు ఇప్పటికే వర్సిటీ ఉన్నతాధికారులతో నియమించిన కమిటీ నూతనంగా వర్సిటీలో చేపట్టనున్న సెక్యూరిటీ విధానంలో కీలక సూచనలు చేసింది. వర్సిటీలో కొందరు ఆకతాయిలు తిష్టవేసి విద్య వాతావరణాన్ని దెబ్బ తీస్తున్న నేపథ్యంలో వర్సిటీ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరిరామచంద్రంల నేతృత్వంలో సెక్యూరిటీ అధునీకరణకు కమిటీని నియమించారు. కమిటీ బుధవారం వర్సిటీ ఉన్నతాధికారులకు కీలక సిఫార్సులు చేస్తూ రిపోర్టును సమర్పించింది. కమిటీ రిపోర్టులో క్యాంపస్‌లో సెక్యూరిటీ విధానంలో తేవాల్సిన కీలక మార్పులను సూచించింది.

సెక్యూరిటీ సిబ్బందికి ఆయుధాలు

కాకతీయ యూనివర్సిటీలో మూడు విభాగాలకు చెందిన సెక్యూరిటీ సిబ్బందిని నియమించాలని భావిస్తున్నారు. వర్సిటీలో గొడవల నేపథ్యంలో విద్యార్థులను కట్టడిచేసేందుకు సాధారణ సెక్యూరిటీ సిబ్బంది వల్ల కావడం లేదని గుర్తించారు. గొడవల సందర్భంలో విధుల్లో ఉన్న సెక్యూరిటీ సిబ్బందిని తోసివేసి విద్యార్థులు గొడవ పడుతున్నారు. విచ్చలవిడిగా గేట్ల వద్ద రాకపోకలు సాగిస్తున్నారు. క్యాంపస్ లోపలికి అసాంఘిక శక్తులు వస్తున్నాయి. కొందరు అకతాయి విద్యార్థులు ముసుగులు వేసుకుని మారువేషంలో హాస్టళ్లలోకి ప్రవేశిస్తున్నారు. అడ్డుకునేందుకు ప్రయత్నిస్తున్న సెక్యూరిటీ సిబ్బందిపైకి దురుసుగా వచ్చి భౌతికదాడులకు దిగుతున్నారు. మద్యం తాగి గొడవలకు దిగుతున్న సందర్భాలున్నాయి. దీంతో వర్సిటీలో సెక్యూరిటీ వ్యవస్థను గాడిలో పెట్టేందుకు లైసెన్స్‌డ్ ఆయుధాలు కలిగిన సెక్యూరిటీ సిబ్బందిని విధుల్లోకి తీసుకోవాలని వర్సిటీ ఉన్నతాధికారులు నిర్ణయించారు. దీనికి సంబంధించిన విధివిధానాలపై కమిటీ కీలక సిఫార్సులు చేసింది. రిటైర్డు ఆర్మీ సిబ్బందిని వర్సిటీ సెక్యూరిటీ విధుల్లోకి తీసుకోనున్నారు. ఇప్పటి వరకు పనిచేస్తున్న సాధారణ సెక్యూరిటీ సిబ్బందితో పాటు వీరిని తీసుకోనున్నారు.

అల్లరి మూకల రాకకు చెక్

కాకతీయ యూనివర్సిటీలో భద్రతపై వర్సిటీ అధికారులు పకడ్బందీ చర్యలు చేపట్టారు. అడ్మిషన్లు పొందిన విద్యార్థులందరికీ ఎప్పటికప్పుడు అన్నివివరాలతో (మిగతా 8వ పేజీలో)

ఘనంగా ఆంధ్రజ్యోతి 23వ వార్షికోత్సవం



మడికొండ, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రజ్యోతి దినపత్రిక 23వ, ఏబీఎన్ న్యూస్ చానెల్ 16వ వార్షికోత్సవం మడికొండలోని ఆంధ్రజ్యోతి వరంగల్ యూనిట్ కార్యాలయంలో బుధవారం సాయంత్రం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా బ్రాంచ్ మేనేజర్ వర్దినేని రఘుపతిరావు, ఎడిషన్ ఇన్‌చార్జి శంకర్‌రావు శెంకేసి కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. తెలుగు నేలపై గత రెండు దశాబ్దాలుగా ఆంధ్రజ్యోతి, ఏబీఎన్ ప్రజల పక్షం వహిస్తూ వారి హృదయాల్లో సుస్థిర స్థానం సంపాదించుకున్నాయని తెలిపారు. నిబద్ధత, నిర్భీతి ఊపిరిగా ఆంధ్రజ్యోతి, ఏబీఎన్ ప్రస్థానం నిరంతరం సాగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏబీఎన్ ఇన్‌చార్జి దొంతు నవీన్, ప్రొడక్షన్ రీజనల్ మేనేజర్ భైరి అజయ్‌కుమార్, యాడ్స్ మేనేజర్ మాటేటి రమేశ్, సర్క్యులేషన్ మేనేజర్ షరీఫ్, సిస్టమ్స్ ఇన్‌చార్జి చక్రధర్, సబ్ ఎడిటర్లు, వివిధ విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.



డీఆర్ఎంకు వినతిపత్రం ఇస్తున్న భూ నిర్వాసితులు

రైల్వే కోచ్‌ఫ్యాక్టరీని సందర్శించిన డీఆర్ఎం

ఉద్యోగ అవకాశాలు కల్పించాలని భూనిర్వాసితుల వినతి

కాజీపేట, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): కాజీపేట సమీపంలోని అయోధ్యపురం వద్ద నిర్మిస్తున్న రైల్వే కోచ్‌ఫ్యాక్టరీని డివిజనల్ రైల్వే మేనేజర్ (డీఆర్ఎం) ఆర్.గోపాలకృష్ణన్ బుధవారం సందర్శించారు. కోచ్‌ఫ్యాక్టరీలో వివిధ రకాల షెడ్‌లను, రైల్వే ట్రాక్‌ను సందర్శించారు. అనంతరం అక్కడికి తీసుకువచ్చే మిషనరీల గురించి రైల్వే ఉన్నతాధికారులను అడిగి తెలుసుకున్నారు. సుమారు గంటసేపు ప్రతీ విభాగాన్ని (మిగతా 8వ పేజీలో)

తెలుగు యూనివర్సిటీ నుంచి ముగ్గురికి డాక్టరేట్లు


వెంకటరామకృష్ణ


మహేశ్వర్‌రావు


రాజేశ్వరి

వరంగల్ ఎడ్యుకేషన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం నుంచి ముగ్గురు డాక్టరేట్లు పొందినట్లు గిరిజన జానపద విజ్ఞాన పీఠం పీఠాధిపతి గడ్డం వెంకన్న బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కూన వెంకటరామకృష్ణ, చందా మహేశ్వర్‌రావు, దుండె రాజేశ్వరిలకు విశ్వవిద్యాలయం వివిధ అంశాల్లో సమర్పించిన పరిశోధన గ్రంథాలకుగాను పీహెచ్‌డీ ప్రకటించినట్లు ఆయన తెలిపారు.

ఇండియన్ అకౌంటింగ్ అసోసియేషన్‌లో చోటు


రాజేందర్

కేయూ క్యాంపస్ అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): కేయూ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగం ప్రొఫెసర్ కట్ల రాజేందర్ ప్రతిష్ఠాత్మకమైన ఇండియన్ అకౌంటింగ్ అసోసియేషన్ జాతీయ కార్యవర్గంలో సభ్యుడిగా చోటు దక్కింది. ఈనెల 12, 14 తేదీల్లో రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్‌లో జరిగిన జాతీయ కార్యవర్గ సమావేశంలో రాజేందర్‌ను ఎంపిక చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. కాగా, రాజేందర్ ఇండియన్ అకౌంటింగ్ అసోసియేషన్ వరంగల్ చాప్టర్ కార్యదర్శిగా సేవలందిస్తున్నారు. రాజేందర్‌ను పలువురు బోధన, బోధనేతర సిబ్బంది అభినందించారు.

మహిళ పీజీ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

కేయూ క్యాంపస్ అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ సుబేదారిలోని యూనివర్సిటీ మహిళ పీజీ కళాశాలలో ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో మిగిలిన సీట్లకు స్పాట్ అడ్మిషన్లు కల్పిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బీఎస్ఎల్ సౌజన్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ఐసెట్-2025 కన్వీనర్ మార్గదర్శకాలకు అనుగుణంగా 2025-26 ఏడాదికి అడ్మిషన్లు కల్పిస్తామని పేర్కొన్నారు. అర్హత, ఆసక్తి కల్గిన అభ్యర్థులు అక్టోబరు 17 నుంచి 21 వరకు కళాశాలకు ఒరిజినల్ ధ్రువపత్రాలను తీసుకునివచ్చి అడ్మిషన్లు పొందాలని కోరారు. మిగిలిన సీట్ల వివరాలు కళాశాలలో అందుబాటులో ఉంచామని, అలాగే వెబ్‌సైట్ http://tgicet.nic.in/లోనూ ఉన్నాయని పేర్కొన్నారు.

బోధనేతర సిబ్బందికి అంతర్గత బదిలీలు

కేయూ క్యాంపస్ అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీలో 16 మంది బోధనేతర సిబ్బందిని అంతర్గత బదిలీ చేస్తూ బుధవారం కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీ పొందిన వారిలో 6 మంది ఎన్టీవోస్, నాలుగో తరగతి ఉద్యోగులు ఉండగా, మరో 10 మంది అవుట్ సోర్సింగ్ సిబ్బంది ఉన్నారు. హాస్టళ్లలో అనేక ఏళ్లుగా పాతుకుపోయిన ఇద్దరు ఉద్యోగులను బిల్డింగ్ డివిజన్‌కు, సుబేదారిలోని సుబేదారిలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలకు బదిలీ చేశారు.

కేయూ కట్టుదిట్టం

(7వ పేజీ తరువాయి)

ఐడీ కార్డులను అందచేయనున్నారు. క్యూఆర్ కోడ్‌తో విద్యార్థుల సమగ్ర సమాచారాన్ని పొందుపరుస్తున్నారు. బయటి వ్యక్తులు, అల్లరిమూకలు వర్సిటీ క్యాంపస్‌లోకి రాకుండా గట్టిచర్యలు తీసుకుంటున్నారు. విద్యార్థులు సక్రమంగా క్లాస్‌లకు హాజరు అయ్యేలా ప్రణాళిక రూపొందించారు. విద్యార్థులకు, అధ్యాపకులు ఎప్పటికప్పుడు తమ క్లాసల టైంటేబుల్ వివరాలను అందచేయనున్నారు. క్యాంపస్ అంతా సీసీ కెమెరాలతో పర్యవేక్షణ చేయనున్నారు. అన్ని విభాగాలను సీసీ కెమెరాలతో వర్సిటీ ఉన్నతాధికారులతోపాటు క్యాంపస్ కళాశాలల ప్రిన్సిపాల్‌కు అనుసంధానం చేయనున్నారు. టైంటేబుల్ మేరకు తరగతులు జరుగుతున్నాయా లేదా బటన్ క్లిక్‌తో తెలుసుకునే అవకాశం ఉంది. అదే క్రమంలో టైంపాస్ వ్యవహారాలతో విద్యార్థులు క్లాస్‌లను ఎగ్గొట్టడాన్ని నిరోధించనున్నారు.

మెస్‌లోనూ ఫేస్ రికగ్నైజేషన్

విద్యార్థులు కొందరు మెస్‌లో భోజనం చేస్తూ క్లాస్‌లకు వెళ్లకుండా తప్పించుకుంటున్నారు. మెస్‌లో భోజనం చేస్తూ తరగతులకు హాజరుకాని విద్యార్థుల వివరాలను ఎప్పటికప్పుడు ప్రిన్సిపాల్ కార్యాలయంలో పర్యవేక్షించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. భోజనం చేసి క్లాస్‌లకు వెళ్లకుండా ఉండే విద్యార్థులపై పర్యవేక్షణ చేపట్టనున్నారు. గొడవలను నివారించేందుకు విద్యార్థులను ఎప్పటికప్పుడు కట్టడి చేసేందుకు సెక్యూరిటీని విస్తరించనున్నారు.

బీసీలకు రిజర్వేషన్లు రాజ్యాంగబద్ధంగా కల్పించాలి

● సీపీఐ, బీసీ సంఘాల నాయకుల రాస్తారోకో


కాళోజీ సెంటర్‌లో రాస్తారోకో చేస్తున్న సీపీఐ, బీసీ సంఘాల నాయకులు

హనుమకొండ కలెక్టరేట్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): దేశంలో జన గణనతో పాటు కుల గణన చేసి బహుజనుల జనాభా ఆధారంగా చట్టసభలలో, స్థానిక సంస్థలలో, విద్య, ఉద్యోగాలలో, ఉపాధి రంగాలలో రిజర్వేషన్లు కల్పించాలని సీపీఐ, బీసీ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. బహుజనుల జనాభా ఆధారంగా రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ సీపీఐ, బీసీ సంఘాల నాయకుల ఆధ్వర్యంలో బుధవారం హనుమకొండలోని కాళోజీ జంక్షన్‌లో రాస్తారోకో, ధర్నా చేశారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి, బీసీ సంఘాల నాయ కులు మాట్లాడుతూ.. బీసీ రిజర్వేషన్లపై రాష్ట్ర ప్రభుత్వం ఏకగ్రీవంగా జీవో 9 ద్వారా తీర్మానం చేసి గవర్నర్‌కు పంపినప్పటికీ గవర్నర్ వివక్షతో రిజర్వేషన్ల బిల్లు కేంద్రానికి పంపకుండా పెండింగ్‌లో పెట్టడం సరైందన్నారు. హైకోర్టు స్టే ఇచ్చి బీసీల రిజర్వేషన్లు, స్థానిక సంస్థల ఎన్నికలను అడ్డుకోవడం దుర్మార్గమైన చర్య అన్నారు. ఈ నెల 18వ తేదీన బీసీ ఐక్య కార్యాచరణ జరిపే బంద్‌ను విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు తోట బిక్షపతి, మద్దెల ఎల్లేష్, ఉట్కూరి రాములు, గుంటి రాజేందర్, బత్తిని సదానందం, నేదునూరి రాజమౌళి, బీసీ సంఘాల నాయకులు శ్యాంసుందర్, ప్రొఫెసర్ తిరుణహరి శేషు, చాపర్తి కుమార్, నగేష్, చిన్నాల యశ్వంత్‌తోపాటు వందలాది మంది బీసీ జాక్, సీపీఐ నాయకులు పాల్గొన్నారు.


మంత్రి శ్రీధర్‌బాబుకు వినతి పత్రం అందజేస్తున్న అర్చక ఉద్యోగ జేఏసీ నాయకులు

బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ బోర్డును పునరుద్ధరించాలి

మంత్రి శ్రీధర్‌బాబుకు అర్చక ఉద్యోగ జేఏసీ విజ్ఞప్తి

హనుమకొండ, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ బోర్డును వెంటనే పునరుద్ధరించాలి తెలంగాణ అర్చక ఉద్యోగ జేఏసీ చైర్మన్ గంగు ఉపేంద్రశర్మ నాయకత్వంలో బ్రాహ్మణ సంఘాల నాయకులు రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బుధవారం హైదరాబాద్ మినిస్టర్స్ క్వార్టర్స్‌లో మంత్రి శ్రీధర్‌బాబును కలిసి వినతి పత్రం సమర్పించారు. రాష్ట్రంలో ఈ బోర్డును తిరిగి వెంటనే ఏర్పాటు చేసి నిధులు కేటాయించాలని అభ్యర్థించారు. వేలాదిమంది బ్రాహ్మణులు తమ కాళ్ల మీద నిలబడడటానికి, తమ కుటుంబ పోషణకు సంక్షేమ పథకాలను వర్తింపచేయాలని కోరారు. ఇప్పటికే చాలా మంది విదేశీ విద్య కోరకు విదేశాలకు వెళ్లారని, గత ప్రస్తుత ప్రభుత్వాల హయాంలోనూ మూడేళ్లుగా పేద బ్రాహ్మణులకు ఎలాంటి సంక్షేమ పథకాలు అమలు కావడం లేదని, ఎంతో మంది సాయం కోసం ఎదురుచూస్తున్నారని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం ఈడబ్ల్యుఎస్ రిజర్వేషన్ వల్ల అగ్రవర్ణాల పేదలకు కొంత మేరకు న్యాయం జరిగిందన్నారు. దేవాదాయ చట్టం 33/2007 ద్వారా ధార్మిక పరిషత్ ఏర్పాటు చేయాలని, ఇందువల్ల రాష్ట్రంలోని 16వేల దేవాలయాలు అభివృద్ధి చెందుతాయని, ఆగమానుసారంగా పూజాది కార్యక్రమాలు నిర్వహించడానికి అవకాశం ఏర్పడుతుందని తెలిపారు.

ఉద్యోగులకు, దేవాలయాల్లో పనిచేస్తున్న అర్చక ఉద్యోగులకు సీనియారిటీ ప్రకారం పదోన్నతులు కల్పించేందుకు ఇది ఒక వేదికగా నిలుస్తుందని అభిప్రాయపడ్డారు. అన్యాక్రాంతం అవుతున్న భూములను కాపాడడం ధార్మిక పరిషత్ వల్లనే సాధ్యమవుతుందని అన్నారు. అర్చక, ఉద్యోగులకు వెంటనే పదోన్నతులు కల్పించాలని కోరారు. ఇందుకు మంత్రి శ్రీధర్‌బాబు సానుకూలంగా స్పందించారు. ఆధ్యాత్మిక రంగాన్ని ప్రోత్సహించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. మంత్రిని కలిసిన వారిలో గంగు ఉపేంద్రశర్మతో పాటు బ్రాహ్మణ సంఘాల నాయకులు వెంకటరత్నం, విలాస్ శర్మ, రామశర్మ, డాక్టర్ వింజమూరి సుధాకర్ శర్మ తదితరులు ఉన్నారు.

15వ ఫైనాన్స్ నిధులు సకాలంలో ఖర్చు చేయాలి

వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి


అకౌంట్స్ అధికారులతో మాట్లాడుతున్న మేయర్ సుధారాణి

వరంగల్ కార్పొరేషన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ వరంగల్ నగరంలో జరుగుతున్న అభివృద్ధి పనులకు 15వ ఫైనాన్స్ నిధులు సకాలంలో ఖర్చు చేయాలని మేయర్ గుండు సుధారాణి అన్నారు. బుధవారం వరంగల్ నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని మేయర్ చాంబర్‌లో అకౌంట్స్, ఇంజనీరింగ్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. మునిసిపల్ శాఖకు సంబంధించిన పనులలో అన్ని విభాగాలు సమన్వయంతో పని చేయాలని, అప్పుడే అభివృద్ధి జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ సత్యనారాయణ, అకౌంట్స్ అధికారి శివలింగం, జేఏవో సిలివేరు సరిత, ఈఈలు మహేందర్, రవికుమార్, సంతోష్‌బాబు, డీఈలు కార్తీక్‌రెడ్డి, రోజారాణి, శ్రీకాంత్, ఏఈ సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

సమరానికి సై..

(7వ పేజీ తరువాయి)

క్రీడాకారులకు భోజన, వసతి సమకూర్చడం లేదని, ఇక్కడ పోటీల్లో పాల్గొనే 135మంది కోచ్‌లకు, టెక్నికల్ అఫీషియల్స్, కోచ్‌లకు మాత్రమే సమీపంలోని పలు హోటల్లో బస, భోజన వసతి కల్పించినట్లు అథ్లెటిక్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి సారంగపాణి తెలిపారు.

తెలుగు రాష్ట్రాల నుంచి 25మంది అథ్లెట్లు

ఆతిథ్య తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి 25 మంది అథ్లెట్లు పాల్గొననున్నారు. ఇందులో తెలంగాణ నుంచి 13మంది మెన్, 7గురు ఉమెన్ మొత్తం 20మంది అథ్లెట్లు అదే విధంగా ఆంధ్రప్రదేశ్ నుంచి ముగ్గురు మెన్ ఇద్దరు ఉమెన్ అథ్లెట్లు మొత్తం 5గురు అథ్లెట్లు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి 25మంది అథ్లెట్లు ప్రాతినిధ్యం వహించనున్నారు. దేశ వ్యాప్తంగా రెండు తెలుగు రాష్ట్రాలతో కలిపి మొత్తం 937మంది అథ్లెట్లు జాతీయస్థాయి అథ్లెటిక్స్ బరిలో దిగి వారి భవిత్యాన్ని తేల్చుకోనున్నారు.

క్రీడాంశాలు

100, 200, 400, 800, 1500, 5వేలు, 10వేల మీటర్ల పరుగుపందెంతో పాటు 20కిలో మీటర్ల రేస్‌వాక్. 110, 400 మీటర్ల హర్డిల్స్, 3వేల మీటర్ల స్ట్రీపుల్‌చేస్, హైజంప్, లాంగ్‌జంప్, ట్రిపుల్‌జంప్, పోల్‌వాల్ట్, షాట్‌పుట్, హ్యామర్‌త్రో, జావెలిన్‌త్రో, డిస్కస్‌త్రో, డెకాథ్లాన్, హెప్టథ్లాన్, క్రీడాంశాలో మూడు రోజుల పాటు క్రీడలు జరగనున్నాయి.

పకడ్బందీగా ఏర్పాట్లు



మూడురోజుల పాటు జేఎన్ఎస్ వేదికగా నిర్వహించనున్న జాతీయస్థాయి అండర్-23 మెన్ అండ్ ఉమెన్ అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు అన్ని విధాలుగా సౌకర్యాలను కల్పించాం. క్రీడాకారుల కోసం డాక్టర్ల బృందం, ఫిజి యోథెరపిస్టులు, అంబులెన్స్, తాగునీరు, మొబైల్ టాయిలెట్స్ డ్రెస్సింగ్ రూమ్‌లు ఏర్పాటు చేశాం. అథ్లెటిక్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఏఎఫ్ఐ) నింబంధనలకు లోబడి జాతీయస్థాయి పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు భోజన వసతి, బస సౌకర్యలు కల్పించలేదు. టెక్నికల్ అఫీషియల్స్, కోచ్‌లు, మేనేజర్లకు సమీపంలో పలు హోటళ్లలో బస, జేఎన్ఎస్‌లో భోజన వసతి కల్పించాం.

- కొదిరి సారంగపాణి, అథ్లెటిక్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి

రైల్వే కోచ్‌ఫ్యాక్టరీని సందర్శించిన డీఆర్‌ఎం

(7వ పేజీ తరువాయి)

సందర్శించి వాటికి సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రైల్వే కోచ్‌ఫ్యాక్టరీలో భూములు కోల్పోయిన భూ నిర్వాసితులు అయోధ్యపురం మాజీ సర్పంచ్ గాదం యాదగిరి, ఈ. ప్రదీప్ కుమార్, కాయిత కుమార్, జి.విజయ్ కుమార్‌లు డీఆర్‌ఎంను కలిసి వినతి పత్రం సమర్పించారు. వినతిపత్రంలో కోచ్‌ఫ్యాక్టరీలో స్థానికులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని చెప్పడంతో భూములు కోర్టు కేసుల్లో ఉన్నప్పటికీ కేసులు విరమించుకుని భూములు అప్పగించామని పేర్కొన్నారు. స్థానికులకు ఉద్యోగాలు కల్పించే విషయంలో జిల్లా కలెక్టర్, కేంద్ర మంత్రి తమకు లేఖలు పంపారని, వాటిని పరిశీలిస్తున్నామని డీఆర్‌ఎం గ్రామస్థులకు చెప్పారు.

అనంతరం డీజిల్ షెడ్‌ను తనిఖీ చేశారు. షెడ్‌లో పలు విభాగాలను పరిశీలించారు. నూతన టెక్నాలజీపై ఉన్నతాధికారులతో చర్చించారు. ఆతర్వాత ఎలక్ట్రిక్ లోకోషెడ్‌ను సందర్శించారు. ఎన్ని ఇంజన్‌లు మెయింటనెన్స్ చేస్తున్నారనే విషయాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆ తర్వాత కాజీపేట రైల్వేస్టేషన్ సమీపంలో చేస్తున్న అమృత్‌భారత్ పనులను పరిశీలించారు. స్టేషన్ అభివృద్ధి పనులు త్వరగా పూర్తిచేయాలని ఆదేశాలు జారీ చేశారు. అనంతరం ప్రత్యేక రైల్లో సికింద్రాబాద్‌కు తిరిగి వెళ్లారు. డీఆర్‌ఎం వెంట సీనియర్ డీవోఎం సురేశ్ రెడ్డి, డీఈఎన్ ప్రన్‌జ్వల్, డీఎంఈ వెంకట కుమార్, డీఈఈ జి.సూర్యనారాయణ, స్టేషన్ మేనేజర్ అగ్గి రవీందర్ ఉన్నారు. డీఆర్‌ఎంకు వినతిపత్రం సమర్పించిన వారిలో రైల్వే కార్మిక నాయకులు పాక వేదప్రకాశ్, జానీమియా, జి.రాజేశ్వర్‌రావు, నరేశ్, యాదగిరి, ఎ.సత్యనారాయణ ఉన్నారు.

ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌లలో రోడ్ల నిర్మాణాలు

జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్

బాలసముద్రంలోని ట్రాన్స్‌ఫర్ స్టేషన్ పరిశీలన



బాలసముద్రంలో వెహికిల్ షెడ్డులో తనిఖీ చేస్తున్న కమిషనర్

వరంగల్ కార్పొరేషన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): బాలసముద్రంలోని వెహికిల్ షెడ్డు ప్రాంతంలోని ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌లో రోడ్ల నిర్మాణానికి సమగ్ర ప్రణాళికలు రూపొందించాలని జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్ అన్నారు. బుధవారం బాలసముద్రంలోని సెకండ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. స్వచ్ఛ ఆటోలు, టిప్పర్లు, కాంపాక్టర్లు ప్రతీ రోజు ఎన్ని ట్రిప్పులు చేస్తున్నాయని ప్రతీరోజు రికార్డు నిర్వహించాలన్నారు. చెత్త తరలింపు వాహనాల వాస్తవ పరిస్థితులను తెలుసుకుని మరమ్మతులు రాకుండా చూడాలన్నారు. ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌లో రోడ్లు వేయకపోవడం వల్ల ఇక్కడే వాహనాల రాకపోకలకు జాప్యం జరుగుతుందని అన్నారు. శానిటేషన్, ఇంజనీరింగ్ అధికారులు వేగవంతంగా రోడ్లు, పార్కింగ్ నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. వాహనాలు శుభ్రం చేయడానికి సర్వీసింగ్ పాయింట్ ఏర్పాటుతో పాటు వాషింగ్ ఏరియా శుభ్రంగా ఉండాలన్నారు. వెహికిల్ షెడ్డు డంపింగ్ యార్డ్‌లా కాకుండా పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఎంహెచ్‌వో డాక్టర్ రాజారెడ్డి, ఈఈలు మహేందర్, రవికుమార్, డీఈలు రాజ్‌కుమార్, శ్రీకాంత్, శానిటరీ సూపర్‌వైజర్ నరేందర్, ఏఈ ఫణికుమార్ తదితరులు పాల్గొన్నారు.

సదయ్య డిప్యూటేషన్ పొడిగింపు నిరాకరణ

ఆయనను రిలీవ్ చేసిన బీఎడ్ కళాశాల ప్రిన్సిపాల్


వరంగల్ డీఈవోకు రిపోర్టు చేసిన సదయ్య

హనుమకొండ, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): హనుమకొండలోని బీఎడ్ కాలేజీలో పనిచేస్తున్న ఆట సదయ్య డిప్యూటేషన్ గడువు పొడిగింపునకు విద్యాశాఖ నిరాకరించినట్లు తెలిసింది. దీంతో ఆయనను బీఎడ్ కళాశాల ప్రిన్సిపాల్ అబ్దుల్‌హై రిలీవ్ చేశారు. సదయ్య బుధవారం వరంగల్ జిల్లా ఇన్‌చార్జి విద్యాశాఖాధికారి రంగయ్యనాయుడు వద్ద రిపోర్టు చేసినట్లు సమాచారం. ఖిలా వరంగల్ మండలం పరిధిలోని పాఠశాలల్లో వెకెన్సీబట్టి ఆయనకు పోస్టింగ్ ఇవ్వనున్నారు. ఖిలా వరంగల్ మండలం రైల్వేగేట్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్ (ఆంగ్లం) అయిన సదయ్య 2023 సెప్టెంబరు 26 హనుమకొండ ప్రభుత్వ బీఎడ్ కళాశాలకు సైకాలజీ ఫ్యాకల్టీ కోసం డిప్యూటేషన్‌పై వచ్చారు. ఆయన డిప్యూటేషన్ రెండేళ్ల కాలపరిమితి గత నెల 26తో ముగిసింది. అయితే బీఎడ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆయనను వెంటనే రిలీవ్ చేయకుండా తాత్సారం చేశారు. పైగా జూలై 16వ తేదీన సదయ్య డిప్యూటేషన్ కాలపరిమితిని మరో రెండేళ్లు పెంచాలని కోరుతూ పాఠశాల డైరెక్టర్‌కు లేఖ కూడా రాశారు. ఈ లేఖపై పాఠశాల డైరెక్టర్ నుంచి ఎలాంటి స్పందన లేదు. సదయ్య డిప్యూటేషన్ కాలపరిమితి ముగియడానికి ఒక రోజు ముందు ప్రిన్సిపాల్ అబ్దుల్ పాఠశాల విద్యాడైరెక్టర్‌కు మరోసారి కూడా ఇదే అంశాన్ని ప్రస్తావిస్తూ లేఖ రాశారు.

సదయ్య తన 30 ఏళ్ల సర్వీస్‌లో సగం సర్వీస్ బీఎడ్ కళాశాలలో, ఇతరత్రా ఫారిన్ సర్వీస్‌లో కొనసాగడంపై పెద్ద ఎత్తున విమర్శలు వెల్లువెత్తడం.. ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి సైతం సదయ్య డిప్యూటేషన్‌ను పొడగించరాదని పాఠశాల డైరెక్టర్‌కు లేఖ రాయడం. పలు ఉపాధ్యాయ సంఘాలు సైతం ఆయన డిప్యూటేషన్‌ను వ్యతిరేకిస్తూ జిల్లా కలెక్టర్‌కు, పాఠశాల డైరెక్టర్‌కు లేఖలు రాసిన నేపథ్యంలో సదయ్య డిప్యూటేషన్‌ను పొడిగించకుండా ఆయనను వెంటనే రిలీవ్ చేయాల్సిందిగా పాఠశాల డైరెక్టర్ బీఎడ్ కళాశాల ప్రిన్సిపాల్‌ను ఆదేశించారు. దీంతో చేసేది లేక ప్రిన్సిపాల్ అబ్దుల్‌హై సదయ్యను రిలీవ్ చేశారు. అయితే గతంలో సదయ్య డిప్యూటేషన్‌కు ముందు పనిచేసిన పాఠశాలలోని ఆయన స్థానంలో మరొకరిని నియమించినందువల్ల సదయ్యకు ఎక్కడ పోస్టింగ్ ఇస్తారో వేచి చూడాలి.

18న జాబ్ మేళా

వరంగల్ ఎడ్యుకేషన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఎంప్లాయిమెంట్ అండ్ ట్రైనింగ్ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 18న జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ ఎం.మల్లయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్మార్ట్ కిడ్స్ ఇండియా ఇన్నోవేషన్స్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీలో బిజినెస్ డెవలప్‌మెంట్ అసోసియేట్ ఖాళీల భర్తీకి జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. డిగ్రీ లేదా పీజీ ఉత్తీర్ణులైన 23 నుంచి 35 ఏళ్ల వయసుగల యువకులు జాబ్ మేళాలో పాల్గొనవచ్చునని తెలిపారు. ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులు ములుగురోడ్‌లోని ప్రభుత్వ ఐటీఐ క్యాంపస్‌లో నిర్వహించే జాబ్ మేళాలో జిరాక్స్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని ఆయన కోరారు. మరిన్ని వివరాలకు 7893394393 ఫోన్ నెంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.


సమావేశంలో పాల్గొన్న వీసీ ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ రామచంద్రంలు

కేయూలో ఫేస్ రికగ్నైజేషన్ హాజరు

కేయూ క్యాంపస్ అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ పరిధిలో బోధన, బోధనేతర ఉద్యోగులందరితో పాటు విద్యార్థులందికీ ఫేస్ రికగ్నైజేషన్ హాజరును అమల్లోకి తెస్తామని కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం వెల్లడించారు. బుధవారం కేయూ పరిపాలన భవనంలోని కమిటీ హాల్‌లో అన్ని కళాశాల ప్రిన్సిపాళ్లతోపాటు ప్రధాన పరిపాలనాధికారులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రంలు ఫేస్ రికగ్నైజేషన్ హాజరుపై చర్చించారు. కేయూ కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి డాక్టర్ బొద్దిరెడ్డి రమ, డాక్టర్ బి.రమేశ్ నేతృత్వంలో వర్సిటీ క్యాంపస్‌తోపాటు సుబేదారి ఆర్ట్స్ కళాశాల జోన్లుగా విభజించి ఫేస్ రికగ్నైజేషన్ హాజరు యంత్రాలను అమర్చుతారు. అన్ని కళాశాలల విభాగాధితులు, ప్రిన్సిపాళ్లు, పరిపాలనా అధికారులు సహకరించాలని సూచనలు చేశారు. ఫేస్ రికగ్నైజేషన్ హాజరు నమోదు ఆధారంగానే ఉద్యోగుల జీతాల చెల్లింపు ఉంటుందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో కేయూ క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ తాళ్ళపల్లి మనోహర్, ఎస్డీఎల్‌సీఈ డైరెక్టర్ బి.సురేశ్‌లాల్, ప్రిన్సిపాళ్లు సుంకరి జ్యోతి, రామోజు నరసింహచారి, కట్ల రాజేందర్, కృష్ణవేణి, సౌజన్య, నల్లాని శ్రీనివాస్, వైస్ ప్రిన్సిపాల్ మమత, రమ, వాసుదేవారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కేయూ మహిళ ఇంజనీరింగ్ కళాశాలలో..

ఫేస్ రికగ్నైజేషన్ హాజరును బుధవారం కేయూక్యాంపస్‌లోని మహిళ ఇంజనీరింగ్ కళాశాలలో ప్రయోగాత్మకంగా అమలు చేశారు. బుధవారం అధ్యాపకులతోపాటు విద్యార్థులందరికీ ఫేస్ రికగ్నైజేషన్ హాజరునమోదును చేపట్టారు. ప్రాక్టికల్ ఇబ్బందులను గుర్తించారు. వాటిని అధికగమించేందుకు అప్పటికప్పుడు చర్యలు తీసుకున్నారు. వర్సిటీ పరిధిలో అన్ని కళాశాలలకు, ఉద్యోగులకు త్వరలోనే ఫేస్ రికగ్నైజేషన్ హాజరును ప్రవేశపెట్టనున్నారు. ఫేస్ రికగ్నైజేషన్ హాజరుతో అధ్యాపకులు, ఉద్యోగులు, విద్యార్థులతో హాజరుశాతం పెరిగి తరగతులు సక్రమంగా జరుగుతాయని వర్సిటీ వర్గాలు చెబుతున్నాయి.

వరంగల్ మార్కెట్ ధరలు

(రూ. వేలల్లో)

పంట	క్వింటా గరిష్ఠం	క్వింటా కనిష్ఠం
పత్తి	6940	5300
మక్కలు	1960	1521
కందులు	5633	3022
పెసళ్లు	5350	3022
పల్లికాయ (సూక)	6530	3500
పల్లికాయ (పచ్చిది)	----	----
పసుపు (కాడి)	10559	8699
పసుపు (గోల)	10666	8906
తేజ మిర్చి	12500	9500
తేజ ఏసీ	-	-
వండర్‌హాట్	-	-
వండర్‌హాట్ ఏసీ	15500	12000
యూఎస్341ఏసీ	15900	9000
దీపిక	-	-
సింగిల్‌పట్టి ఏసీ	-	-
తాలు మిర్చి	6000	4000

- వరంగల్ వ్యవసాయం



ఎల్కతుర్తిలోని ఓ గ్రానైట్ కటింగ్ కంపెనీ

బండ బారుతున్న జీవితాలు

- గ్రానైట్ కటింగ్ ఇండస్ట్రీతో పొంచి ఉన్న ప్రమాదం
- నిబంధనలు పాటించని కంపెనీలు
- దుమ్ము, శబ్దంతో వాతావరణం కలుషితం
- బావుల్లో అడుగంటిన నీరు
- పట్టించుకోని సంబంధిత అధికారులు

ఎల్కతుర్తి, అక్టోబరు 15 (ఆంధ్ర జ్యోతి): మండల పరిధిలో నిర్మించిన గ్రానైట్ ఫ్యాక్టరీలతో ఈ ప్రాంతానికి ప్రమాదం పొంచి ఉంది. మిషన్ల శబ్దం, దుమ్ముతో పర్యావరణం దెబ్బతింటుంది. పంటలూ దెబ్బతిని రైతులకు తీవ్ర నష్టం వాటిల్లుతుంది. ఫ్యాక్టరీల నుంచి వెలువడే దుమ్ముధూళితో ఈ ప్రాంత ప్రజలు శ్వాసకోస సంబంధిత వ్యాధుల బారిన పడుతున్నారు. నిత్యం పచ్చదనంతో ఉండే ప్రాంతంలో మొక్కలు మొలకెత్తని దుస్థితి నెలకొంది. ఫ్యాక్టరీస్ నిర్వాహకులు నిబంధనలు పాటించక పోవడంతో ఈ ప్రాంతానికి భారీ ప్రమాదం పొంచి ఉంది.

సాగుకు అనువైన భూముల్లో పరిశ్రమలు

వ్యవసాయ సాగుకు అనువైన భూముల్లో గ్రానైట్ కటింగ్ ఫ్యాక్టరీలు ఏర్పాటు చేశారు. అధికారులు, వ్యాపారులు ఇచ్చిన మాముళ్లకు కక్కుర్తి పడి విచ్చలవిడిగా అనుమతులు ఇవ్వడంతో ఈ ప్రాంత ప్రజలు, రైతులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. ఫ్యాక్టరీల నిర్మాణాలను పరిశీలించకుండానే గోరంత అనుమతులతో కొండంత విస్తీర్ణంలో నిర్మాణాలు చేపట్టారు. కొన్ని ఫ్యాక్టరీలకు సరైన అనుతులు లేకుండానే యథేచ్ఛగా వ్యాపారాలు సాగిస్తున్నారు.

అడుగంటిన భూగర్భ జలాలు

వాల్టా చట్టాన్ని అమలు చేయాల్సిన అధికారులు గ్రానైట్ కటింగ్ కంపెనీ వ్యాపారులకు కొమ్ముకాస్తున్నారు. వాణిజ్య, పారిశ్రామిక ఉపయోగాలకు బోరు వేయడానికి రాష్ట్ర భూగర్భ జల విభాగం (సెంట్రల్ గ్రౌండ్ వాటర్ అథారిటీ) నుంచి తప్పనిసరిగా అనుమతులు పొందాలి. వ్యవసాయాధారిత ప్రాంతాల్లో కేవలం 160 ఫీట్లుకు పైగా బోరు వేస్తే చుట్టు పక్కల ఉన్న వ్యవసాయ బావుల్లో నీరు అడుగంటి పోయే ప్రమాదం ఉంది. ఎలాంటి అనుమతులు పొందకుండానే ఒక్కొక్క కంపెనీలో వెయ్యి ఫీట్ల లోతుకు పైగా బోర్లు వేశారు. గ్రానైట్ కటింగ్ మిషన్‌కు నిత్యం నీరు అవసరం ఉండడంతో నిరంతరాయంగా బోర్లతో నీటిని తోడేస్తున్నారు. దీంతో కిలోమీటర్ల దూరంలో ఉన్న వ్యవసాయ బావుల్లో సైతం నీరు అడుగంటి పోయింది. కంపెనీల తీరుపై పొల్యూషన్ నియంత్రణ, రెవెన్యూ, ట్రాన్స్‌పోర్టు అధికారులకు స్థానికులు గతంలో ఫిర్యాదు చేశారు. పరిశ్రమలను తనిఖీ చేసి వారిచ్చే మాముళ్లు తీసుకుని జారుకుంటున్నారే తప్ప ఏ ఒక్క కంపెనీపై చర్యలు తీసుకోవడం లేదని రైతులు మండిపడుతున్నారు.

40కి పైగా గ్రానైట్ కటింగ్ పరిశ్రమలు

ఎల్కతుర్తి, గోపాల్‌పూర్, సూరారం గ్రామాల శివారు వ్యవసాయ భూములను కొందరు కొనుగోలు, మరికొందరు లీజుకు తీసుకుని 38 గ్రానైట్ కటింగ్ పరిశ్రమలను ఏర్పాటు చేశారు. గజాల్లో వ్యవసాయ భూములను నాలా (నాన్ అగ్రికల్చర్ ల్యాండ్) కన్వర్షన్ చేయించుకుని ఎకరాల విస్తీర్ణంలో అధికారుల అండదండలతో నిర్మాణాలు చేపట్టారు. దీంతో ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి పడిందని నిపుణులు చెబుతున్నారు. కొన్ని పరిశ్రమలు నిర్మించిన భూములకు రైతు భరోసా డబ్బులు పడుతున్నాయని స్థానిక రైతులు ఆరోపిస్తున్నారు.



గ్రానైట్ కోసం వచ్చే లారీతో చెలరేగుతున్న దుమ్ము

శబ్ద కాలుష్యం

అమావాస్య రోజు మినహా ప్రతిరోజూ 24 గంటల పాటు గ్రానైట్ కంపెనీల్లో కటింగ్ మిషన్లు నిరంతరంగా నడుస్తున్నాయి. వాటి ద్వారా వచ్చే శబ్దానికి చుట్టు పక్కల రైతులు, పక్కనే ఉపాధి పొందుతున్న గీత కార్మికులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. ఒక కటింగ్ మిషన్ ద్వారా 100 నుంచి 105 డీబీ (డెసిబుల్) శబ్దం ఉత్పన్నమవుతుంది. 40 కంపెనీల్లో యంత్రాల ద్వారా వచ్చే శబ్దాన్ని ప్రజలు భరించలేకపోతున్నారు. శబ్దం బయటకు రాకుండా ఏర్పాట్లు చేయాల్సిన ఫ్యాక్టరీల నిర్వాహకులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు.

దెబ్బతింటున్న పంటలు

గ్రానైట్ కటింగ్ అలాగే పెద్ద బండలను తీసుకెళ్లే లారీల రాకపోకలతో వచ్చే దుమ్ము ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తుంది. ఈ ప్రాంతంలో ఎక్కడ చూసినా దుమ్ము దర్శనమిస్తుంది. కటింగ్ ద్వారా వచ్చే దుమ్మును ఎక్కడ పడితే అక్కడే పడేస్తున్నారు. దీంతో ఆ ప్రాంతంలో మొక్కలు సైతం మొలకెత్తని పరిస్థితి నెలకొంది. పంటలపై దుమ్ము పడి దెబ్బతింటున్నాయి. దిగుబడి రాక రైతులు నష్టపోతున్నారు. కంపెనీలు దుమ్ము చెలరేగకుండా చర్యలు చేపట్టడం లేదు. కంపెనీలకు పక్కనే ఎన్‌హెచ్ - 563 ప్రధాన రహదారి ఉండడంతో అటుగా వెళ్లే వాహనదారులు సైతం దుమ్ముతో ఇబ్బంది పడుతున్నారు.

నియంత్రణ చర్యలు శూన్యం

ప్రమాదాలను నివారణకు అధికారులు, నిర్వాహకులు చర్యలు తీసుకోవడం లేదు. నిబంధనలు పాటించని కంపెనీలపై చర్యలు తీసుకోకపోవడంతో నిర్వాహకులకు అడ్డు అదుపు లేకుండా పోయింది. తనిఖీ చేయాల్సిన అధికారులు నెలవారీ మాముళ్లు ముట్టడంతో కిమ్మనకుండా ఉంటున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కంపెనీల తీరుపై ఫిర్యాదు చేస్తే అది అధికారులకు వరంగా మారుతుంది. ఈ వంకతో పెద్ద మొత్తంలో డబ్బులు దండుకుంటున్నారనే ఆరోపణలున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి అవినీతికి పాల్పడుతున్న సంబంధిత అధికారులు, నిబంధనలు పాటించని గ్రానైట్ కంపెనీల యజమానులపై చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ సత్యశారద, అదనపు కలెక్టర్ సంధ్యారాణి అధికారులు

ధాన్యం సేకరణ సజావుగా సాగాలి

వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వర్‌రావు

వరంగల్ కలెక్టరేట్, అక్టోబరు 15 (ఆంధ్ర జ్యోతి): రాష్ట్రంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ సజావుగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి, వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు ఆదేశించారు. బుధవారం వారు హైదరాబాద్ నుంచి జిల్లా కలెక్టర్లతో ధాన్యం సేకరణపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఏ గ్రేడ్ ధాన్యం క్వింటాల్‌కు రూ. 2389, సాధారణ రకానికి రూ. 2369 చొప్పున మద్దతు ధర చెల్లిస్తున్నట్లు తెలిపారు. సన్న రకానికి రాష్ట్ర ప్రభుత్వం అదనంగా రూ. 500 చొప్పున బోనస్ అందిస్తున్నందున ఇతర రాష్ట్రాల నుంచి ఇక్కడికి ధాన్యం తరలించే అవకాశం ఉందని, దాన్ని అరికట్టేందుకు తగు చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ విషయంలో పోలీసులు, జిల్లా యంత్రాంగం సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ధాన్యం విక్రయించిన 48 గంటల వ్యవధిలో రైతుల ఖాతాల్లో డబ్బులు జమ అయ్యేలా చూడాలని ఆదేశించారు. అనంతరం కలెక్టర్ సత్యశారద మాట్లాడుతూ.. జిల్లాలో ఈసారి వానాకాలంలో 3.15 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని అంచనా వేశామని, అందుకోసం 258 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామని వివరించారు. ధాన్యం సేకరణ సజావుగా జరిపేలా చర్యలు తీసుకున్నామన్నారు. జిల్లాకు 1200 అదనపు టార్పాలిన్లు కేటాయించాలని ఈ సందర్భంగా కలెక్టర్ కోరారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, జడ్పీ సీఈవో రామిరెడ్డి, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి కిష్టయ్య, మేనేజర్ సంధ్యారాణి, జిల్లా వ్యవసాయాధికారి అనురాధ, జిల్లా సహకార అధికారి నీరజ, జిల్లా రవాణా శాఖ అధికారి శోభన్‌బాబు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో

అంతరాయాలను తగ్గించాలి

టీజీ ఎన్పీడీసీఎల్ ఆపరేషన్స్ డైరెక్టర్ టి.మధుసూదన్

రాంనగర్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ సరఫరాలో అంతరాయాలు లేకుండా ముందుస్తు చర్యలు చేపట్టాలని టీజీ ఎన్పీడీసీఎల్ ఆపరేషన్స్ డైరెక్టర్ టి.మధుసూదన్ అధికారులకు సూచించారు. వరంగల్ సర్కిల్ అధికారులతో బుధవారం ములుగురోడ్డులోని ట్రాన్స్‌కో కార్యాలయం ఆవరణంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ మాట్లాడుతూ.. లూజ్ లైన్‌లు లేకుండా సరిచేయాలని, వేసవి కాలంలో ఓవర్‌లోడ్ తగ్గించేందుకు అదనపు ట్రాన్స్‌ఫార్మర్ల కోసం ఇప్పటి నుంచే కార్యాచరణ రూపొందించాలని సూచించారు.

పొలం బాట ద్వారా రైతులకు విద్యుత్ ప్రమాదాలు, విద్యుత్ వినియోగంపై అవగాహన కల్పించాలని సూచించారు. డీటీఆర్ ఫెయిల్యూర్‌లను తగ్గించాలన్నారు. ఫెయిల్యూర్‌లు అయితే సత్వరమే నూతన డీటీఆర్‌లను ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆపరేషన్స్ సీఈ రాజు చౌహాన్, వరంగల్ సర్కిల్ ఎస్ఈ గౌతంరెడ్డి, డీఈ టెక్నికల్ ఎ.ఆనందం, వరంగల్ డీఈ మల్లికార్జున్, నర్సంపేట డీఈ తిరుపతి, ఏఎస్వో సంజీవరావు, కన్‌స్ట్రక్షన్ డీఈ హర్షి, సర్కిల్ పరిధిలోని ఏడీఈ, ఏఈలు తదితరులు పాల్గొన్నారు.

బ్యాటరీల చోరీ ముఠా అరెస్ట్



నిందితుల వివరాలను వెల్లడిస్తున్న ఏసీపీ రవీందర్ రెడ్డి

నర్సంపేట టౌన్, అక్టోబరు 15 (ఆంధ్ర జ్యోతి) : నర్సంపేట నియోజకవర్గంలో పలు ప్రాంతాల్లో బ్యాటరీ దొంగతనం చేసిన నలుగురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఏసీపీ రవీందర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. జనగామ జిల్లా పాలకుర్తికి చెందిన గుంజే సంపత్, ప్రశాంత్, జఫర్‌గఢ్‌కి చెందిన గండికోట మహేష్, బోసు సాంబరాజు అనే నలుగురు వ్యక్తులు గ్రూపుగా ఏర్పడ్డారు. సులువుగా డబ్బులు సంపాధించాలనే ఉద్దేశంతో రాత్రి సమయాల్లో దొంగతనాలు చేయాలని నిర్ణయించుకొని, నర్సంపేట మండలం, చుట్టు పక్కల గ్రామాల్లో సోలార్ లైట్ పోలుకి ఉండే బ్యాటరీలు దొంగతనం చేశారు. గత మూడు నెలలుగా నర్సంపేట మండలంలోని చంద్రయ్యపల్లి, దాసరిపల్లి, బాంజీపేట, రాజేశ్వరరావు పల్లి, ఇటుకాలపల్లి, ఆకులతండా, భోజ్యానాయక్ తండా, మాధన్నపేట, నాగుర్లపల్లి, మహేశ్వరం గ్రామాల్లో దొంగతనం చేసినట్లు ఏసీపీ రవీంధర్ రెడ్డి తెలిపారు. నిందితుల నుంచి 38 బ్యాటరీలను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ 2లక్షల 25 వేలు ఉన్నట్లు ఏసీపీ తెలిపారు.

పీసీ నాగరాజుని అభినందించిన ఏసీపీ

నర్సంపేట నియోజకవర్గంలో వరుస దొంగతనాలు జరుపుతున్న నేపథ్యంలో ఎస్సై అరుణ్ ఆధ్వర్యంలో ఒక ప్రత్యేక టీం ఏర్పాటు చేశారు. బ్యాటరీ దొంగతనం మొదటగా చంద్రాయపల్లిలో చోటు చేసుకుంది. ఈ క్రమంలో గ్రామానికి చెందిన ఓ ఇంటి సీసీ కెమెరాల్లో అనుమానాస్పద వ్యక్తులను గమనించిన కానిస్టేబుల్ నాగరాజు ఆ వైపుగా విచారణ మొదలుపెట్టినట్లు ఏసీపీ తెలిపారు. చాకచక్యంగా వ్యవహరించిన కానిస్టేబుల్ ప్రత్యేకంగా శ్రద్ధ చూపిస్తూ నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ కనపరిచినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో సదురు కానిస్టేబుల్ నాగరాజుకి రివార్డును సైతం అందజేశారు.

42 శాతం రిజర్వేషన్లు 9వ షెడ్యూల్‌లో చేర్చాలి

18న నిర్వహించే బంద్‌కు మద్దతు - టీజేఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంబటి శ్రీనివాస్



నర్సంపేటలో మాట్లాడుతున్న అంబటి శ్రీనివాస్

నర్సంపేట, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో చేర్చాలని తెలంగాణ జన సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంబటి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. పట్టణంలోని ఆ పార్టీ కార్యాలయంలో బుధవారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అంబటి శ్రీనివాస్ మాట్లాడుతూ తెలంగాణలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ రాష్ట్ర అసెంబ్లీలో తీర్మానం చేసిన అనంతరం ఆ రిజర్వేషన్ల అమలుకు రాజ్యాంగ పరమైన అడ్డంకులు ఉన్నాయని, సుప్రీంకోర్టు ముందు రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో చేసిన తీర్మానం, జీవో 9 కోర్టుల ముందు చెల్లుబాటు కాదనే వాదనలు జరుగుతున్నాయని ఆయన పేర్కొన్నారు. కొన్ని రోజుల కిందట హైకోర్టు దానికి ఊతం కల్పిస్తూ తెలంగాణలో తీసుకువచ్చిన బీసీ రిజర్వేషన్ల జీవోకు స్టే ఇచ్చిందన్నారు. దేశ వ్యాప్తంగా రిజర్వేషన్లపై 50 శాతం సీలింగ్ ఉందన్న చర్చ జరుగుతుందని అన్నారు. ఈ నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం తీసుకు వచ్చిన బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల బిల్లును కేంద్ర ప్రభుద్వం పార్లమెంట్‌లో చట్టం చేసి 9వ షెడ్యూల్‌లో చేర్చాలని తెలంగాణ జన సమితి డిమాండ్ చేస్తుందని అంబటి శ్రీనివాస్ అన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల చర్చ కేవలం స్థానిక సంస్థల ఎన్నికల రిజర్వేషన్లకు పరిమితం చేయకుండా విద్యా, ఉద్యోగ అవకాశాలకు విస్తరిస్తూ చట్ట సభల్లో కూడా రిజర్వేషన్లు సాధించే దిశగా ఉండాలని ఆయన అన్నారు. బీసీ జేఏసీ ఆధ్వర్యంలో ఈ నెల 18న నిర్వహిస్తున్న తెలంగాణ రాష్ట్ర బంద్‌కు తెలంగాణ జన సమితి మద్దతు నిస్తుందన్నారు. ఈ బంద్‌కు ప్రజలు సహకరించాలని కోరారు. కార్య క్రమంలో టీజేఎస్ రాష్ట్ర నాయకులు గుంటి రాంచందర్, బొనగాని రవీందర్, షేక్ జావెద్, ఎలిశాల రాజేశ్, సాంబరాతి మల్లేశం, సోల్తి సాయికుమార్, రామగిరి మాధవి, కాసాని పద్మ, ఎం. రజిత, సంధాని, పండగ శ్రీనివాస్ పాల్గొన్నారు.

వైభవంగా క్రీడా పోటీలు నిర్వహిస్తాం..

అథ్లెటిక్స్ అసోసియేషన్ రాష్ట్ర చైర్మన్ వరద రాజేశ్వర్‌రావు



మాట్లాడుతున్న వరదరాజేశ్వర్‌రావు

వరంగల్ స్పోర్ట్స్, అక్టోబరు 15 (ఆంధ్ర జ్యోతి): జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం నుంచి ఈ నెల 18వరకు హనుమకొండ జేఎన్ఎస్‌లో నిర్వహించనున్న 5వ జాతీయస్థాయి అండర్-23మెన్ అండ్ ఉమెన్ అథ్లెటిక్స్ పోటీలను అంగరంగ వైభవంగా నిర్వహిస్తామని అథ్లెటిక్స్ అసోసియేషన్ రాష్ట్ర చైర్మన్ ఎర్రబెల్లి వరదరాజేశ్వర్‌రావు తెలిపారు. బుధవారం హనుమకొండ జేఎన్ఎస్‌లోని డీఎస్ఏ కార్యాలయంలో జాతీయ స్థాయి అథ్లెటిక్స్ క్రీడా పోటీల నిర్వహణపై ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వరదరాజేశ్వర్‌రావు పాల్గొని మాట్లాడారు. ఈ పోటీలను వరంగల్ ఎంపీ కడియం కావ్య ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభిస్తారని తెలిపారు. హనుమకొండలోని జేఎన్ఎస్, నిట్ కళాశాల మైదానాల్లో జాతీయస్థాయిలో నిర్వహిస్తున్న అథ్లెటిక్స్ పోటీల్లో దేశం నలుమూలల నుంచి 937మంది అథ్లెట్లు, 135మంది టెక్నికల్ అఫీషియల్స్, కోచ్‌లు పాల్గొననున్నారని తెలిపారు. అదే విధంగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ నుంచి 25మంది మెన్ అండ్ ఉమెన్ అథ్లెట్లు ప్రాతినిథ్యం వహిస్తారని ఆయన వెల్లడించారు. మూడు రోజుల పాటు జంప్స్, త్రోస్, రన్స్ (ట్రాక్ అండ్ ఫీల్డ్)లో పోటీలు కొనసాగుతాయన్నారు. అథ్లెటిక్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఏఎఫ్ఐ) నిబంధనల మేరకు క్రీడా పోటీలు నిర్వహిస్తామన్నారు. ఈ పోటీల ప్రారంభ కార్యక్రమానికి మేయర్ గుండు సుధారాణి, హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్, వరంగల్ పోలీస్ కమిషనర్, సన్‌ప్రీత్‌సింగ్, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చహత్‌బాజ్‌పాయ్‌లు పాల్గొంటారని వరదరాజేశ్వర్‌రావు తెలిపారు. ఈ సమావేశంలో అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి సారంగపాణి, హనుమకొండ డీవైఎస్‌వో గుగులోత్ అశోక్‌కుమార్, అసోసియేషన్ బాధ్యులు, సీనియర్ అథ్లెట్లు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే దొంతి తల్లికి సీఎం నివాళి

(7వ పేజీ తరువాయి)

ఆర్ట్స్ అండ్ సైన్స్ గ్రౌండ్‌లో దిగారు. అక్కడినుంచి రోడ్డు మార్గాన ఫంక్షన్ హాల్‌కు చేరుకున్నారు. వేదికపై 4 నిమిషాలు గడిపారు. అనంతరం భోజనానికి వెళ్లారు. మధ్యాహ్నం 2.27 గంటలకు హైదరాబాద్‌కు తిరిగి వెళ్లారు. ముఖ్యమంత్రి వెంట ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డి, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సీతక్క, వివేక్ వెంకటస్వామి, పొన్నం ప్రభాకర్, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి, అడ్లూరి లక్ష్మన్, ఎంపీలు కడియం కావ్య, బలరాం నాయక్, ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, నాయిని రాజేందర్‌రెడ్డి, కేఆర్ నాగరాజు, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, మురళీనాయక్, రాంచంద్రునాయక్, యశశ్వినిరెడ్డి, గండ్ర సత్యనారాయణరావు, ఎమ్మెల్సీలు బస్వరాజు సారయ్య, శ్రీపాల్‌రెడ్డి, మేయర్ గుండు సుధారాణి, మాజీ మేయర్ ఎర్రబెల్లి స్వర్ణ, కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ చైర్మన్ ఇనుగాల వెంకట్రాం రెడ్డి, మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఎర్రబెల్లి వరద రాజేశ్వర్ రావు, బొద్దిరెడ్డి ప్రభాకర్‌రెడ్డితో పాటు పలువురు ఇతర ప్రజాప్రతినిధులు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, తదితరులు పాల్గొన్నారు. నర్సంపేట నియోజకవర్గం నుంచి దొంతి అనుచరులు, అభిమానులు, ప్రజలు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.



అభివాదం చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, చిత్రంలో ఎంపీ కడియం కావ్య తదితరులు

భారీ బందో బస్తు

సీఎం రాక సందర్భంగా భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఫక్షన్ హాల్‌లోనూ, బయట అడుగడుగునా పోలీసులు మోహరించారు. విస్తృతంగా తనఖీలు నిర్వహించారు. సీఎం రావడానికి అరగంట ముందే ఫంక్షన్ హాల్‌లోని వేదికను స్వాధీనం చేసుకున్నారు. సీఎం వచ్చి వెళ్లే వరకు ముఖ్యులను మాత్రమే వేదికపైకి అనుమతించారు. నాయకులు తరలివచ్చిన వాహనాలతో రోడ్డంతా నిండిపోయింది. సీఎంను చూసేందుకు చుట్టుపక్కల ప్రజలు భవనాలపై ఎక్కారు. డివైడర్లపై బారులు తీరి నిల్చున్నారు. సీఎం హాల్‌లోకి రాగానే కార్యకర్తలు ఈలలు వేస్తూ కేరింతలు కొట్టారు.

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఘన స్వాగతం

హనుమకొండ, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డికి హెలిప్యాడ్ వద్ద ఎమ్మెల్యేలు, అధికారులు, కాం గ్రెస్ నేతలు ఘన స్వాగతం పలికారు. హనుమకొండ కేయూ 100 ఫీట్ల రోడ్డులోని పీజీఆర్ గార్డెన్‌లో ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి మాతృమూర్తి దశదినం సందర్భంగా ఏర్పాటు చేసిన మాతృ వందనం కార్యక్రమంలో పాల్గొనేందుకు నగరానికి వచ్చిన సీఎంకు హనుమకొండ సుబేదారిలోని ఆర్ట్స్ కాలేజీ గ్రౌండ్‌లో ఘన స్వాగతం లభించింది. సీఎంతో పాటు మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, అడ్లూరి లక్ష్మన్‌కుమార్, ముఖ్యమంత్రి సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డి హైదరాబాద్ నుంచి హెలిక్యాప్టర్ ద్వారా ఆర్ట్స్ అండ్ కాలేజీ గ్రౌండ్ కు చేరుకున్నారు. హెలిప్యాడ్ వద్ద సీఎంకు మంత్రి సీతక్క, ఎంపీలు పోరిక బలరాంనాయక్, కడియం కావ్య, ఎమ్మెల్సీ బస్వరాజు సార య్య, ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, నాయిని రాజేందర్ రెడ్డి, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, యశస్వినిరెడ్డి, కేఆర్ నాగరాజు, గండ్ర సత్యనారాయణరావు, హనుమకొండ, వరంగల్ కలెక్టర్లు స్నేహ శబరీష్, డాక్టర్ సత్యశారద, వరంగల్ పోలీసు కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్, టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి, మేయర్ సుధారాణి, గ్రేటర్ మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్, అదనపు కలెక్టర్ సంధ్యారాణి, పలువురు కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధులు పుష్పగుచ్ఛాలు అందిం చి స్వాగతం పలికారు. శాలువాలతో సత్కరించారు. ఎమ్మెల్యే మాధవరెడ్డిని పరామర్శించిన అనంతరం హెలిప్యాడ్ వద్ద సీఎం కు మంత్రులు, ప్రజాప్రతినిధులు, అధికారులు వీడ్కోలు పలికారు.



సీఎంకు బొకే ఇస్తున్న సీపీ సన్‌ప్రీత్‌సింగ్, పూలమొక్కలు ఇచ్చి స్వాగతం పలుకుతున్న కలెక్టర్లు స్నేహ శబరీష్, సత్య శారద

సీఎంను దగ్గర నుంచి చూడాలని ఆరాటం

- పక్కకు తోసేసిన పోలీసులు
- నెరవేరని పారిశుధ్య కార్మికుల కోరిక



పారిశుధ్య కార్మికులను అడ్డుకుంటున్న ఓ పోలీస్ అధికారి

హనుమకొండ, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): వారంతా మున్సిపల్ మహిళా పారిశుధ్య కార్మికులు. హనుమకొండలోని కేయూ 100 ఫీట్ల రోడ్డులోని పీజీఆర్ గార్డెన్‌లో ఏర్పాటు చేసిన ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి మాతృమూర్తి కాంతమ్మ మాతృవందనం కార్యక్రమానికి సీఎం రేవంత్ రెడ్డి వస్తుండడంతో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు ఉదయం నుంచే అక్కడ గ్యాంగ్ వర్క్ చేపట్టారు. మహిళా పారిశుధ్య కార్మికులు ఆ ప్రాంతమంతా ఊడ్చి శుభ్రం చేశారు. ఎక్కడా చెత్త కనిపించకుండా అద్దంలా మార్చారు. సీఎం రావడానికి కొద్దిసేపటి వరకు కార్మికులు పారిశుధ్య పనులు చేస్తూనే ఉన్నారు. ఇంతలో సీఎం వస్తుండంతో ఆయనను దగ్గర నుంచి చూడాలన్న ఉత్సుకతో ఈ మహిళా కార్మికులంతా చేతుల్లో చీపుర్లతోనే రోడ్డు పక్కన నిలబడి వేచి చూస్తున్నారు. సీఎం కాన్వాయి ఫంక్షన్ హాల్‌కు చేరుకుంటున్నది. వారిలో ఉత్సాహం మరింత పెరిగింది. ఉత్సాహంగా ముందుకు వస్తున్న వీరిని పోలీసు అడ్డుకున్నారు. దూరంగా పంపించారు. అంతలోనే సీఎం కారు ఫంక్షన్ హాల్‌లోకి రయ్‌మంటూ వెళ్లిపోయింది. దీనితో వారి కోరిక నెరవేరలేదు. నిరాశతో వెనుదిరిగారు.

స్కావెంజర్‌పై ప్రిన్సిపాల్ వేధింపులు

- ఒకే వేతనంతో ఇద్దరు పని చేయాలని ఆదేశం
- లేదంటే పని మానుకోవాలని హెచ్చరిక
- కార్పొరేటర్‌ను ఆశ్రయించిన బాధితురాలు

హసన్‌పర్తి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంబాల క్రాస్ రోడ్డులోని ప్రభుత్వ బాలికల గురుకుల జూనియర్ కళాశాలలో పని చేస్తున్న తనపై కళాశాల ప్రిన్సిపాల్ వేధింపులకు పాల్పడుతున్నట్లు స్కావెంజర్ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్కావెంజర్‌గా ఎంపికై నెల రోజులు కావస్తున్నా తనకు వేతనం ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని అన్నారు. తనతోపాటు మరొకరిని పనిలోకి తీసుకుంటేనే రావాలని హుకుం జారీ చేసినట్లు బాధితురాలు ఆరోపిస్తోంది. ఈ విషయం స్థానిక కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్‌ను కలిసి మొరపెట్టుకున్నప్పటికీ ఫలితం లేకుండా పోయిందని బాధితురాలు ఆవేదన వ్యక్తం చేస్తోంది. ఇప్పటికైనా సంబంధిత శాఖ ఉన్నతాధికారులు స్పందించి తనకు ఉద్యోగ భద్రత కల్పించాలని వేడుకుంటోంది.



ఎమ్మెల్యే కడియం శ్రీహరికి వినతిపత్రం అందజేస్తున్న రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నాయకులు

రిటైర్డ్ ఉద్యోగుల ఆత్మగౌరవాన్ని కాపాడాలి

వరంగల్ ఎడ్యుకేషన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): రిటైర్డ్ ఉద్యోగులకు రావాల్సిన ప్రయోజనాలను వెంటనే అందించి ప్రభుత్వం వారి ఆత్మగౌరవాన్ని కాపాడాలని రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఎస్.ధర్మేంద్ర, కె.భోగేశ్వర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, ఎంపీలను బుధవారం కలిసి వినతి పత్రాలు అందజేశారు. ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, కేఆర్. నాగరాజు, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, నాయిని రాజేందర్ రెడ్డి, ఎమ్మెల్సీ పింగిళి శ్రీపాల్‌రెడ్డి, ఎంపీ కడియం కావ్యను కలిసి వారి సమస్యలను వారికి వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఉద్యోగ విరమణ పొంది సంవత్సర కాలం గడుస్తున్న విరమణ ప్రయోజనాలు ఏ ఒక్కటి అందలేదని వాపోయారు. ప్రజాప్రతినిధులు తమ సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు దేవదాసు, గఫార్, దామోదర్, చలం, అశోక్‌కుమార్, శ్యాంరావు, సారయ్య, రాజేందర్, వెంకటేశ్వర్లు తదతరులు పాల్గొన్నారు.

బీసీ రాష్ట్ర బంద్‌ను జయప్రదం చేయాలి

పూలే ఆశయ సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు మల్లేశ్వర్

వరంగల్ ఎడ్యుకేషన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): బీసీ రిజర్వేషన్ల అమలు డిమాండ్ చేస్తూ ఈ నెల 18న బీసీ జేఏసీ తలపెట్టిన రాష్ట్ర బంద్‌ను జయప్రదం చేయాలని పూలే ఆశయ సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు సంగని మల్లేశ్వర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర బంద్‌లో అన్ని బీసీ, కులసంఘాలు పాల్గొని ఐక్యత చాటినప్పుడే రిజర్వేషన్ వ్యతిరేకుల్లో వణుకుపుట్టి రిజర్వేషన్ అమలవుతుందని ఆయన పేర్కొన్నారు. బీసీ రాష్ట్ర బంద్‌కు సంబంధించిన వాల్ పోస్టర్‌ను గురువారం హనుమకొండలోని హరిత కాకతీయలో ఆవిష్కరిస్తున్నట్లు బీసీ జేఏసీ ఉమ్మడి వరంగల్ జిల్లా చైర్మన్ వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

సీఎంకు ఐఎన్‌టీయూసీ నాయకుల విజ్ఞప్తి

వరంగల్ మెడికల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని కోరుతూ సీఎం రేవంత్‌రెడ్డికి ఐఎన్‌టీయూసి 3194 రాష్ట్ర ఉపాధ్యక్షుడు, చైర్మన్ బత్తిని సుదర్శన్ గౌడ్ విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హనుమకొండకు వచ్చిన సందర్భంగా ఆర్ట్స్ కాలేజీ గ్రౌండులో కలిశారు. ఉద్యోగులకు పీఆర్‌సీ విడుదల చేయాలని, అన్ని సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్‌లో నగదు రహిత సేవలు అందించాలని, పెన్షనర్స్‌కు రావాల్సిన అన్ని రకాల బిల్లులను వెంటనే పాస్ చేయాలని కోరారు.

సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలి

సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు జి.ప్రభాకర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రభాకర్‌రెడ్డి

హనుమకొండ చౌరస్తా, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): హమాలీ కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు జి.ప్రభాకర్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం హనుమకొండ రాంనగర్‌లోని సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఆల్ హమాలీ వర్కర్స్ యూనియన్ సీఐటీయూ జిల్లా కమిటి సమావేశంలో ప్రభాకర్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. జిల్లాలో వివిధ రంగాల్లో పని చేస్తున్న హమాలీ కార్మికులు రోజుకు 10నుంచి 12గంటలు ప్రభుత్వానికి, ప్రజలకు అనేకరకాలుగా పని చేస్తున్నారన్నారు. ప్రభుత్వం హమాలీలకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని ప్రభాకర్‌రెడ్డి కోరారు. ఈ సమావేశంలో హనుమకొండ జిల్లా ఆల్ హమాలీ వర్కర్స్ యూనియన్ సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొట్ల చక్రపాణి, జిల్లా నాయకులు సంఘాల మొగిలి, దాసరి రవీందర్, పాక కుమారస్వామి, మాట్ల ప్రభాకర్, రమేష్, సుదర్శన్, విజేందర్, రవి, రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఏడీఆర్ఎంకు సన్మానం



ఏడీఆర్ఎంకు బొకే ఇస్తున్న రైల్వే కాంట్రాక్టర్లు

కాజీపేట, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ఇటీవల బాధ్యతలు స్వీకరించిన అడిషనల్ డివిజనల్ రైల్వే మేనేజర్ సంజీవరావును బుధవారం తెలంగాణ రైల్వే కాంట్రాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులు గుంటి కుమార్ బృందం కలిశారు. పూలబొకే ఇచ్చి సన్మానించారు. అనంతరం రైల్వే కాంట్రాక్టర్‌ల సమస్యలపై వివరించారు. ఏడీఆర్ఎంను కలసిన వారిలో అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు మోహన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి జయపాల్ రెడ్డి, ట్రెజరర్ సిరాజ్‌లు ఉన్నారు.

పశు పోషణకు ప్రభుత్వం పెద్దపీట

వరంగల్ ఎంపీ కడియం కావ్య

వడ్డెపల్లి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): పశు పోషణకు రాష్ట్ర ప్రభుత్వం పెద్ద పీట వేస్తోందని, రాయితీ పథకాలను రైతులు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం హనుమకొండ 60వ డివిజన్ వడ్డెపల్లిలోని ప్రాథమిక పశు వైద్య కేంద్రంలో పశువైద్యాధికారి డాక్టర్ ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని ఎంపీ కడియం కావ్యతోపాటు, ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి ప్రారంభించి మాట్లాడారు. దేశమంతటా 2019 నుంచి ఈ వైరస్‌ను నిర్మూలించడం కోసం ప్రతీ రాష్ట్రంలో టీకాలను ఆరు నెలలకోసారి ప్రతీ పశువుకు వేయడం ద్వారా గాలికుంటు వ్యాధి పూర్తిగా నిర్మూలించవచ్చని అన్నారు. పశువులన్నింటికీ గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు వేయించుకొని విలువైన పశువులను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా పశు వైద్యాధికారి డాక్టర్ రాధాకిషన్, వడ్డెపల్లి పశువైద్యాధికారి డాక్టర్ ప్రవీణ్ కుమార్, డాక్టర్ వినయ్, డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ నాగమణి, డాక్టర్ కరుణాకర్‌రెడ్డి, యాకలక్ష్మీ, రాకేశ్, వంశీ, మాజీ కార్పొరేటర్ నాగరాజు, 60వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎ.పున్నంచందర్, మహిళా అధ్యక్షురాలు శ్వేతాగౌడ్, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు జనగాం శ్రీనివాస్‌గౌడ్, బుస్స నవీన్, మండల సమ్మయ్య, ఎండి. సాజిద్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

పశువులను సంరక్షించాలి

హసన్‌పర్తి (ఆంధ్రజ్యోతి): పశు సంపదతోనే రైతుకు ప్రత్యామ్నాయ ఆదరువని వాటి సంరక్షణ రైతులందరి బాధ్యతని స్థానిక కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్ అన్నారు. గ్రేటర్ 66వ డివిజన్ కేంద్రంలోని పశు వైద్యశాలలో వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ మాళవిక ఆధ్వర్యంలో చేపట్టిన జాతీయ పశు వ్యాధుల నివారణ కార్యక్రమంలో 7వ విడత ఉచిత గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమం బుధవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్ ముఖ్య అతిథిగా హాజరై టీకా శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. ప్రతీ రైతు వ్యవసాయాన్నే నమ్ముకొని పని చేయకుండా ప్రత్యామ్నాయ పశు పోషణకు ప్రాధాన్యతనిచ్చి ఆర్థికంగా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా పశువైద్యాధికారి డాక్టర్ మాలవిక మాట్లాడుతూ.. రైతులు పశువులకు సంక్రమించే వ్యాధులు, వాటి నివారణ చర్యలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. పశు సంవర్ధక శాఖ సూచించే పలు జాగ్రత్తలు పాటించి వ్యాధుల నివారణకు రైతులు సహకరించి సకాలంలో టీకాలు వేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రైల్వే బోర్డు మెంబర్ తాళ్ల శ్యామ్, వీఎల్‌వో బి.సురేష్, ఎల్ఎస్ఏ ఎం.డి.నబీ, జీఎస్ రాహుల్, జేవీవో శారద, ఓఎస్ ఎండీ.సాధిక్‌తో పాటు రైతులు పాల్గొన్నారు.



గాలికుంటు వ్యాధి టీకా శిబిరాన్ని ప్రారంభిస్తున్న కార్పొరేటర్ శివకుమార్



వడ్డెపల్లిలో వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ కావ్య, ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

జాతీయ నృత్యోత్సవాల్లో ఓరుగల్లు ప్రతిభ

జాతీయ స్థాయి అవార్డును కైవసం చేసుకున్న అనిశ్రీతరెడ్డి



టెంపుల్ డాన్స్‌లో అందుకున్న బహుమతులతో ఓరుగల్లు కళాకారులు

హనుమకొండ కల్చరల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌గఢ్ రాజధాని రాయపూర్‌లో అక్టోబరు 2 నుంచి 12వ తేదీ వరకు వైభవంగా సెంట్రల్ మినిస్ట్రీ ఆఫ్ కల్చర్, ఆల్ ఇండియా డాన్సర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ నృత్య పోటీల్లో ఓరుగల్లు కళాకారులు అద్భుత ప్రతిభతో హౌరా అనిపించుకొని బహుమతులను కైవసం చేసుకున్నారు. నృత్యం, అభినయం, క్రియేటివిటీ, డాన్స్ సిలబస్‌పై పట్టు ఉన్న 28 మంది కళాకారులను ప్రత్యేకంగా న్యాయ నిర్ణేతలు ఎంపిక చేసి బెస్ట్ ఔట్ స్టాండింగ్ ఉన్న కళాకారులకు అందజేసే ప్రతిష్ఠాత్మక నట్వార్ గోపికృష్ణ జాతీయ అవార్డును హనుమకొండకు చెందిన టెంపుల్ డాన్స్ కళాకారిణి కుందూరు అనిశ్రీతరెడ్డి కైవసం చేసుకోవడం విశేషం. పది రోజుల పాటు జరిగిన ఈ పోటీల్లో దేశం నలుమూలల నుంచి దాదాపు వేయి మందికిపైగా కళాకారులు వివిధ నృత్య పోటీల్లో పాల్గొన్నారు. ఇందులో భాగంగా హనుమకొండలోని టెంపుల్ డాన్స్ నాట్యాచారిణి కాట్రగడ్డ హిమాన్సీ ఆధ్వర్యంలో పాల్గొన్న కళాకారులలో అనిశ్రితరెడ్డితోపాటు యూత్ కేటగిరిలో సాయి సంజనారెడ్డి ఔట్ స్టాండింగ్ పెర్మార్మర్‌గా నిలిచి నవోదిత్ కళాకార్ అవార్డు అందుకున్నట్లు కాట్రగడ్డ హిమాన్సీ చెప్పారు.

అదే విధంగా సీనియర్స్ విభాగంలో సంజనారెడ్డి సోమిరెడ్డి ద్వితీయ బహుమతి అందుకుంది. అనన్యరెడ్డి, సాయి సంజనారెడ్డి, హన్విక, లక్ష్మీ ప్రహర్షితలు సీనియర్ గ్రూప్ విభాగంలో ప్రథమ బహుమతి, జూనియర్స్ విభాగంలో డి.హన్విక, లక్ష్మీ ప్రహర్షితలు డ్యూయెట్‌లో ప్రథమ బహుమతి, సబ్ జూనియర్స్ కేటగిరిలో జె.ఆరాధ్య ఉత్తమ ప్రతిభ కనబర్చి ఔట్ స్టాండింగ్ పెర్ఫార్మ్ బహుమతిని కైవసం చేసుకుంది. సబ్ జూనియర్ కేటగిరిలో వరుణిక ఆల్ రౌండర్ ప్రథమ విజేతగా నిలిచి నృత్య కళాశ్రేష్ఠ అవార్డు అందుకున్నట్లు టెంపుల్ డాన్స్ సీఈవో కాట్రగడ్డ హిమాన్సి వెల్లడించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

ఖానాపురం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అశోక్‌నగర్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నర్సంపేట మండలం ఇటుకాలపల్లి జీపీ పరిధిలోని నర్సింగాపురం గ్రామానికి చెందిన పల్లకొండ రాజేందర్ (43) ఖానాపురం మండలంలోని అశోక్‌నగర్‌కు తమ బంధువుల ఇంటికి మంగళవారం రాత్రి బైక్‌పై వెళ్తుండగా అశోక్‌నగర్ సైనిక్ స్కూల్ దాటాక ప్రమాదవశాత్తు రోడ్డు పక్కనే ఉన్న గుంతలో పడిపోయాడు. గమనించిన స్థానికులు చికిత్స నిమిత్తం 108 వాహనంలో నర్సంపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. కాగా, చికిత్స పొందుతూ మృతి చెందారు. మృతుడికి భార్య సునీత, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య

చిలుపూర్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రేమ విఫలం కావడంతో మనస్తాపం చెందిన ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై సిరిపురం నవీన్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం... వరంగల్ జిల్లా గీసుగొండ మండలంలోని బొడ్డు చింతలపల్లి గ్రామానికి చెందిన కేదాసి బాబు-సంతోష దంపతుల కుమారుడు ప్రశాంత్(30) పీజీ వరకు చదువుకున్నాడు. హనుమకొండలోని ఓ వస్త్ర దుకాణంలో పని చేస్తుండగా జనగామ జిల్లాలోని ఓ గ్రామానికి చెందిన యువతితో పరిచయమైంది. అది కాస్తా ప్రేమగా మారింది. కాగా, వీరి పెళ్లికి యువతి తల్లిదండ్రులు అడ్డు చెప్పడంతో మనస్తాపం చెంది బుధవారం జనగామ జిల్లా చిలుపూర్ మండలం నష్కల్ గ్రామ సమీపంలో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. తల్లి సంతోష ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

డెంగీతో బాలుడు మృతి

పర్వతగిరి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): డెంగీ వ్యాధితో బాలుడు మృతి చెందిన సంఘటన మండలంలోని అన్నారం షరీఫ్ గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. స్థాని కుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన భాషబోయిన ఏకాంబ్రం చిన్న కుమారుడు ప్రవేశ్(9) స్థానిక ప్రభు త్వ పాఠశాలలో మూడో తరగతి చదువుతున్నాడు. వారం రోజుల కిందట జ్వరం రావడంతో తొర్రూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స చేయించారు. తగ్గక పోవడంతో వరంగల్ ఎంజీ ఎం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందా డు. కుమారుడి మృతితో తల్లిదండ్రులు శోక సంద్రంలో మునిగి పోయారు.

పేకాట శిబిరంపై పోలీసుల దాడి

కార్పొరేటర్ భర్తతో పాటు పది మంది అరెస్టు

హనుమకొండ టౌన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): సుబేదారి పోలీస్‌స్టేషన్ పరిధిలోని కనకదుర్గ కాలనీలో ఓ కార్పొరేటర్ ఇంట్లో ఆదివారం రాత్రి పేకాట ఆడుతుండగా సుబేదారి పోలీసులు పట్టుకున్నారు. ఈ దాడిలో కార్పొరేటర్ భర్తతోపాటు పది మందిని అదుపులోకి తీసుకున్నట్లు సుబేదారి సీఐ ఎం.రంజిత్‌కుమార్ తెలిపారు. వారి వద్ద నుంచి రూ. 60 వేల నగదు, 9 మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకుని, అరెస్టైన వారిని పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

గట్టయ్య యాదవ్‌కు డాక్టరేట్



హసన్‌పర్తి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ఎర్రగట్టుగుట్ట క్రాస్‌రోడ్డుకు చెందిన బి.గట్టయ్యకు ఉస్మానియా యూనివర్సిటీ కామర్స్ విభాగం డాక్టరేట్ ప్రదానం చేసింది. ఉస్మానియా యూనివర్సిటీ సీనియర్ ప్రొఫెసర్ డి.చెన్నప్ప పర్యవేక్షణలో 'ఈ నేషనల్ అగ్రికల్చర్ మార్కెట్ ఇన్ తెలంగాణ ఏ స్టడీ ఆఫ్ సెలక్ట్ డిస్ట్రిక్ట్ ఇన్ తెలంగాణ స్టేట్' అనే అంశంపై పరిశోధన పూర్తి చేసి పరిశోధన గ్రంథాన్ని పరిశీలించినందుకు ఉస్మానియా యూనివర్సిటీ పరీక్షల విభాగం ఆయనకు పట్టాను ప్రదానం చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా గట్టయ్యను కళాశాల యాజమాన్యం, విద్యాసంస్థల ప్రతినిధులు అభినందించారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో 33 మందికి జరిమానా

మట్టెవాడ, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనం నడిపిన కేసులో న్యాయమూర్తి 33 మందికి జరిమానా, నలుగురికి జైలుశిక్ష విధించారు. వరంగల్ ఎల్‌బీ నగర్‌కు చెందిన మహ్మద్ రఫీ, మండిబజార్‌కు చెందిన సయ్యద్ అబ్బాస్, పసరగొండకు చెందిన గజ్జి మధుకర్, రాజస్థాన్‌కు చెందిన చోగారాంలకు రెండు రోజులు జైలు శిక్ష విధించడంతో పాటు 33 మందికి రూ.29,900 జరిమానా విధిస్తూ వరంగల్ సెకండ్‌క్లాస్ మెజిస్ట్రేట్ కె.లక్ష్మీనారాయణ బుధవారం తీర్పు చెప్పారు. అదేవిధంగా లైసెన్స్ లేకుండా వాహనం నడిపిన ముగ్గురికి రూ. 1500 జరిమానా విధించినట్లు వరంగల్ ట్రాఫిక్ సీఐ కె. సుజాత తెలిపారు.

పద్మశాలి భవన నిర్మాణ కోఆర్డినేషన్ కమిటీ ఎన్నిక

హనువకొండ కలెక్టరేట్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): హనుమకొండలోని భీమారంలో పద్మశాలి సంఘ భవన నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన స్థలంలో పద్మశాలి సంఘ భవన నిర్మాణం ఏర్పాటు చేయడానికి కోఆర్డినేషన్ కమిటీని ఎన్నుకున్నట్లు జిల్లా పద్మశాలి సంఘం ప్రధాన కార్యదర్శి ప్రొఫెసర్ గడ్డం భాస్కర్ తెలిపారు. భవన నిర్మాణంతో పాటు ఇతర అభివృద్ధి కార్యక్రమాల నిర్వహణ కోసం పద్మశాలి కుల బాంధవులతో అడ్వయిజరీ కమిటీలతో పాటు ఆర్గనైజేషన్ కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. త్వరలోనే యూత్, మహిళ, మిగతా కమిటీలను కూడా ప్రకటిస్తామని భాస్కర్ ప్రకటనలో తెలిపారు. అడ్వయిజరీ కమిటీలో 40 మంది సభ్యులు, ఆర్గనైజేషన్ కమిటీలో 76 మందిని నియమించినట్లు ఆయన తెలిపారు.

హక్కుల కోసం కార్మికులు పోరాడాలి

సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాగుల రమేశ్



సమావేశంలో మాట్లాడుతున్న రాగుల రమేశ్

కేయూ క్యాంపస్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): కార్మికుల హక్కుల సాధన కోసం పోరాడాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాగుల రమేశ్ అన్నారు. బుధవారం కేయూ ఫార్మసీ కళాశాలలో సీఐటీయూ రెండో మహాసభ జరిగింది. ఈ సందర్భంగా రమేశ్ హాజరై మాట్లాడారు. బీజేపీ విధానాలతో కార్మికులు నష్టపోతున్నారని అన్నారు. ఆల్ వర్సిటీస్ జాతీయ ఉపాధ్యక్షుడు డాక్టర్ పుల్లా శ్రీనివాస్ మాట్లాడుతూ.. సమస్యల పరిష్కారానికి పోరాటాలే మార్గమన్నారు.

వర్సిటీల అభివృద్ధికి బడ్జెట్‌ను పెంచలన్నారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షుడిగా ఆకుతోట రాంచందర్, ఈ.శోభన్‌కుమార్‌లు వ్యవహరించగా మెట్టు రవి, కచ్చకాయల చిరంజీవి, దేశిని రవికుమార్, రాజేందర్, దామెర రణధీర్, పల్లం రాజు, శోభ, మేకల శ్రీనివాస్, లక్ష్మి, ఈ.సందీప్, ఎం.శ్రీనివాస్, జి.రవీందర్, డి.కృష్ణ, డి.కిషన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

రాంనగర్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా గురువారం నగరంలోని పలు సబ్‌స్టేషన్‌ల పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. న్యూశాయంపేట సబ్‌స్టేషన్ పరిధిలోని టెంపుల్ ట్రీ విల్లాస్ ఏరియాలో ఉదయం 10 గంటల నుంచి 11 గంటల వరకు, నక్కలగుట్ట సబ్‌స్టేషన్ పరిధిలోని భవానినగర్, గోకుల్‌నగర్, తిరుమలబార్ జంక్షన్, హౌజింగ్ బోర్డు, కేఎల్ఎన్ రెడ్డి కాలనీ, సుమంగళి ఫంక్షన్‌హాల్ ఏరియాలో ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు, గోపాల్‌పూర్ సబ్‌స్టేషన్ పరిధిలోని కల్లుమండువా, జవహర్‌నగర్, విష్ణుపురి కాలనీ, మారుతికాలనీ, సదాశివకాలనీ, ద్వారకసాయి కాలనీ ఏరియాల్లో ఉదయం 10 గంటల 12 గంటల వరకు విద్యుత్ సరఫరా జరగదని డీఈ తెలిపారు.

బీసీ జేఏసీ ఉమ్మడి జిల్లా కమిటీ ఎన్నిక

రాంనగర్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి వరంగల్ జిల్లా బీసీ జేఏసీ జిల్లా కమిటీని నియమించినట్లు జేఏసీ చైర్మన్ వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్ ఒక ప్రకటన లో తెలిపారు. వర్కింగ్ చైర్మన్‌గా దొడ్డపల్లి రఘుపతి, వైస్ చైర్మన్‌లుగా దాడి మల్లయ్య, బొనగాని యాదగిరి, వైద్యం రాజగోపాల్, తుమ్మల శోభారాణి, కో-ఆర్డినేటర్లుగా తంగెళ్లపల్లి రమేశ్, గాజు యుగేంధర్ నియామకమైనట్లు పేర్కొన్నారు. కాగా, బీసీ రిజర్వేషన్‌ల సాధనలో భాగంగా ఈ నెల 18న బీసీ జేఏసీ ఇచ్చిన రాష్ట్ర వ్యాప్త బంద్‌కు వ్యాపా ర సంస్థలు, విద్యా సంస్థలు, వాణిజ్య సంస్థలు సహకరించి విజయవంతం చేయాలని కోరారు.

దళితులకు సంక్షేమ పథకాలు వర్తింపజేయాలి

- ఇంటి స్థలాలు కేటాయించాలి
- ఏఐడీఏసీ రాష్ట్ర అధ్యక్షుడు రత్నం శైలేందర్

వడ్డెపల్లి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): సామాజికంగా వెనుకబడిన దళితులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని ఆల్ ఇండియా దళిత యాక్షన్ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు రత్నం శైలేందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన అసైన్డ్ ల్యాండ్‌లను బీఆర్ఎస్ ప్రభుత్వం స్వాధీన పర్చుకుందని ఆరోపించారు. గతంలో ఇచ్చిన అసైన్డ్ ల్యాండ్‌లను ఎస్సీ, ఎస్టీలకు ఇచ్చి పట్టా పాస్ పుస్తకాలను జారీ చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కోరారు. దళితులందరికి ఇందిరమ్మ పథకం కింద ప్రభుత్వమే ఇంటి స్థలాలు కేటాయించి ఇళ్లను నిర్మించి ఇవ్వాలని రత్నం శైలేందర్ డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఆల్ ఇండియా దళిత యాక్షన్ కమిటీ రాష్ట్ర, జిల్లా నాయకులు కొయ్యడ భద్రయ్య, మేకల దేవేందర్, గడ్డం రమేశ్, సదానందం, కొల్లూరి రమేశ్, కవిరాజ్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న రత్నం శైలేందర్

సీపీఆర్‌పై అవగాహన కలిగి ఉండాలి

వరంగల్ మెడికల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): కార్డియో పల్మనరీ రిససిటేషన్ (సీపీఆర్)పై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని డాక్టర్ చిలక మురళి అన్నారు. కేంద్ర, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 13 నుంచి 17వ తేదీ వరకు సీపీఆర్ వారోత్సవాలను దేశ వ్యాప్తంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా కేఎంసీలోని సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లో సీపీఆర్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. హాస్పిటల్‌లో ఉన్న అన్ని తరగతుల ఉద్యోగులు, పేషెంట్ బంధువులు, ఆటోడ్రైవర్లకు సీపీఆర్‌లో శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ అనిల్ బాలరాజు, ఆర్ఎంవో డాక్టర్ ప్రతాప్, డాక్టర్ రోషన్, అనస్థీసియా అసిస్టెంట్ ప్రొఫెసర్ శ్రీనివాస్‌నాయక్, డాక్టర్ కరీష్మా తదితరులు పాల్గొన్నారు.



సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ మురళి

కేటీఆర్ తీరు హాస్యాస్పదం

ఓటరు జాబితాలో తప్పిదాలు బీఆర్ఎస్ హయాంలోవే.. : మంత్రి శ్రీధర్‌బాబు

హైదరాబాద్, కాటారం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : ఓట్ చోరీ అంశంలో పులిని చూసి నక్క వాతలు పెట్టుకున్న తీరుగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వ్యవహారం ఉందని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఓట్ చోరీ జరిగిన తీరును కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ సాక్ష్యాధారాలతో సహా ప్రజల ముందు పెట్టి ఉద్యమిస్తుంటే కేటీఆర్ మాత్రం బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన ఓటరు నమోదు కార్యక్రమంలో జరిగిన తప్పిదాలను కాంగ్రెస్ ప్రభుత్వంపై నెట్టే ప్రయత్నం చేస్తున్నారన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన తప్పిదాలకు బీఆర్ఎస్ పార్టీ బాధ్యత వహించాలే తప్ప కాంగ్రెస్ ప్రభుత్వం ఎలా బాధ్యత వహిస్తుందని ప్రశ్నించారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో మాదిరిగానే 2023 ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ కొన్ని సీట్లు ఓట్ చోరీకి పాల్పడే గెలిచినట్లు కేటీఆర్ చెప్పకనే చెప్పారన్నారు. మంత్రితో ముఖాముఖీ కార్యక్రమంలో భాగంగా గాంధీ భవన్‌లో బుధవారం ప్రజల నుంచి వివిధ సమస్యలపైన వినతిపత్రాలు స్వీకరించారు. అనంతరం మీడియాతో శ్రీధర్‌బాబు మాట్లాడుతూ పేద వర్గాలకు సంక్షేమ కార్యక్రమాలు ఒకటి తర్వాత ఒకటి అమలు చేస్తున్న నేపథ్యంలో జూబ్లీహిల్స్ ప్రజలకు సీఎం రేవంత్‌రెడ్డిపై నమ్మకం ఏర్పడిందన్నారు. ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి గెలిచి తీరుతాడన్న నమ్మకంతో ముందుకు వెళ్తున్నామన్నారు.ఇక మంత్రుల మధ్య ఎలాంటి విభేధాలూలేవని శ్రీధర్‌బాబు స్పష్టం చేశారు. కాగా, తెలంగాణ బ్రాహ్మణ పరిషత్తు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి అవసరమైన నిధులు కేటాయించాలని మంత్రి శ్రీధర్ బాబుకు బ్రాహ్మణ సంఘాలు విజ్ఞప్తి చేశాయి. ఈమేరకు మంత్రిని బుధవారం ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం ఇచ్చాయి.


మంత్రి శ్రీధర్ బాబును సదస్సుకు ఆహ్వానిస్తున్న హిల్లరీ మెక్‌గిచీ

మంత్రి శ్రీధర్ బాబుకు అరుదైన గౌరవం

మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుకు అరుదైన గౌరవం దక్కింది. లైఫ్ సైన్సెస్ రంగంలో 'ఆసియా-పసిఫిక్ ప్రాంతంలో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా పరిగణించే "ఆస్ బయోటెక్(అఉ ఆజ్వోచిజి) ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్-2025"లో కీలకోపన్యాసం చేసే అవకాశం లభించింది. ఆస్ట్రేలియా లైఫ్ సైన్సెస్ అత్యున్నత నిర్ణాయక సంస్థ ఆస్ బయోటెక్, విక్టోరియా రాష్ట్ర ప్రభుత్వ సంయుక్త నిర్వహణలో మెల్ బోర్న్‌లో ఈ నెల 21 నుంచి 24 వరకు జరగనున్న ఈ ప్రతిష్ఠాత్మక సదస్సులో ప్రసంగించే అవకాశం భారత్ నుంచి ఆయనకు మాత్రమే దక్కింది. రెండేళ్లలో తెలంగాణ లైఫ్ సైన్సెస్ రంగం సాధించిన పురోగతి, భవిష్యత్తు ప్రణాళికలు, అవకాశాలు, ఇక్కడ పెట్టుబడులు పెట్టేందుకు ఉన్న అనుకూలతలపై ఆయన ప్రసంగించనున్నారు. ఈమేరకు ఆస్ట్రేలియా కాన్సుల్ జనరల్ హిల్లరీ మెక్‌గిచీ బుధవారం మంత్రి శ్రీధర్ బాబును కలిసి ఆహ్వానించారు.

కొండా సురేఖ ఇంటి ముందు హైడ్రామా!

(మొదటి పేజీ తరువాయి)

సుమంత్ ఉన్నారన్న సమాచారంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు బుధవారం రాత్రి మఫ్టీలో అక్కడికి వెళ్లారు. ఈ సమయంలో మంత్రి కొండా సురేఖ నివాసం వద్ద హైడ్రామా చోటు చేసుకొంది. అక్కడికి వచ్చిన టాస్క్‌ఫోర్స్ పోలీసులతో కొండాసురేఖ కుమార్తె సుస్మిత వాగ్వాదానికి దిగారు. విషయం తెలుసుకున్న మంత్రి కొండా సురేఖ ఇంటి బయటికి వచ్చారు అదే సమయంలో జూబ్లీహిల్స్ పోలీసులు, మీడియా కూడా అక్కడికి చేరుకున్నారు. మంత్రి సురేఖ కారులో బయటికి వెళ్లిపోగా.. సుస్మిత మీడియాతో మాట్లాడారు. అయితే తన నియోజకవర్గం హుజూర్‌నగర్ పరిధిలో ఉన్న డెక్కన్ సిమెంట్స్ కంపెనీ ప్రతినిధులను సుమంత్ రివాల్వర్‌తో బెదిరించారని మంత్రి ఉత్తమ్ సీఎంకు ఫిర్యాదు చేశారని.. ఆ కారణంతోనే మాజీ ఓఎస్డీ అరెస్టుకు రంగం సిద్ధమైందనే ప్రచారం జరుగుతోంది. మరోవైపు టాస్క్‌ఫోర్స్ పోలీసులు వచ్చిన సమయంలోనే కొండా సురేఖ సుమంత్‌ను తన కారులో ఎక్కించుకుని వెళ్లిపోయారని సమాచారం. అయితే ఏకంగా మంత్రి నివాసానికి టాస్క్‌ఫోర్స్ పోలీసులు రాత్రి సమయంలో వెళ్లడం, ఆమె ఓఎస్డీగా పనిచేసి, ఉద్యోగం నుంచి తొలగింపునకు గురైన వ్యక్తిని అరెస్టు చేయడానికి ప్రయత్నించడం చర్చనీయాంశంగా మారింది.


జూబ్లీహిల్స్‌లోని కొండా సురేఖ నివాసం

రెడ్లు అంతా కలసి కుట్ర: సుస్మిత

సుమంత్‌ను అరెస్టు చేయడానికి వచ్చిన పోలీసులతో కొండా సురేఖ కుమార్తె వాగ్వాదానికి దిగారు. "మేం కాంగ్రెస్ ప్రభుత్వంలో ఉన్నామా? వేరే ప్రభుత్వంలో ఉన్నామా? సుమంత్ మా ఇంట్లో ఉన్నాడు.. అయితే తప్పేంటి? మేం రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి మద్దతుగా ఉన్నాం. ప్రభుత్వంలో ఉన్నవారిపై ఇలా వ్యవహరించడమేమిటి?" అని పోలీసులపై మండిపడ్డారు. అనంతరం అక్కడికి వచ్చిన మీడియాతో సుస్మిత మాట్లాడారు. తన తల్లి సురేఖను, తండ్రి కొండా మురళిని వేధించేందుకు ప్రభుత్వం కుట్ర పన్నుతోందని ఆరోపించారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి బంధువులకు చెందిన డెక్కన్ సిమెంట్స్ యాజమాన్యాన్ని సుమంత్ ఆయుధం చూపించి బెదిరించారంటూ పోలీసులు కేసు పెట్టారని.. తన తండ్రిని కూడా ఇరికించాలనే కుట్రతో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, వేం నరేందర్‌రెడ్డి, మరికొందరు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. "డెక్కన్ సిమెంట్స్ కంపెనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి సూచనల మేరకు డీసీసీ అధ్యక్షుడు రోహిన్‌రెడ్డి కొన్నిరోజుల క్రితం సుమంత్‌ను పిలిపించి మాట్లాడారు. అనంతరం వారిద్దరూ కలిసి డెక్కన్ సిమెంట్స్ కంపెనీకి వెళ్లారు. అక్కడ ఏం జరిగిందో తెలియదు. మరి సుమంత్‌పై కేసుపెట్టిన పోలీసులు రోహిన్‌రెడ్డిని ఎందుకు విస్మరించారు?" సుస్మిత ప్రశ్నించారు. బీసీ మంత్రి అయిన తన తల్లిని అణగదొక్కేందుకు పార్టీలోని రెడ్లు అంతా ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ఒకవైపు రాహుల్‌గాంధీ బీసీల కోసం పనిచేస్తామని చెబుతుంటే.. మరోవైపు రాష్ట్ర ప్రభుత్వం మాత్రం చర్యలతో బీసీలను తొక్కేస్తుందా? అని ప్రశ్నించారు. తన తండ్రికి ప్రాణభయం ఉందని పేర్కొన్నారు. వరంగల్ ఈస్ట్‌లో గతంలో వేం నరేందర్‌రెడ్డి పోటీచేసి ఓడిపోయారని గుర్తుచేశారు. ఇప్పుడు తమ కుటుంబాన్ని అణగదొక్కాలనే కుట్ర వెనుక వేం నరేందర్‌రెడ్డి, కడియం శ్రీహరితోపాటు సీఎం పాత్ర కూడా ఉందని ఆరోపించారు.

సీఎం పర్యటనకు దూరంగా సురేఖ

వరంగల్‌లో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటనకు మంత్రి కొండా సురేఖ దూరంగా ఉండటం గమనార్హం. నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి తల్లి దశదిన కర్మలో పాల్గొనేందుకు రేవంత్ వరంగల్‌కు వచ్చారు. సీఎం వెంట ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీతక్క, పొన్నం ప్రభాకర్, పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఉన్నారు. కానీ వరంగల్‌కు చెందిన సురేఖ ఆ పర్యటనకు దూరంగా ఉన్నారు. మేడారంలో రూ.71కోట్లతో సమ్మక్క సారక్క గద్దెల ఆధునీకరణకు పిలిచిన టెండర్లను తనకు తెలియకుండానే మంత్రి పొంగులేటి తన సొంత కంపెనీలకు ఇప్పించుకున్నారని.. అది కొండా దంపతులకు నచ్చలేదని ప్రచారం జరిగింది.

ట్రాఫిక్ మార్షల్ సమయస్ఫూర్తి

- బస్సు కింద పడబోయిన బైకర్‌ను రక్షించిన శివకుమార్

గాజులరామారం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ఓ ద్విచక్ర వాహనదారుడు అదుపుతప్పి రోడ్డుపై వెళుతున్న బస్సు కింద పడ్డాడు. కాసేపయితే అతడి శరీరం ఛిద్రమయ్యేదే. అయితే అక్కడే విధుల్లో ఉన్న ట్రాఫిక్ మార్షల్ అత్యంత చాకచక్యంగా వ్యవహరించాడు. వెనుక చక్రాలు అతడిపై నుంచి వెళతాయనగా.. బాధితుడిని బయటకు లాగాడు. జీడిమెట్ల పరిధిలోని సూరారం సిగ్నల్ వద్ద ఈ ఘటన జరిగింది. ఓ వ్యక్తి తన ద్విచక్రవాహనాన్ని ఎక్కబోతూ పట్టుతప్పి బాలానగర్ నుంచి మెదక్‌కు వెళుతున్న బస్సు చక్రాల కిందకు జారాడు. జీడిమెట్ల ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న నల్లగొండ జిల్లా, బోయగూడెం గ్రామానికి చెందిన కట్టెబోయిన శివకుమార్ యాదవ్ ట్రాఫిక్ మార్షల్‌గా సూరారం సిగ్నల్ వద్ద ఉదయం విధులు నిర్వహిస్తున్నాడు. ఒక్కసారిగా శబ్దం రావడంతో పరుగెత్తుకుంటూ వెళ్లి, టైర్ కింద పడబోయిన వ్యక్తిని చాకచక్యంగా లాగి అతడి ప్రాణాలను కాపాడాడు. సమయస్ఫూర్తితో వ్యవహరించి వాహనదారుడి ప్రాణం కాపాడిన శివకుమార్‌ను ఉన్నతాధికారులు అభినందించారు.

విమానం ల్యాండింగ్‌కు ముందు లేజర్ లైట్లు

- అంతర్గత విచారణకు ఆదేశించిన ఎయిర్‌లైన్స్

శంషాబాద్ రూరల్, అక్టోబర్ 15 (ఆంధ్రజ్యోతి): శంషాబాద్ విమానాశ్రయంలో ఆందోళనకరమైన సంఘటన వెలుగు చూసింది. తిరుపతి నుంచి వచ్చిన విమానం ల్యాండ్ అవుతున్న సమయంలో.. లేజర్ లైట్లు పడినట్లు ఏటీసీ అధికారులకు పైలెట్ సమాచారం ఇచ్చారు. మంగళవారం రాత్రి 9.30 సమయంలో ఈ ఘటన జరిగినట్లు సమాచారం. అప్రమత్తమైన పైలెట్ విమానాన్ని సురక్షితంగా ల్యాండింగ్ చేసి, ఏటీసీ అధికారులకు సమాచారం అందించారు. దీనిపై ఎయిర్‌లైన్స్ అధికారులు అంతర్గత విచారణకు ఆదేశించినట్లు తెలుస్తోంది.

సచివాలయ బదిలీకి ప్రత్యేక కోటా హర్షణీయం

- సీఎం, డిప్యూటీ సీఎంకు కృతజ్ఞతలు తెలిపిన టీజీవో అధ్యక్షుడు

హైదరాబాద్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : వివిధ ప్రభుత్వ విభాగాల్లో పనిచేసే సూపరింటెండెంట్ కేడర్ వారికి బదిలీ ద్వారా సచివాలయానికి వచ్చేందుకు ప్రత్యేక కోటా కల్పిస్తూ.. జీవో ఇవ్వడం హర్షణీయమని టీజీవో అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాస్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో సంబంధిత ప్రధాన ప్రభుత్వ శాఖ(హెచ్‌వోడీ) నుంచి సీనియర్ అసిస్టెంట్ కేడర్ వాళ్లకు మాత్రమే సచివాలయానికి బదిలీ అయ్యే అవకాశం ఉండేదని, ఇప్పుడు సూపరింటెండెంట్ కేడర్ వారికీ ప్రభుత్వం 12.5 శాతం కోటా కల్పించినట్లు ఆయన వెల్లడించారు. ఇందుకుగాను రాష్ట్ర ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కకు కృతజ్ఞతలు తెలిపారు.

పార్టీ నుంచి బహిష్కరణకు గురైన తర్వాత ఆరోపణలా?

- నారాయణ్‌పేట్-కొడంగల్ ప్రాజెక్టుపై బక్క జడ్సన్ పిల్‌ను కొట్టేసిన హైకోర్టు

హైదరాబాద్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): నారాయణ్‌పేట్-కొడంగల్ ఎత్తిపోతల పథకంలో అక్రమాలు, నిధుల దుర్వినియోగం జరిగిందంటూ సామాజిక కార్యకర్త బక్క జడ్సన్ దాఖలు చేసిన ప్రజాప్రయోజన వ్యాజ్యాన్ని పరిశీలన దశలోనే హైకోర్టు కొట్టేసింది. ఒకప్పుడు అదే పార్టీ(కాంగ్రెస్)లో సభ్యుడిగా ఉండి.. బహిష్కరణకు గురైన తర్వాత ఆరోపణలు చేస్తున్నారని చీఫ్ జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్, జస్టిస్ మొహియుద్దీన్ ధర్మాసనం తప్పుపట్టింది. ఈ పిటిషన్‌లో ప్రజాప్రయోజనం లేదని, దాఖలు చేయడం వెనుక దురుద్దేశం ఉన్నట్లు కనిపిస్తోందని పేర్కొంది. ఆరోపణలు చేయడానికి హైకోర్టు సరైన వేదిక కాదని పేర్కొంది.

గ్రూప్-1 పిటిషన్లపై విచారణ వచ్చే నెల 18కి వాయిదా

హైదరాబాద్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): గ్రూప్-1 పిటిషన్లపై విచారణను హైకోర్టు నవంబరు 18కి వాయిదా వేసింది. గ్రూప్-1 నియామక ప్రక్రియను పూర్తిచేయవచ్చని, ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేయవచ్చని.. నియామకాలు తుది తీర్పునకు లోబడి ఉంటాయని ఇటీవల చీఫ్ జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్, జస్టిస్ మొహియుద్దీన్‌ల ధర్మాసనం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ పిటిషన్లు బుధవారం మరోసారి హైకోర్టు డివిజన్ బెంచ్ ఎదుట విచారణకు వచ్చాయి. ఉద్యోగాలకు ఎంపికకాని అభ్యర్థులు(ప్రతివాదుల) తరఫు న్యాయవాదులు లిఖితపూర్వక వాదనల సమర్పణకు మరింత సమయం ఇవ్వాలని కోరడంతో విచారణ నవంబరు 18కి వాయిదా పడింది. మధ్యంతర ఉత్తర్వులు కొనసాగుతాయని హైకోర్టు పేర్కొంది.

నావీ రాడార్ ప్రాజెక్టు ఏర్పాటుపై విచారణ

హైదరాబాద్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి రంగారెడ్డి జిల్లా వికారాబాద్ దామగుండం అటవీ ప్రాంతంలో భారత నావికాదళం ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న ఈఎల్ఎఫ్ రాడార్ ప్రాజెక్టును వ్యతిరేకిస్తూ దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యంపై హైకోర్టు చీఫ్ జస్టిస్ నేతృత్వంలోని డివిజన్ బెంచ్ బుధవారం మరోసారి విచారణ చేపట్టింది. వాదనలు విన్న ధర్మాసనం.. మరో 3 వారాలు గడువు ఇస్తున్నామని, ఈలోగా కేంద్ర ప్రభుత్వం అడిషనల్ కౌంటర్, రాష్ట్ర ప్రభుత్వం కౌంటర్ దాఖలు చేయాలని పేర్కొంది.

'సదర్'పై పిటిషన్

సదర్ ఉత్సవం సందర్భంగా దున్నపోతులను హింసిస్తున్నారని, ఆ వేడుకలకు అనుమతి ఇవ్వరాదంటూ పిటిషన్ దాఖలైంది. దానిపై విచారణ చేపట్టిన హైకోర్టు.. ఉత్సవాలకు అనుమతి ఇచ్చే ముందు పిటిషనర్ విజ్ఞప్తిని పరిశీలించాలని డీజీపీ, హైదరాబాద్ సీపీకి ఆదేశాలు జారీ చేసింది.

ఐపీఎస్ అధికారి ఆత్మహత్యపై కేంద్రం మౌనం దురదృష్టకరం

- మంత్రి పొన్నం ప్రభాకర్



హుస్నాబాద్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): దళిత ఐపీఎస్ అధికారి పురాన్ కుమార్ ఉన్నతాధికారుల వేధింపుల కారణంగా ఆత్మహత్య చేసుకుని వారం రోజులు గడుస్తున్నా కేంద్ర ప్రభుత్వం స్పందించకపోవడం దురదృష్టకరమని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. దళితుల పట్ల కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానానికి ఇది స్పష్టమైన నిదర్శనమని మండిపడ్డారు. బుధవారం హుస్నాబాద్‌లో విలేకరులతో ఆయన మాట్లాడారు. పురాన్ తన ఆత్మహత్యకు కారణమైన ఎనిమిది మంది అధికారుల పేర్లను లేఖలో స్పష్టంగా రాసినప్పటికీ, కంటి తుడుపు చర్యగా డీజీపీని మాత్రమే తొలగించారని మంత్రి మండిపడ్డారు. అలాగే బీజేపీ, బీఆర్ఎస్‌లు ఎన్ని కుట్రలు చేసినా జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ గెలవడం ఖాయమని పొన్నం ప్రభాకర్ ధీమా వ్యక్తం చేశారు.

కేరళలో ఎంఎస్ పూర్తి చేసుకున్న గురుకుల విద్యార్థిని


డాక్టర్ అరుణ

తాండూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ మామిడిపూడి వెంకట రంగయ్య ఫౌండేషన్(ఎంవీఎఫ్) విద్యార్థిని అరుణ.. కేరళలోని త్రిస్సూర్ ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఎంఎస్ పూర్తి చేసుకుంది. దీంతో, వైద్య విద్య పూర్తి చేసిన మొదటి తెలంగాణ గురుకుల విద్యార్థిగా రికార్డులకెక్కింది. పదో తరగతి వరకు తాండూరు గురుకుల పాఠశాలలో చదువుకున్న అరుణ స్కూల్ టాపర్‌గా నిలిచింది. తల్లిదండ్రులు పూణెలో కూలి పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నండగా.. తన ప్రతిభతో హైదరాబాద్‌లో శ్రీ చైతన్యలో ఉచితంగా సీటు పొంది, ఎంసెట్‌లో ఉత్తమ ర్యాంకు సంపాదించింది. తర్వాత మొయినాబాద్‌లోని భాస్కర్ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ పూర్తి చేసుకుని ప్రస్తుతం పీజీ పట్టా అందుకున్న అరుణను పలువురు అభినందించారు.

కుమారుడు లేక బతకలేమని.. కుమార్తెతో కలిసి తల్లిదండ్రుల ఆత్మహత్య

- మంచిర్యాలలో విషాదం నింపిన ఘటన

మంచిర్యాల క్రైం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): మంచిర్యాల జిల్లాలో విషాద ఘటన జరిగింది. రెండు నెలల క్రితం బాలుడు జ్వరంతో బాధపడుతూ మృతిచెందడంతో ఆ దంపతులు డిప్రెషన్‌లోకి వెళ్లి.. తీవ్ర నిర్ణయం తీసుకున్నారు. కూతురితో గడ్డి మందుతాగించి.. వాళ్లూ తాగారు. ఈ ఘటనలో ముగ్గురూ మృతిచెందారు. మంచిర్యాల రాజీవ్ నగర్‌కు చెందిన బండి చక్రవరి(32), దివ్య(29) దంపతులకు కుమారుడు పవన్ కుమార్(10), కుమార్తె దీక్షిత(7) ఉన్నారు. చక్రవర్తి ఆటో తోలుతుంటాడు. పవన్ రెండు నెలల క్రితం జ్వరంతో మృతి చెందాడు. అప్పటి నుంచి కొడుకును గుర్తు చేసుకుంటూ దివ్య మనోవేదనకు గురై తరచూ భర్తకు ఫోన్ చేసి అతడిని ఇంటి వద్దనే ఉండాలని కోరేది. ఆటో నడిపితేనే ఇల్లు గడుస్తుందని చక్రవర్తి భార్యకు సర్దిచెప్పేవాడు. ఈనెల 5న పవన్ పుట్టినరోజు సందర్భంగా ఆ దంపతులు కేక్ కట్ చేసుకోవాలనుకున్నారు. అయితే కొడుకు లేకుండానే వేడుకలు ఎలా జరుపుకొనేది? అని తీవ్ర మనోవేదనకు గురయ్యారు. కూల్‌డ్రింక్‌లో గడ్డిమందు కలుపుకొని కూతురు దీక్షిత తో తాగించి.. తామూ తాగారు. ముగ్గురూ అపస్మారక స్థితికి చేరడంతో చక్రవర్తి బాబాయ్ బండి ఓంకార్ గమనించి వారిని వరంగల్ ఎంజీఎంకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఈ నెల 9న దీక్షిత(7) మృతి చెందింది. 11న దివ్య(29), బుధవారం చక్రవర్తి(32) మృతి చెందాడు.

డబుల్ డెక్కర్ వంతెనలు లేనట్టే!

ఒకే పిల్లర్‌పై రెండు వంతెనల నిర్మాణానికి ససేమిరా అంటోన్న హెచ్ఎంఆర్ఎల్

- తాజాగా మందమల్లమ్మ-టీకేఆర్ కాలేజీ ప్రాజెక్టుకు నో
- ఆస్తుల సేకరణ, నిర్మాణ వ్యయం తగ్గేలా తెరపైకి
- పౌరుల ఇబ్బందుల నేపథ్యంలో పునరాలోచన
- ఆ మార్గాల్లో వేర్వేరుగా మెట్రో, ఫ్లై ఓవర్ల నిర్మాణాలు

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ మహానగరంలో డబుల్ డెక్కర్ వంతెనల నిర్మాణం దాదాపుగా లేనట్టే. ఆస్తుల సేకరణ, నిర్మాణ వ్యయం తగ్గేలా ప్రతిపాదించిన ఒకే పిల్లర్‌పై రెండు వంతెనల నిర్మాణాలకు హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్ (హెచ్ఎంఆర్ఎల్) సానుకూలంగా స్పందించడం లేదు. ఇప్పటికే విప్రో జంక్షన్‌లో ప్రతిపాదనకు నో చెప్పిన సంస్థ.. తాజాగా మందమల్లమ్మ చౌరస్తా-టీకేఆర్ కాలేజీ మార్గంలో వంతెన నిర్మాణం విషయంలోనూ అదే అభిప్రాయం వ్యక్తం చేసింది. ఈ తరహా నిర్మాణాలు(డబుల్ డెక్కర్) ప్రయోజనకరం కాదన్నది హెచ్ఎంఆర్ వర్గాల వాదన. నాగ్‌పూర్, జైపూర్ తదితర నగరాల్లో డబుల్ డెక్కర్ వంతెనలతో అక్కడి ప్రయాణికులు, పౌరులు ఇబ్బంది పడుతున్నారని సమావేశాల్లో చెబుతున్నట్టు సమాచారం. సెకండ్ లెవల్‌లో మెట్రో కారిడార్ ఉండడం వల్ల స్టేషన్లు ఎక్కువ ఎత్తులో నిర్మించాల్సి వస్తుందని, అంత ఎత్తులో రాకపోకలు సాగించడం ప్రయాణికులకు ఇబ్బందిగా మారుతుందని చెబుతున్నారు. నిర్వహణ, ఇతరత్రా ఖర్చులూ పెరుగుతాయని అధికారులు చెబుతున్నారు. వంతెనలు, మెట్రో కారిడార్ ప్రాజెక్టులు ఉన్న మార్గాల్లో వేర్వేరుగానే ఆయా నిర్మాణాలు చేపట్టనున్నారు. దీంతో రహదారులను కనీసం 150 అడుగుల నుంచి 200 అడుగుల మేర విస్తరించాల్సి ఉంటుంది. తద్వారా ఆస్తుల సేకరణ వ్యయం భారీగా పెరగనుంది. అయితే గ్రేటర్ హైదరాబాద్‌లో ఆస్తుల సేకరణ అత్యంత సంక్లిష్టం. ప్రాజెక్టులు, రహదారుల విస్తరణ కోసం చేపడుతోన్న ఆస్తుల సేకరణ ప్రక్రియ యేళ్ల తరబడి సాగుతోంది. ఈ ఇబ్బందులకు చెక్ పెట్టేలా మెట్రో కారిడార్ ప్రతిపాదిత మార్గాల్లో సింగిల్ పిల్లర్‌పై డబుల్ డెక్కర్ వంతెనలు నిర్మించాలని భావించారు. ఫస్ట్ లెవల్‌లో వాహనాలు, సెకండ్ లెవల్‌లో మెట్రోరైళ్ల రాకపోకలు సాగేలా డిజైన్ చేయాలనుకున్నారు. దీంతో తక్కువ ఆస్తుల సేకరణలో రెండు ప్రాజెక్టులు పూర్తి చేయొచ్చన్నది అధికారుల యోచన. నగరంలో ఏ ప్రాజెక్టు చేపట్టినా.. ఆ వ్యయంలో దాదాపు 40-50 శాతం ఆస్తుల సేకరణకు వెచ్చించాల్సి వస్తోంది. డబుల్ డెక్కర్ వంతెనలతో ఖర్చు తగ్గడంతోపాటు సేకరణలో ఇబ్బందులు ఉండవనుకున్నప్పటికీ.. ఆ దిశగా అడుగు ముందుకుపడే అవకాశం కనిపించడంలేదు.



పలు ప్రాంతాల్లో వంతెనలు, అండర్‌పాస్‌లు!

హైదరాబాద్ సిటీ ఇన్నోవేటివ్ ట్రాన్స్‌ఫర్మేటివ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్(హెచ్-సిటీ)లో భాగంగా నగరంలోని పలు ప్రాంతాల్లో వంతెనలు, అండర్‌పాస్‌లు నిర్మించనున్నారు. ఆయా ప్రాజెక్టులు నిర్మించే మార్గాల్లో మెట్రోకారిడార్ ఉంటే.. రెండింటిని కలిపి వంతెనలు నిర్మించేందుకు సాధ్యాసాధ్యాలు పరిశీలించాలని గతంలో ప్రభుత్వం ఆదేశించింది. ఈ క్రమంలోనే నగరంలోని విప్రో జంక్షన్, మందమల్లమ్మ-టీకేఆర్ కాలేజీ మార్గంలో డబుల్ డెక్కర్ వంతెనలు నిర్మించాలని జీహెచ్ఎంసీ భావించింది. గచ్చిబౌలిలోని ఐఎస్‌బీ వైపు రోడ్డు నుంచి కాగ్నిజెంట్ చౌరస్తా వరకు విప్రో జంక్షన్ మీదుగా 1.05 కి.మీల మేర వంతెన నిర్మాణాన్ని ప్రతిపాదించారు. ఇదే మార్గంలో రాయదుర్గ్ నుంచి కోకాపేట నియోపొలిస్ వరకు ఫేజ్-2లో ప్రతిపాదించిన మెట్రో కారిడార్ ఉంది. విప్రో జంక్షన్ నుంచి కాగ్నిజెంట్ చౌరస్తా వరకు మెట్రో, వంతెన కలిపి నిర్మించాలని భావించారు.


ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి మాతృమూర్తి దొంతి కాంతమ్మ దశదినం సందర్భంగా నివాళి అర్పిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు, ఇతర ప్రజాప్రతినిధులు

ఎమ్మెల్యే దొంతి మాతృమూర్తికి సీఎం నివాళి

ఎమ్మెల్యే కుటుంబసభ్యులకు పరామర్శ

హనుమకొండ, అక్టోబర్ 15(ఆంధ్రజ్యోతి): నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి మాతృమూర్తి దొంతి కాంతమ్మ దశదినం సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి నివాళులర్పించారు. హనుమకొండలో నిర్వహించిన మాతృవందనం కార్యక్రమానికి హాజరై దొంతి మాధవరెడ్డిని, ఆయన కటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా పలువురు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజాప్రతినిధులు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు కూడా కాంతమ్మ చిత్రపటం వద్ద అంజలి ఘటించారు. దొంతి కుటుంబసభ్యులను పరామర్శించారు.

ఖమ్మం మార్కెట్‌కు భారీగా పత్తి రాక

ఖమ్మం మార్కెట్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌కు పత్తి పోటెత్తింది. బుధవారం సుమారు 25 వేల బస్తాల పత్తి అమ్మకానికి వచ్చింది. ఈ ఏడాది సీజన్ ప్రారంభమయ్యాక మార్కెట్‌కు ఒకేరోజు ఇంత భారీ మొత్తంలో పంట రావడం ఇదే ప్రథమం. జిల్లా వ్యాప్తంగా నెల రోజులుగా కురుస్తున్న వర్షాలకు పత్తి దిగుబడి భారీగా తగ్గింది. మార్కెట్‌కు రెండు రోజులుగా సుమారు 15 వేల నుంచి 17 వేల బస్తాల పత్తి మాత్రమే అమ్మకానికి రాగా, బుధవారం ఒక్కరోజే 25 వేలకు పైగా బస్తాలు రావడం విశేషం. ప్రస్తుతం నైరుతి రుతుపవనాలు తిరోగమన దశలో ఉన్న నేపథ్యంలో రైతులు పంటను వడివడిగా సేకరించి అమ్మకానికి తెస్తున్నారు. మార్కెట్లో క్వింటా పత్తి ధర గరిష్ఠంగా రూ.7,211 పలకగా నాణ్యతను బట్టి క్వింటాలు రూ.4,600 నుంచి వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. బుధవారం పత్తి కొనుగోళ్లను మార్కెట్ కమిటీ చైర్మన్ యరగర్ల హనుమంతరావు, వైస్ చైర్మన్ తల్లాడ రమేశ్, సెక్రెటరీ ప్రవీణ్‌రెడ్డి పరిశీలించారు.

బిజినెస్

వరంగల్ ● గురువారం 16 అక్టోబరు 2025

హైదరాబాద్‌లో కిలో వెండి రూ.2.05 లక్షలు

న్యూఢిల్లీ: బులియన్ మార్కెట్‌లో రికార్డుల హోరు కొనసాగుతోంది. దేశంలోని ప్రధాన నగరాల్లో బుధవారం వెండి ధర కాస్తంత దిగజారినప్పటికీ హైదరాబాద్, విశాఖపట్టణం నగరాల్లో మాత్రం కిలో వెండి రూ.2 లక్షలు దాటింది. హైదరాబాద్‌లో బుధవారం కిలో వెండి ధర ఏకంగా రూ.7,000 పెరిగి రూ.2.05 లక్షలకు చేరి సరికొత్త రికార్డు నమోదు చేసింది. వైజాగ్‌లోనూ రూ.1,000 లాభంతో రూ.2,07 లక్షల వద్ద ట్రేడైంది.

అంతర్జాతీయ మార్కెట్లో బంగారం రికార్డు

అంతర్జాతీయ మార్కెట్‌లో ఔన్స్ (31.10 గ్రాములు) పసిడి ధర బుధవారం 4,200 డాలర్లకు చేరి రికార్డు సృష్టించింది. పసిడి ధర ఇలా పెరగడం వరుసగా ఇది మూడో రోజు.

రూపాయికి ఆర్‌బీఐ రక్ష!

ముంబై: డాలర్‌తో రూపాయి మారకం రేటు పతనంపై ఆర్‌బీఐ ఆందోళన చెందుతోంది. రూపాయిలో స్పెక్యులేటివ్ ట్రేడింగ్ భారీగా జరుగుతున్నట్టు భావిస్తున్న ఆర్‌బీఐ రేటులో స్థిరత్వం వచ్చే వరకు మద్దతు చర్యలు కొనసాగించాలనుకుంటోందని సీనియర్ అధికారి ఒకరు చెప్పారు. ఇటీవల డాలర్‌తో రూపాయి మారకం రేటు రూ.88.80 స్థాయికి పడిపోయింది. దీంతో ఈ రేటు త్వరలోనే రూ.89 స్థాయికి పతనమయ్యే అవకాశం ఉందని ఫారెక్స్ మార్కెట్‌లో అంచనాలు మొదయ్యాయి. డాలర్‌తో రూపాయి మారకం రేటును ఎట్టి పరిస్థితుల్లోనూ రూ.88.80 స్థాయికి మించి పతనం కానిచ్చేది లేదన్నారు. ఇందు కోసం అవసరమైనపుడల్లా ఫారెక్స్ మార్కెట్‌లో డాలర్లను విక్రయిస్తామన్నారు. దీంతో బుధవారం డాలర్‌తో రూపాయి మారకం రేటు 73 పైసలు బలపడి రూ.88.08 వద్ద ముగిసింది. గత నాలుగు నెలల్లో డాలర్‌తో రూపాయి మారకం రేటు ఒకే రోజు ఈ స్థాయిలో పుంజుకోవడం ఇదే మొదటిసారి.

ఈక్విటీ మార్కెట్లో ర్యాలీ

ముంబై: అమెరికన్ ఫెడరల్ మరో విడత రేట్ల కోత ప్రకటించవచ్చునన్న ఆశలు ప్రపంచవ్యాప్తంగా ఈక్విటీ మార్కెట్లను పరుగులు తీయించాయి. ఆసియా, యూరోపియన్ మార్కెట్లలో ఏర్పడిన ర్యాలీ దేశీయ ఈక్విటీ మార్కెట్ కూడా ఉత్తేజం ఇచ్చింది. దీంతో బుధవారం సెన్సెక్స్ 575.45 పాయింట్ల లాభంతో 82,605.43 వద్ద ముగియగా నిఫ్టీ 178.05 పాయింట్ల లాభంతో 25,323.55 వద్ద ముగిసింది. బీఎస్ఈ మిడ్‌క్యాప్ సూచీ 1.07%, స్మాల్‌క్యాప్ సూచీ 0.78% లాభపడ్డాయి.మంగళవారం విదేశీ ఇన్వెస్టర్లు రూ.1508.53 కోట్ల విలువ గల షేర్లు విక్రయించగా దేశీయ సంస్థలు రూ.3661.13 కోట్ల విలువ గల కొనుగోళ్లు చేశాయి.

వచ్చే ఐదేళ్లలో

మార్కెట్లోకి 26 కొత్త మోడళ్ల విడుదల

రూ.45,000 కోట్ల పెట్టుబడులు

● 2027కల్లా జెనిసిస్ బ్రాండ్ కార్ల లాంచ్

● హ్యుండయ్ మోటార్ భారీ ప్రణాళిక

ముంబై: దక్షిణ కొరియా వాహన తయారీ దిగ్గజం హ్యుండయ్ మోటార్ భారత అనుబంధ విభాగం హ్యుండయ్ మోటార్ ఇండియా భారీ ప్రణాళికను ప్రకటించింది. తదుపరి దశ వ్యాపార వృద్ధి కోసం వచ్చే ఐదు ఆర్థిక సంవత్సరాల్లో (2029-30 నాటికి) భారత మార్కెట్లో రూ.45,000 కోట్ల పెట్టుబడులు పెట్టనున్నట్లు కంపెనీ ప్రెసిడెంట్, సీఈఓ జోస్ మునోజ్ బుధవారం వెల్లడించారు. అందులో 60 శాతం పెట్టుబడులను ప్రొడక్ట్ అండ్ ఆర్ అండ్ డీ కోసం, మిగతా 40 శాతం తయారీ సామర్థ్యం పెంపు, ప్లాంట్ల అప్‌గ్రేడేషన్ కోసం వినియోగించనున్నట్లు ఆయన చెప్పారు. హ్యుండయ్ మోటార్ ఇండియా స్టాక్ మార్కెట్లో లిస్టయ్యాక తొలిసారిగా ఏర్పాటు చేసిన వాటాదారుల సమావేశంలో మునోజ్ మాట్లాడారు.

మరిన్ని విషయాలు..

● 2030 నాటికి భారత్‌ను తమ రెండో అతిపెద్ద మార్కెట్‌గా చేసుకోవాలని కంపెనీ లక్ష్యంగా పెట్టుకుంది. ప్రస్తుతం హ్యుండయ్‌కి భారత్ మూడో అతిపెద్ద మార్కెట్‌గా ఉంది. కంపెనీ ప్రపంచవ్యాప్త విక్రయాల్లో భారత్ వాటా 15 శాతంగా ఉంది.

● 2029-30 ఆర్థిక సంవత్సరం నాటికి భారత మార్కెట్లోకి 7 కొత్త కార్లు సహా 26 మోడళ్లను విడుదల చేయనున్నట్లు మునోజ్ తెలిపారు. అందులో భాగంగా సంస్థ ఓ మల్టీ యుటిలిటీ వెహికిల్ (ఎంయూవీ), ఆఫ్ రోడ్ స్పోర్ట్ యుటిలిటీ వెహికిల్ (ఎస్‌యూవీ) సైతం ప్రవేశపెట్టనుంది. అలాగే, దేశీయ డిజైనింగ్‌తో అభివృద్ధి చేసి, తయారు చేసిన ఎలక్ట్రిక్ ఎస్‌యూవీని భారత మార్కెట్ కోసం 2027లో అందుబాటులో తేవాలనుకుంటోంది.

● హ్యుండయ్ మోటార్ తన లగ్జరీ కార్ బ్రాండ్ జెనిసిస్‌ను 2027 నాటికి భారత మార్కెట్లోకి విడుదల చేయాలనుకుంటోంది.

● భారత్‌లో కంపెనీ విక్రయాలను మరింత పెంచేందుకు తమ సేల్స్ ఫైనాన్స్ విభాగం హ్యుండయ్ క్యాపిటల్ వచ్చే ఏడాది రెండో త్రైమాసికంలో భారత్‌లోకి ప్రవేశించనుందని, దశలవారీగా ఈ విభాగాన్ని విస్తరింపజేయనున్నట్లు మునోజ్ తెలిపారు.

● ఆదాయంలో ఎగుమతుల వాటా 30 శాతానికి పెరిగింది. వార్షిక ఆదాయం 1.5 రెట్లు పెరిగి రూ.లక్ష కోట్ల మైలురాయిని దాటింది.

తరుణ్ గార్గ్‌కు కంపెనీ పగ్గాలు

హ్యుండయ్ మోటార్ ఇండియా ఎండీ, సీఈఓగా తరుణ్ గార్గ్‌ను నియమించే ప్రతిపాదనను కంపెనీ బోర్డు ఆమోదించింది. 2026 జనవరి 1 నుంచి ఆయన కంపెనీ పగ్గాలు చేపట్టనున్నారు. హ్యుండయ్ మోటార్ ఇండియా సారథ్య బాధ్యతలు చేపట్టనున్న తొలి భారతీయుడు ఈయనే. ప్రస్తుతం గార్గ్ కంపెనీ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్‌గా ఉన్నారు. ప్రస్తుత సీఈఓ ఉన్సూ కిమ్ మాతృ సంస్థ హ్యుండయ్ మోటార్‌లో ఈ డిసెంబరు 31 నుంచి వ్యూహాత్మక బాధ్యతలు చేపట్టనున్నట్లు కంపెనీ తెలిపింది.



● భారత్‌లో మార్కెట్ వాటాను 15 శాతానికి పెంచుకోవడం. కంపెనీ షోరూమ్‌లు, సర్వీసుల నెట్‌వర్క్‌ను దేశంలోని 85 శాతం జిల్లాలకు విస్తరించడం. మొత్తం భారత విక్రయాల్లో గ్రామీణ మార్కెట్ వాటాను 30 శాతానికి పెంచుకోవడం.

చిన్న కార్ల విభాగంలో కొనసాగుతాం..

భారత్‌లో చిన్న కార్లకు గిరాకీ కొనసాగనుందని హ్యుండయ్ మోటార్ సీఈఓ మునోజ్ అన్నారు. ఈ విభాగం నుంచి హ్యుండయ్ వైదొలగబోదన్నారు.

హెరిటేజ్ ఫుడ్స్ లాభం రూ.51 కోట్లు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హెరిటేజ్ ఫుడ్స్ వర్తమాన ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో రూ.1112.50 కోట్ల కన్సాలిడేటెడ్ ఆదాయంపై రూ.50.99 కోట్ల కన్సాలిడేటెడ్ లాభం ఆర్జించింది. గత ఏడాది ఇదే త్రైమాసికంలో కంపెనీ ఆర్జించిన ఆదాయం రూ.1019.52 కోట్లు కాగా లాభం రూ.48.62 కోట్లు. వార్షిక ప్రాతిపదికన లాభం 4.87% పెరిగినట్టు కంపెనీ ఒక ప్రకటనలో తెలిపింది. ఇదే కాలంలో వ్యయాలు రూ.957.49 కోట్ల నుంచి రూ.1059.2 కోట్లకు పెరిగినట్టు పేర్కొంది. ప్రతికూల వాతావరణ పరిస్థితులు, అధిక సేకరణ వ్యయాలు వంటి సవాళ్ల నేపథ్యంలో సైతం తాము 9% ఆదాయ వృద్ధిని సాధించామని తెలియచేసింది. పాల సేకరణ 2.1% క్షీణించి రోజుకి సగటున 16.1 లక్షల లీటర్లకు తగ్గిందని, అయితే సేకరణ వ్యయాలు మాత్రం 6.3% పెరిగి లీటర్ రూ.42.8కి చేరాయని వివరించింది. పాల లభ్యత పెరగడంతో పాటు జీఎస్‌టీ ప్రభావం, పండుగ సీజన్ డిమాండు, సీజనల్ రికవరీతో ద్వితీయార్థం బలంగా ఉంటుందని భావిస్తున్నట్టు కంపెనీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నారా బ్రాహ్మణి చెప్పారు.

పవర్‌మెక్ ప్రాజెక్ట్స్‌కు భెల్ ఆర్డర్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): పవర్‌మెక్ ప్రాజెక్ట్స్ లిమిటెడ్‌కు (పీఎంపీఎల్) భెల్ నుంచి భారీ ఆర్డర్ లభించింది. తెలంగాణలోని పెద్దపల్లిలో ప్రస్తుతం నడుస్తున్న 2x600 మెగావాట్ల ప్రాజెక్టుకు విస్తరణగా చేపట్టిన 1x800 మెగావాట్ల ప్లాంట్‌లో బ్యాలెన్స్ ఆఫ్ ప్లాంట్ ప్యాకేజి కింద స్టేజ్ 2 నిర్మాణ కాంట్రాక్టును పీఎంపీఎల్‌కు ఈపీఎస్ విధానంలో భెల్ ఇచ్చింది. కాంట్రాక్టు విలువ రూ.2,500 కోట్లు.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

16వ తేదీ			
హైదరాబాద్	520	విజయవాడ	550
వరంగల్	522	గోదావరి	540
చిత్తూరు	573	విశాఖపట్నం	535
		దజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	105	విజయవాడ	119
వరంగల్	105	గుంటూరు	114
కరీంనగర్	105	ఒంగోలు	114
మహబూబ్‌నగర్	105	చిత్తూరు	102
కర్నూలు	105	నెల్లూరు	107
విశాఖపట్నం	127	అనంతపురం	107
గోదావరి	119		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,28,890 ▲	1,18,150 ▲	2,05,000 ▲
విజయవాడ	1,31,000 ▲	1,25,000 ▲	1,81,000 ▲
విశాఖపట్నం	1,30,490 ▲	1,18,150 ▲	2,07,000 ▲
రాజమండ్రి	1,28,440 ▲	1,18,650 ▲	1,93,000 ▼
ప్రొద్దుటూరు	1,31,800 ▲	1,20,260 ▼	1,85,000 ▲
ముంబై	1,26,710 ▲	1,16,070 ▲	1,74,000 ▼

13 నెలల గరిష్ఠానికి వాణిజ్య లోటు

● సెప్టెంబరులో 3,215 కోట్ల డాలర్లకు చేరిక

న్యూఢిల్లీ: ఈ ఏడాది సెప్టెంబరులో వాణిజ్య లోటు 11 నెలల గరిష్ఠ స్థాయి 3,215 కోట్ల డాలర్లకు పెరిగింది. గత నెలలో ఎగుమతులు 6.74% వృద్ధితో 3,638 కోట్ల డాలర్లకు పరిమితం కాగా.. దిగుమతులు మాత్రం ఏకంగా 16.6% పెరిగి 6,853 కోట్ల డాలర్లకు చేరడం ఇందుకు కారణం. కేంద్ర వాణిజ్య శాఖ బుధవారం విడుదల చేసిన డేటా ప్రకారం.. ఈ ఆర్థిక సంవత్సరం ప్రథమార్థంలో ఎగుమతులు వార్షిక ప్రాతిపదికన 3.02% వృద్ధితో 22,012 కోట్ల డాలర్లకు చేరాయి. దిగుమతులు కూడా 4.53% పెరుగుదలతో 37,511 కోట్ల డాలర్లకు ఎగబాకాయి. ఫలితంగా వాణిజ్య లోటు 15,499 కోట్ల డాలర్లుగా నమోదైంది. గతనెలలో బంగారం దిగుమతులు 960 కోట్ల డాలర్లకు పెరిగాయి.

31 నుంచి హైదరాబాద్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ సదస్సు

హైదరాబాద్: ఈ నెల 31 నుంచి హైటెక్స్‌లో 'హైదరాబాద్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ సదస్సు' జరగనుంది. రెండు రోజుల పాటు జరిగే ఈ సదస్సులో 500 స్టార్టప్ కంపెనీలు తమ స్టాల్స్ ఏర్పాటు చేస్తాయని 'టై' హైదరాబాద్ చాప్టర్ ప్రెసిడెంట్ రాజేశ్ పగడాల చెప్పారు. వీటికి తోడు ఏంజల్ ఇన్వెస్టర్లు, వెంచర్ క్యాపిటలిస్టులు, ప్రైవేటు ఈక్విటీ (పీఈ) సంస్థలు, పరిశ్రమల నుంచి 1,500 మంది వరకు ప్రతినిధులు హాజరయ్యే అవకాశం ఉందన్నారు. ఈ సదస్సులో కనీసం 50 స్టార్టప్ కంపెనీలకు వ్యాపార అభివృద్ధికి అవసరమైన నిధులు సమకూరే అవకాశం ఉందని రాజేశ్ చెప్పారు.

'సంవత్ 2081'లో ఐపీఓల జోరు

● రూ.1.75 లక్షల కోట్ల సమీకరణ.. రికార్డు సృష్టించిన ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్

న్యూఢిల్లీ: ఈ దీపావళితో ముగిసే 'సంవత్ 2081' (నవంబరు, 2024-అక్టోబరు, 2025) ఐపీఓ మార్కెట్‌కు బాగానే కలిసొచ్చింది. ఈ కాలంలో 103 ప్రధాన కంపెనీలు ప్రైమరీ మార్కెట్ ద్వారా రూ.1.75 లక్షల కోట్ల నిధులు సమీకరించాయి. సంవత్, 2080తో పోలిస్తే ఐపీఓకు వచ్చిన కంపెనీల సంఖ్య 229 తగ్గినా సమీకరించిన నిధులు మాత్రం రూ.1.08 లక్షల కోట్ల నుంచి రూ.1.75 లక్షల కోట్లకు పెరగడం విశేషం. ఇందులో 12 కంపెనీల ఐపీఓలు మదుపరులకు భారీ లాభాలు పంచి ఇచ్చాయి. ఈ సంవత్‌లో బీఎస్ఈ ఎస్ఎంఈ ప్లాట్‌ఫాం ద్వారా 343 ఎస్ఎంఈలు రూ.10,399.71 కోట్లు సమీకరించాయి.

ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ రికార్డు: ఇటీవల మార్కెట్‌కు వచ్చిన ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ ఐపీఓ మదుపరులకు మంచి లాభాలు పంచింది. ఐపీఓ కూడా సూపర్ డూపర్ హిట్టయింది. ఐపీఓ ద్వారా రూ.11,607 కోట్లు సమీకరించాలని భావించగా, మదుపరుల నుంచి రూ.4.5 లక్షల కోట్లకు బిడ్స్ వచ్చి భారత ఐపీఓ చరిత్రలో కొత్త రికార్డు నమోదు చేసింది.

మెరుపులు: సంవత్, 2081లో జనవరిలో రూ.90 అప్పర్ ప్రైస్‌బ్యాండ్‌తో జారీ చేసిన స్టాలియన్ ఇండియా ఫ్లోరోకెమికల్స్ కంపెనీ షేర్లు ప్రస్తుతం బీఎస్ఈలో రూ.395.75 వద్ద ట్రేడవుతున్నాయి. బుధవారం సైతం ఈ కంపెనీ షేర్లు 9.99 శాతం లాభాలతో ముగిశాయి. దీనికి తోడు జింకా లాజిస్టిక్స్ సొల్యూషన్స్, క్వాలిటీ పవర్ ఎలక్ట్రికల్ ఎక్విప్‌మెంట్, ఆదిత్య ఇన్ఫోటెక్, ఏథర్ ఎనర్జీ కంపెనీల ఐపీఓలూ మదుపరులకు 34% శాతం నుంచి 275% వరకు లాభాలు పంచాయి.

డీఐఐల అండ: ఈ ఏడాది ప్రారంభం నుంచి ఎఫ్‌పీఐలు మన ఈక్విటీ మార్కెట్ నుంచి రూ.2.03 లక్షల కోట్ల పెట్టుబడులను వెనక్కి తీసుకున్నారు. ఇదే సమయంలో బ్యాంకులు, దేశీయ ఆర్థిక సంస్థలు, బీమా కంపెనీలు, పెన్షన్ ఫండ్స్, మ్యూచువల్ ఫండ్స్ వంటి దేశీయ సంస్థాగత మదుపరులు రూ.6 లక్షల కోట్ల విలువైన షేర్లను కొనుగోలు చేశారు. గత ఏడాది మొత్తంతో పోలిస్తే ఇది రూ.74,000 కోట్లు ఎక్కువ. డీఐఐలు గతంలో ఎన్నడూ ఇంత పెద్ద మొత్తంలో షేర్లను కొనుగోలు చేయలేదు.



అహ్మదాబాద్‌లో కామన్వెల్త్ క్రీడలు

2030 గేమ్స్ వేదికను ప్రతిపాదించిన ఎగ్జిక్యూటివ్ బోర్డు

వచ్చేనెల 26న అధికారిక ప్రకటన

న్యూఢిల్లీ: భారత్‌లో మరో అంతర్జాతీయ క్రీడా పోటీల నిర్వహణకు రంగం సిద్ధమవుతోంది. ప్రతిష్ఠాత్మక కామన్వెల్త్ క్రీడలకు గుజరాత్‌లోని అహ్మదాబాద్ వేదికగా నిలవడం దాదాపు ఖరారైంది. 2030వ సంవత్సరంలో జరిగే ఈ క్రీడలకు అహ్మదాబాద్‌ను ఎంపిక చేయాలని కామన్వెల్త్ ఎగ్జిక్యూటివ్ (కార్యనిర్వహణ) బోర్డు ప్రతిపాదన చేసింది. వచ్చే నెల 26న స్కాట్లాండ్‌లోని గ్లాస్గోలో జరిగే కామన్వెల్త్ జనరల్ అసెంబ్లీలో దాదాపు పూర్తి సభ్యదేశాల అంగీకారంతో వేదిక ఖరారవుతుంది. ఇక ఈ క్రీడల ఆతిథ్యం కోసం నైజీరియాలోని అబూజా నగరం కూడా పోటీపడుతున్న విషయం తెలిసిందే. అయితే నైజీరియా 2034లో ఈ క్రీడల నిర్వహణకు వ్యూహాలు రూపొందించేందుకు తాము సహకరిస్తామని బోర్డు ఈ సందర్భంగా తెలిపింది. దీంతో భారత్‌కు ఆతిథ్య హక్కులు అప్పగించడం లాంఛనమేనని భావించాలి. కాగా 2010లో ఢిల్లీలో కామన్వెల్త్ క్రీడలు జరిగాయి. 2036 ఒలింపిక్స్‌ను అహ్మదాబాద్ వేదికగా నిర్వహించేందుకు గతేడాది అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీకి భారత్ తమ ఆసక్తి వ్యక్తీకరణ లేఖను అందించిన సంగతి తెలిసిందే. ఈ కామన్వెల్త్ క్రీడల కేటాయింపు జరిగితే అది ఒలింపిక్స్ ఆతిథ్య రేసులో భారత్‌కు ఎంతో ఉపయుక్తమవుతుంది. ఒలింపిక్స్, ఆసియా క్రీడల తర్వాత క్రీడారంగంలో మూడో అతిపెద్ద ఈవెంట్‌గా కామన్వెల్త్ క్రీడలు భాసిల్లుతున్నాయి. కామన్వెల్త్ క్రీడలు మొదటి సారిగా 1930లో కెనడా వేదికగా జరిగాయి. అహ్మదాబాద్ ఈవెంట్‌తో ఈ మెగా క్రీడలు వందేళ్లు పూర్తి చేసుకోనుండడం విశేషం.

భారత్ సత్తాకు నిదర్శనం

కామన్వెల్త్ క్రీడల ఆతిథ్యం దక్కడంపై భారత కేంద్ర హోం మంత్రి అమిత్ షా, కేంద్ర క్రీడాశాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయ, ఒలింపిక్ సంఘం (ఐఓఏ) అధ్యక్షురాలు పీటీ ఉష హర్షం వ్యక్తం చేశారు. అంతర్జాతీయ క్రీడా వేదికపై భారత్ సత్తా చాటుతుందనేందుకు ఇదే అతి పెద్ద నిదర్శనమని వ్యాఖ్యానించారు.

'అంతర్జాతీయ క్రీడా యవనికపై భారత్‌ను అగ్రగామిగా నిలిపేందుకు ప్రధాని నరేంద్ర మోదీ చేస్తున్న నిరంతర ప్రయత్నానికి ఇది నిదర్శనం' అని అమిత్ షా అన్నారు.

'ప్రపంచ క్రీడల్లో భారత్ ఆధిపత్యాన్ని చాటుతుందనేందుకు ఈ క్రీడల ఆతిథ్యం దక్కడమే ఉదాహరణ' అని క్రీడామంత్రి మన్సుఖ్ మాండవీయ తెలిపారు.

'వికసిత్ భారత్ 2047 దిశగా అద్భుత పురోగతి సాధిస్తున్నామని ఈ క్రీడల నిర్వహణ చాటిచెబుతుంది. అంతేకాదు.. ఈ క్రీడలు కామన్వెల్త్ దేశాల మధ్య భాగస్వామ్యాన్ని బలపరిచేందుకు గొప్ప అవకాశాన్ని అందిస్తాయి' అని ఉష వ్యాఖ్యానించింది.

సఫారీల జైత్రయాత్రకు బ్రేక్

లాహోర్: దక్షిణాఫ్రికా 10 టెస్టుల విజయ పరంపరకు పాకిస్థాన్ బ్రేక్ వేసింది. బుధవారం ఇక్కడ ముగిసిన తొలి టెస్టులో పాకిస్థాన్ 93 పరుగులతో సఫారీలను ఓడించింది. 277 పరుగుల లక్ష్యంతో ఓవర్ నైట్ 51/2 స్కోరుతో బుధవారం, నాలుగో రోజు రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన పర్యాటక జట్టు 183 పరుగులకు కుప్పకూలింది. బ్రేవిస్ (54), రికెల్టన్ (45) రాణించారు. స్పిన్నర్ నోమన్ అలీ, పేసర్ షహీన్ షా నాలుగేసి వికెట్లు పడగొట్టారు. తొలి ఇన్నింగ్స్‌లో పాకిస్థాన్ 378, దక్షిణాఫ్రికా 269 పరుగులు చేశాయి. పాకిస్థాన్ రెండో ఇన్నింగ్స్‌లో 167 పరుగులకు ఆలౌటైంది.

ప్రీక్వార్టర్స్‌లో తన్వీ, ఉన్నతి



గువాహటి: భారత షట్లర్లు తన్వీ శర్మ, ఉన్నతి హుడా, రక్షిత ప్రపంచ జూనియర్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ రౌండ్-16లో అడుగు పెట్టారు. బుధవారం జరిగిన బాలికల సింగిల్స్‌లో టాప్ సీడ్ తన్వీ 15-12, 15-7తో ఓయీ వినార్తో (ఇండోనేసియా)పై, ఉన్నతి 15-8, 15-5తో అలైస్ వాంగ్ (అమెరికా)పై, రక్షిత 11-15, 15-5, 15-8తో అలియా (సింగపూర్)పై నెగ్గారు. బాలుర సింగిల్స్‌లో జ్ఞాన దత్తా 11-15, 15-6, 15-11తో సూర్యాక్ష్ రావత్‌ని ఓడించాడు. డబుల్స్‌లో భార్గవ రామ్/విశ్వతేజ్ జంట ప్రీక్వార్టర్స్‌కు చేరింది.

సాత్విక్ జోడీ బోణీ: డెన్మార్క్ ఓపెన్‌లో లక్ష్య సేన్, సాత్విక్ సాయిరాజ్/చిరాగ్ శెట్టి రెండో రౌండ్‌కు దూసుకెళ్లారు. సింగిల్స్‌లో లక్ష్య 10-21, 21-8, 21-18తో నాట్ గుయెన్ (ఐర్లాండ్)పై, డబుల్స్‌లో సాత్విక్ ద్వయం 17-21, 21-11, 21-17తో స్కాట్లాండ్ జోడీ క్రిస్టోఫర్/మాథ్యూపై నెగ్గారు.

ఆసీస్‌కు పయనం

రెండు బృందాలుగా వెళ్లిన టీమిండియా





న్యూఢిల్లీ: ఆస్ట్రేలియాతో పరిమిత ఓవర్ల సిరీస్‌లో పాల్గొనేందుకు భారత జట్టు బుధవారం ఆ దేశానికి పయనమైంది. ఈ సిరీస్‌లో భాగంగా టీమిండియా, ఆసీస్ మూడు వన్డేలు, ఐదు టీ20లలో తలపడనున్నాయి. తొలుత వన్డే సిరీస్ ప్రారంభం కానుంది. మొదటి వన్డే ఈనెల 19న పెర్త్‌లో జరగనుంది. తొలి విడతగా రోహిత్, విరాట్ కోహ్లీతో పాటు కెప్టెన్ శుభ్‌మన్ గిల్, ఓపెనర్ జైస్వాల్, వాషింగ్టన్ సుందర్, ధ్రువ్ జురెల్, పేసర్లు అర్ష్‌దీప్, ప్రసిద్ధ్, జట్టు సహాయ సిబ్బంది కొందరు ఆస్ట్రేలియా పయనమయ్యారు. ఉదయాన్నే భారత జట్టు బయలు దేరినా..ఆ సమయానికే క్రికెట్ అభిమానులు విమానాశ్రయానికి తరలి వచ్చి వీడ్కోలు పలకడం విశేషం. ప్రధాన కోచ్ గంభీర్, ఇతర సహాయ సిబ్బంది సాయంత్రం బయలు దేరారు. ఇక..ఈ సిరీస్‌లో వన్డే మ్యాచ్‌లకు ఎనలేని ప్రాధాన్యం ఏర్పడింది. కారణం..టెస్టులు, టీ20ల నుంచి రిటైర్ అయిన దిగ్గజ బ్యాటర్లు రోహిత్, కోహ్లీలు ఆసీస్‌తో సిరీస్ తర్వాత 50 ఓవర్ల ఫార్మాట్లకూ వీడ్కోలు పలకనున్నారని ఇటీవల వార్తలు రావడమే. రో-కో ద్వయం వన్డే వరల్డ్ కప్‌లో పాల్గొంటారా అన్న ప్రశ్నకు..ఆ మెగా టోర్నీకి ఇంకా రెండున్నరేళ్ల సమయముందని వెస్టిండీస్‌తో రెండో టెస్ట్ తర్వాత మీడియా అడిగిన ప్రశ్నకు గంభీర్ బదులివ్వడం గమనార్హం. ఆస్ట్రేలియాతో వన్డే సిరీస్‌లో రోహిత్, కోహ్లీ సత్తా మేరకు ఆడగలరన్న ఆశాభావాన్ని గంభీర్ వ్యక్తంజేశాడు.

హీరో..ఎలా ఉన్నావ్?



భారత జట్టు ఆస్ట్రేలియా పయనమైన సందర్భంగా న్యూఢిల్లీ విమానాశ్రయంలో సరదా సన్నివేశాలు చోటు చేసుకున్నాయి. వన్డే కొత్త కెప్టెన్ గిల్.. రోహిత్ ఒకరి నొకరు హగ్ చేసుకున్నారు. రోహిత్ భుజంపై గిల్ చేయి వేయగా 'కొత్త హీరో.. ఎలా ఉన్నావ్' అని రోహిత్ నవ్వుతూ స్పందించాడు. విరాట్ పెద్దగా నవ్వుతూ గిల్‌కు షేక్‌హ్యాండ్ ఇవ్వడంతోపాటు కొత్త సారథిని భుజం తట్టి ప్రోత్సహించాడు. ఈమేరకు బీసీసీఐ వీడియో విడుదలజేసింది.

నేటి నుంచి హనుమకొండలో జాతీయ అథ్లెటిక్స్

వరంగల్ స్పోర్ట్స్ (ఆంధ్రజ్యోతి): జాతీయ అండర్-23 అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌నకు హనుమకొండ ఆతిథ్యమిస్తోంది. గురువారం నుంచి మూడ్రోజుల పాటు జరిగే ఈ పోటీలను స్థానిక జవహర్‌లాల్ స్టేడియం, నిట్ కళాశాలలో నిర్వహిస్తున్నారు. వివిధ రాష్ట్రాల నుంచి సుమారు 900 మంది క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొంటున్నారు. 100, 200, 400, 800, 1500, 5, 10 వేల మీటర్ల పరుగుతో పాటు 20 కి.మీ. రేస్ వాక్, 110, 400 మీ., హర్డిల్స్ హైజంప్, లాంగ్‌జంప్, షాట్‌పుట్, జావెలిన్ త్రో, డిస్కస్ త్రో, హెప్టాథ్లాన్, డెకాథ్లాన్, డిస్కస్‌త్రో ఈవెంట్లలో పోటీలు జరగనున్నాయి.

ఢిల్లీ 256/3

● మిలింద్‌కు రెండు వికెట్లు

● హైదరాబాద్‌తో రంజీ



హైదరాబాద్: ఆయుష్ డిసౌజా, సనత్ అజేయ అర్ధ శతకాలతో ఆదుకోవడంతో.. హైదరాబాద్‌తో బుధవారం ఆరంభమైన రంజీ మ్యాచ్‌లో ఢిల్లీ భారీ స్కోరు దిశగా సాగుతోంది. మొదటి రోజు ఆట ముగిసే సమయానికి తొలి ఇన్నింగ్స్‌లో ఢిల్లీ 256/3 స్కోరు చేసింది. ఆయుష్ (97 బ్యాటింగ్), సనత్ (91 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు. చామా మిలింద్ రెండు వికెట్లు పడగొట్టాడు.

భరత్ భారీశతకం.. ఆంధ్ర 289/3

కాన్పూర్: ఓపెనర్ శ్రీకర్ భరత్ (142) సెంచరీతో చెలరేగడంతో.. తాజా రంజీ సీజన్‌ను ఆంధ్ర జట్టు మెరుగ్గా ఆరంభించింది. గ్రూప్-ఎలో బుధవారం ఉత్తరప్రదేశ్‌తో మొదలైన మ్యాచ్‌లో తొలి ఇన్నింగ్స్‌లో ఆంధ్ర 289/3 స్కోరు చేసింది. మొదటి రోజు ఆటచివరకు రషీద్ (94 బ్యాటింగ్) క్రీజులో ఉన్నాడు.

స్పోర్ట్స్

వరుణుడి ఖాతాలో మరొకటి

● ఇంగ్లండ్-పాకిస్థాన్ మ్యాచ్ రద్దు

● మహిళల వన్డే వరల్డ్‌కప్

కొలంబో: మహిళల ప్రపంచ కప్‌లో మరో మ్యాచ్‌ను వరుణుడు అడ్డుకున్నాడు. ఇంగ్లండ్-పాకిస్థాన్ జట్ల మధ్య బుధవారం ఇక్కడ జరిగిన మ్యాచ్ అర్ధంతరంగా రద్దయింది. దాంతో రెండు జట్లకు చెరో పాయింట్ కేటాయించారు. వర్షంవల్ల మ్యాచ్‌ను 31 ఓవర్లకు కుదించగా..మొదట ఇంగ్లండ్ 133/9 స్కోరు చేసింది. ఛేదనలో పాకిస్థాన్ 6.4 ఓవర్లలో 34/0 స్కోరుతో ఉన్న దశలో మరోసారి భారీ వర్షం కురవడంతో అంపైర్లు మ్యాచ్‌ను రద్దు చేశారు. టాస్ కోల్పోయి తొలుత బ్యాటింగ్ చేసిన ఇంగ్లండ్ 25 ఓవర్లలో 79/7 స్కోరుతో ఉన్న దశలో వర్షం వల్ల ఆటకు మూడున్నర గంటలు అంతరాయమేర్పడింది. దాంతో ఇంగ్లండ్ ఇన్నింగ్స్‌ను 31 ఓవర్లకు కుదించారు. చివరి ఆరు ఓవర్లలో డీన్, ఆర్లాట్ 54 పరుగులు జోడించి జట్టుకు ఓ మోస్తరు స్కోరు అందించారు. కాగా..టోర్నీలో వర్షం వల్ల ఫలితం తేలని మూడో మ్యాచ్ ఇది. మంగళవారంనాడు శ్రీలంక-న్యూజిలాండ్ మ్యాచ్ కూడా రద్దయింది. అంతకుముందు ఈనెల నాలుగున శ్రీలంక, ఆస్ట్రేలియా నడుమ ప్రేమదాస స్టేడియంలో జరగాల్సిన మ్యాచ్ కూడా వర్షంతో రద్దు ఖాతాలో చేరింది.

నేటి మ్యాచ్ — మ.3 నుంచి స్టార్ నెట్‌వర్క్‌లో

ఆస్ట్రేలియా X బంగ్లాదేశ్

టైబ్రేకర్‌లో టైటాన్స్‌కు చెక్

న్యూఢిల్లీ: వరుస విజయాలతో ప్లేఆఫ్స్ దిశగా దూసుకెళ్తున్న తెలుగు టైటాన్స్‌కు షాక్ తగిలింది. ప్రొ కబడ్డీ లీగ్‌లో బుధవారం హోరాహోరీగా సాగిన మ్యాచ్ టైబ్రేకర్‌లో టైటాన్స్ 5-7తో బెంగాల్ వారియర్స్ చేతిలో పరాజయం పాలైంది. నిర్ణీత సమయంలో ఇరుజట్లూ నువ్వా? నేనా? అన్నట్టుగా తలపడడంతో స్కోరు 45-45 సమమైంది. మరో మ్యాచ్‌లో గుజరాత్ జెయింట్స్ 42-35తో తమిళ్ తలైవాస్‌పై గెలిచింది.

కుర్రాళ్ల జోరుకు కళ్లెం

● ఆసీస్ చేతిలో యువ భారత్ ఓటమి

● సుల్తాన్ జొహార్ కప్ జూనియర్ హాకీ

జొహర్ బహ్రు (మలేసియా): జూనియర్ సుల్తాన్ జొహర్ కప్‌లో అజేయంగా దూసుకెళ్తున్న యువ భారత హాకీ జట్టు జోరుకు బ్రేక్ పడింది. తాజా టోర్నీలో భారత్ తొలి ఓటమిని రుచి చూసింది. బుధవారం ఇక్కడ జరిగిన పోరులో ఆస్ట్రేలియా 4-2తో భారత్‌ను ఓడించింది. మొత్తం నాలుగు మ్యాచ్‌లకుగాను రెండు విజయాలు, ఓ ఓటమి, ఓ డ్రాతో కలిపి ఏడు పాయింట్లతో భారత్ రెండోస్థానంలో ఉంది. ఆస్ట్రేలియా 10 పాయింట్లతో టాప్‌లో ఉంది. భారత్ తన తదుపరి మ్యాచ్‌ను శుక్రవారం ఆతిథ్య మలేసియాతో ఆడనుంది.

మక్కల కొనుగోళ్లకు కేంద్రం సుముఖంగా లేదు!

» అందుకే నేటినుంచి రాష్ట్ర ప్రభుత్వమే కొంటుంది: తుమ్మల



హైదరాబాద్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం మొక్కజొన్నల (మక్కలు) కొనుగోళ్లకు ఏమాత్రం సుముఖంగా లేదని, రాష్ట్ర ప్రభుత్వం నుంచి ప్రతిపాదనలు పంపిస్తే ఎలాంటి స్పందన రాలేదని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఈ నేపథ్యంలో సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయం మేరకు రాష్ట్ర ప్రభుత్వమే మార్క్‌ఫెడ్ ద్వారా గురువారం నుంచి మక్కల కొనుగోళ్లు చేపడుతున్నదని ఆయన పేర్కొన్నారు. సచివాలయంలో బుధవారం మార్కెటింగ్, మార్క్‌ఫెడ్, హాకా, ఆర్ఐసీ సంస్థల మేనేజింగ్ డైరెక్టర్లు, ఇతర అధికారులతో తుమ్మల సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా నేటి నుంచి మక్కల కొనుగోళ్లు ప్రారంభమవుతాయని, రైతులు ప్రైవేటు మార్కెట్లో కాకుండా మార్క్‌ఫెడ్ కొనుగోలు కేంద్రాల్లో మక్కలు విక్రయింయాలని సూచించారు. కాగా, పలు రకాల పంట ఉత్పత్తుల సేకరణ జరుగుతున్న నేపథ్యంలో ఉమ్మడి జిల్లాల వారీగా ప్రత్యేక అధికారులను నియమిస్తూ మంత్రి తుమ్మల ఆదేశాలు జారీచేశారు.

జర్నలిస్టుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యం

» త్వరలో అక్రిడిటేషన్ కార్డుల జారీకి విధివిధానాలు: పొంగులేటి



హైదరాబాద్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): పాత్రికేయులకు అక్రిడిటేషన్ కార్డుల జారీతో పాటు ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ కార్యక్రమాలు అర్హులైన జర్నలిస్టులకు అందేలా విధివిధానాలను రూపొందిస్తున్నట్టు సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యం ఇవ్వడంతోపాటు సంక్షేమం కోసం నిరంతరం పనిచేస్తుందన్నారు. సచివాలయంలో బుధవారం మీడియా అకాడమీ ఛైర్మన్ కె.శ్రీనివాస రెడ్డి, సమాచార పౌరసంబంధాల శాఖ కమిషనర్ సీహెచ్ ప్రియాంక, సీఎంవో సీపీఆర్వో మల్సూర్‌తో సమావేశమైన మంత్రి అక్రిడిటేషన్ విధివిధానాలపై చర్చించారు. వీలైనంత త్వరగా అక్రిడిటేషన్ కార్డులను జారీ చేసేందుకు ఈనెల చివరి నాటికి పాలసీ విధివిధానాలను రూపొందించాలన్నారు.

నలుగురికి అదనపు కలెక్టర్లుగా పదోన్నతి

» 13 మందికి స్పెషల్ గ్రేడ్ కలెక్టర్లుగా.. ఉత్తర్వులు జారీ

హైదరాబాద్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ శాఖలో నలుగురు స్పెషల్ గ్రేడ్ కలెక్టర్లకు అదనపు కలెక్టర్లుగా పదోన్నతి లభించింది. అలాగే 13 మంది డిప్యూటీ కలెక్టర్లకు స్పెషల్ గ్రేడ్ కలెక్టర్లుగా పదోన్నతి కల్పించారు. ఈమేరకు రెవెన్యూ శాఖ కార్యదర్శి లోకేష్ కుమార్ బుధవారం ఉత్తర్వులిచ్చారు. పదోన్నతి పొందిన 13 మంది స్పెషల్ గ్రేడ్ కలెక్టర్లు రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని సచివాలయంలో కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. పదోన్నతి పొందిన అధికారులు, రెవెన్యూ యంత్రాంగం ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పని చేసినప్పుడే ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుందన్నారు. భూభారతి చట్టంలో సమస్యల పరిష్కారానికి స్పష్టమైన నిబంధనలు ఉన్నాయని, సాదాబైనామా దరఖాస్తులను వీలైనంత త్వరగా పరిష్కరించాలని అధికారులకు సూచించారు. నలుగురికి అదనపు కలెక్టర్లుగా, 13 మందికి స్పెషల్ గ్రేడ్ కలెక్టర్లుగా పదోన్నతి కల్పించినందుకు సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి పొంగులేటికి ట్రెసా కృతజ్ఞతలు తెలిపింది. ట్రెసా అధ్యక్షుడు వంగా రవీందర్ రెడ్డి, కార్యదర్శి గౌతమ్ కుమార్ అర్హులైన తహసీల్దార్లకు డిప్యూటీ కలెక్టర్‌గా పదోన్నతులు ఇవ్వాలని మంత్రికి విజ్ఞప్తి చేశారు.

శ్రీశైలం ఎలివేటెడ్ కారిడార్‌కు నిధులివ్వండి

» ప్రధాని మోదీకి సీఎం రేవంత్, ఎంపీ మల్లు రవి లేఖలు

న్యూఢిల్లీ, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం ఎలివేటెడ్ కారిడార్‌కు రూ.8000 కోట్లు అవుతాయని అంచనా వేశామని, ఆ మొత్తాన్ని మంజూరు చేయాలని ప్రధాని నరేంద్ర మోదీకి సీఎం రేవంత్ రెడ్డి, ఎంపీ మల్లు రవి లేఖలు రాశారు. ఆ రెండు లేఖలను బుధవారం ప్రధాని కార్యాలయంలో మల్లు రవి అందజేశారు. అనంతరం ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో ఆ వివరాలను మీడియాకు వివరించారు. మన్ననూర్ నుంచి శ్రీశైలం ఎలివేటెడ్ కారిడార్‌కు సంబంధించి సీఎంతోపాటు ఎంపీల బృందం కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని కలిశామని గుర్తుచేశారు. అదే విషయమై ప్రధానికి లేఖలు రాసినట్టు పేర్కొన్నారు. అలాగే రెండు తెలుగు రాష్ట్రాలను కలిపేలా కృష్ణా నదిపై వంతెనను మంజూరు చేయాలని లేఖలో కోరినట్టు వెల్లడించారు. దీంతోపాటు దళిత ఐపీఎస్ అధికారి పూరన్ కుమార్ ఆత్మహత్యకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రధానికి తాను రాసిన లేఖను సైతం అందజేశానని పేర్కొన్నారు.

బీసీలపై రేవంత్‌ది కపట ప్రేమ: కేటీఆర్

హైదరాబాద్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): బీసీ సంక్షేమానికి లక్షకోట్ల బడ్జెట్, బీసీసబ్-ప్లాన్, వారికి 42% రిజర్వేషన్ కల్పిస్తామని హామీలిచ్చి.. కాలంగడుపుతున్న సీఎం రేవంత్‌రెడ్డికి బీసీ సమాజంపై ఉన్నది నిజమైన ప్రేమకాదని, అదంతా కపట ప్రేమ అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. బీసీ సంఘాల నాయకులు ఆర్.కృష్ణయ్య, జాజుల శ్రీనివాస్‌గౌడ్ తదితరులు బుధవారం తెలంగాణభవన్‌లో కేటీఆర్‌తో సమావేశమయ్యారు. ఇందులో బీఆర్ఎస్ నేతలు మధుసూదనాచారి, తలసాని, వి.శ్రీనివాస్‌గౌడ్, గంగుల కమలాకర్ తదితరులు పాల్గొని పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ బీసీల సంక్షేమానికి బీఆర్ఎస్ కట్టుబడి ఉందని, ఈనెల 18న చేపట్టనున్న రాష్ట్ర బంద్‌కు తమ నైతిక మద్దతు ఉంటుందని పేర్కొన్నారు. జాతీయ పార్టీలు నిర్ణయాత్మకంగా వ్యవహరించాలని, ప్రధాని మోదీ, ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ కలిసివస్తే బీసీ రిజర్వేషన్ల సమస్య నిమిషంలో పరిష్కారం అవుతుందని ఆయన అన్నారు.

రేవంత్ రెడ్డిపై కేసు చట్టబద్ధం కాదు

» ఓటుకు నోటు కేసులో న్యాయవాది రోహత్గీ వాదనలు

న్యూఢిల్లీ, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ఓటుకు నోటు వ్యవహారంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై దాఖలైన కేసు చట్టబద్ధం కాదని సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ సుప్రీం కోర్టులో వాదనలు వినిపించారు. ఎఫ్ఐఆర్ లేకుండా, జనరల్ డైరీలో నమోదు చేయకుండానే.. సీఆర్పీసీ కింద దర్యాప్తు ఎలా ప్రారంభిస్తారని ప్రశ్నించారు. ఈ కేసు ఉద్దేశపూర్వకంగా రేవంత్ రెడ్డిని ఇరికించేందుకు పన్నిన వలేనన్నారు. ఓటుకు నోటు కేసును అవినీతి నిరోధక చట్టం కింద కాకుండా ఎన్నికల చట్టాల నియామావళి కింద విచారణ చేపట్టాలని కోరుతూ 2021 జూలై 22న రేవంత్ రెడ్డి, ఈ కేసులో తన పేరును తొలగించాలని కోరుతూ 2021 ఏప్రిల్ 13న సండ్ర వెంకట వీరయ్య సుప్రీంకోర్టులో వేర్వేరుగా స్పెషల్ లీవ్ పిటిషన్లు దాఖలు చేశారు.వాటిని బుధవారం జస్టిస్ జేకే మహేశ్వరి, జస్టిస్ విజయ్ బిష్ణోయ్‌లతో కూడిన ధర్మాసనం విచారించింది. రేవంత్ రెడ్డి తరఫున ముకుల్ రోహత్గీ వాదనలు వినిపిస్తూ 2015నాటి ఈ కేసులో ముగ్గురు వ్యక్తులు పట్టుబడ్డారని, అక్కడ రేవంత్‌రెడ్డి లేరని గుర్తుచేశారు. కాగా, ఈ కేసును గురువారానికి వాయిదా వేస్తున్నట్టు ధర్మాసనం తెలిపింది.

స్కాలర్‌షిప్ టెస్ట్‌కు లక్ష మంది విద్యార్థులు

» నారాయణ విద్యాసంస్థల వెల్లడి

హైదరాబాద్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 12న తాము నిర్వహించిన 'నేషనల్ స్కాలస్టిక్ ఆప్టిట్యూట్ టెస్ట్'కు(ఎన్ఎస్ఏటీ) తెలుగు రాష్ట్రాల నుంచి లక్ష మందికి పైగా విద్యార్థులు పాల్గొన్నారని నారాయణ విద్యాసంస్థలు తెలిపాయి. 5 నుంచి 10వ తరగతి విద్యార్థులకు ఈ పరీక్షలను ఈ నెల 5, 12వ తేదీల్లో నిర్వహించామని నారాయణ విద్యాసంస్థల కోర్ కమిటీ సభ్యురాలు రమా నారాయణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు రూ. కోటి బహుమతులతోపాటు రూ. 50 కోట్ల వరకు స్కాలర్‌షిప్ అందిస్తామని వివరించారు. ఈ పరీక్షలను గత 19 సంవత్సరాలుగా దేశ వ్యాప్తంగా నిర్వహిస్తున్నామని రమా నారాయణ తెలిపారు.

ఆంధ్రజ్యోతి, ఏబీఎన్ ప్రస్థానం ద్విగుణీకృతమవ్వాలి

ఎక్స్‌లో వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలిపిన ఏపీ, తెలంగాణ సీఎంలు

అమరావతి, హైదరాబాద్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): పాత్రికేయ విలువలను పరిరక్షిస్తూ, నిజాన్ని నిర్భయంగా చెప్పే ఆంధ్రజ్యోతి, ఏబీఎన్ సంస్థల వార్షికోత్సవం సందర్భంగా ఎండీ వేమూరి రాధాకృష్ణ, సిబ్బందికి, పాత్రికేయులకు ఏపీ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రి లోకేశ్, తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. 23 సంవత్సరాలుగా తెలుగు పాఠకులపై ఆంధ్రజ్యోతి చెరగని ముద్ర వేసింది. 16 సంవత్సరాలుగా విశిష్ట న్యూస్ చానల్‌గా ఏబీఎన్ ఆంధ్రజ్యోతి వెలుగొందుతోంది. ఈ మీడియా సంస్థల నిర్వాహకుడు, ప్రముఖ జర్నలిస్టు వేమూరి రాధాకృష్ణకు శుభాకాంక్షలు, అభినందనలు. నిష్పక్షపాతంగా వార్తలను అందించడంలో ముందుండే ఆంధ్రజ్యోతి, ఏబీఎన్ చానళ్ల ప్రస్థానం మరింత ద్విగుణీకృతం కావాలి' అని చంద్రబాబు ఆకాంక్షించారు. 'ఆంధ్రజ్యోతి ఎండీ వేమూరి రాధాకృష్ణకు హృదయపూర్వక శుభాకాంక్షలు. ప్రధాన సంపాదకులు, పాత్రికేయులు, సాంకేతిక నిపుణులు, సిబ్బందికి అభినందనలు'అని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. 'అక్షరమే ఆయుధంగా, సమాజ హితమే లక్ష్యంగా వేమూరి రాధాకృష్ణ ఆధ్వర్యంలో వెలిగించిన ఆంధ్రజ్యోతి దినదిన ప్రవర్ధమానమై 23 ఏళ్లు... నిజాన్ని నిర్భీతిగా చూపించడంలో దమ్మున్న చానల్‌గా పేరుగాంచిన ఏబీఎన్ ప్రారంభమై 16 ఏళ్లు పూర్తయిన సందర్భంగా హార్దిక శుభాకాంక్షలు. తెలుగు ప్రజలకు అభిమాన పత్రికగా ఆంధ్రజ్యోతి, ఇష్టపడే చానల్‌గా ఏబీఎన్ నిలిచాయి' అని మంత్రి లోకేశ్ పేర్కొన్నారు. ఆంధ్రజ్యోతి పత్రిక 23వ వార్షికోత్సవం, ఏబీఎన్ ఛానెల్ 16వ వార్షికోత్సవం సందర్భంగా యాజమాన్యానికి, సిబ్బందికి తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి శుభాభినందనలు తెలిపారు. మీడియా రంగంలో వస్తున్న ఆటుపోట్లను సమర్థంగా ఎదుర్కొంటూ ఏబీఎన్-ఆంధ్రజ్యోతి ఛానెల్, పత్రిక తెలుగు పాఠకుల్లో చెరగని ముద్ర వేశాయని ప్రశంసించారు. ప్రజల పక్షాన నిలబడి 16ఏళ్లగా మీడియా రంగంలో విశేష సేవలు అందిస్తున్న ఏబీఎన్ ఛానెల్ భవిష్యత్తులో మరింత ఎదగాలని ఆకాంక్షిస్తున్నట్లు సీఎంవో ఎక్స్‌లో పోస్టు చేసింది.



వార్షికోత్సవం సందర్భంగా ఏబీఎన్ కార్యాలయంలో బుధవారం కేక్ కట్‌చేస్తున్న ఏబీఎన్- ఆంధ్రజ్యోతి ఎండీ వేమూరి రాధాకృష్ణ, చిత్రంలో పలువురు సిబ్బంది

బీసీ రిజర్వేషన్లపై సుప్రీంలో విచారణ నేడే

(మొదటిపేజీ తరువాయి)

సమావేశం కానుంది. బీసీ రిజర్వేషన్లతోనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తామని ప్రభుత్వం, పీసీసీ నేతలు పలుమార్లు ప్రకటించిన నేపథ్యంలో.. మంత్రి వర్గం ఏయే నిర్ణయాలు తీసుకుంటుందన్నది చర్చనీయాంశంగా మారింది. ఏదేమైనా కొన్ని గంటల్లో బీసీ రిజర్వేషన్లు, రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ అంశాలపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

శాస్త్రీయంగా చేసినా హైకోర్టు స్టే..

తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42% రిజర్వేషన్లు కల్పిస్తూ జారీ చేసిన జీవో 9పై హైకోర్టు ఈ నెల 9న స్టే విధించిన సంగతి తెలిసిందే. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన స్పెషల్ లీవ్ పిటిషన్ (ఎస్ఎల్పీ) గురువారం జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన ద్విసభ్య ధర్మాసనం ఎదుట విచారణకు రానుంది. తెలంగాణలో బీసీలకు 42% రిజర్వేషన్లు కల్పించే ప్రక్రియ శాస్త్రీయంగా, చట్టబద్ధంగా, సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు తగ్గట్లుగానే జరిగిందని ఈ పిటిషన్‌లో రాష్ట్ర ప్రభుత్వం పేర్కొంది. నిజానికి రాజ్యాంగంలో ఎక్కడా రిజర్వేషన్లపై 50% పరిమితి లేదని, గతంలో సుప్రీంకోర్టు కేవలం ఒక మార్గదర్శక సూత్రంగా నిర్దేశించిందని పేర్కొంది. అయినా హైకోర్టు స్టే విధించిందని వెల్లడించింది.

మరెన్నో అంశాలపై కేబినెట్ భేటీ..

సీఎం రేవంత్ అధ్యక్షతన రాష్ట్ర మంత్రివర్గం గురువారం మధ్యాహ్నం సచివాలయంలోని ఆరో అంతస్తులో భేటీకానుంది. స్థానిక ఎన్నికల్లో బీసీలకు రిజర్వేషన్లపై సుప్రీంకోర్టు ఎలా స్పందిస్తుంది? తదనుగుణంగా ఏం చేయా లి? స్థానిక ఎన్నికల విషయంలో ఎలా ముందుకెళ్లాలన్న అంశాలపై చర్చించనుంది. దీనితోపాటు పలు సాగునీటి ప్రాజెక్టులు, కొన్ని ప్రాజెక్టుల డిజైన్ల మార్పునకు అనుమతులు, ధాన్యం కొనుగోలు, హైదరాబాద్ మెట్రోను ప్రభుత్వం పరిధిలోకి తీసుకోవడం, రెండో దశ విస్తరణ, వైద్యారోగ్య రంగం బలోపేతం కోసం ప్రపంచ బ్యాంకు నుంచి రూ.4,150 కోట్ల రుణ సేకరణ, హ్యామ్ రోడ్ల నిర్మాణం తదితర అంశాలపై చర్చించి, నిర్ణయాలు తీసుకోనుంది. ఇక రాష్ట్రంలో కాంగ్రెస్ రెండేళ్ల పాలన విజయోత్సవాలను ఘనంగా జరపాలని భావిస్తున్న నేపథ్యంలో ఏయే కార్యక్రమాలు చేపట్టాలన్న దానిపై నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. ఇక రామగుండంలో రూ.10,893.05 కోట్లతో సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రం నిర్మాణం, యాదాద్రి థర్మల్ ప్లాంటు అంచనాల సవరణ అంశాలపైనా మంత్రివర్గంలో చర్చించి, తుది నిర్ణయం తీసుకోన్నారు.



బీసీ సంఘాల సమావేశంలో అభివాదం చేస్తున్న ఆర్.కృష్ణయ్య, జాజుల, నారగోని, గుజ్జ కృష్ణ, దాసు సురేశ్, తదితరులు

రాజ్యాంగబద్ధ రిజర్వేషన్ల సాధనే లక్ష్యం

18న తెలంగాణ బంద్‌కు పలు సంఘాల మద్దతు

బీసీ జేఏసీ నేతలు ఆర్.కృష్ణయ్య, జాజుల

హైదరాబాద్, బర్కత్‌పుర, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో బీసీలకు రాజ్యాంగ బద్ధంగా 42% రిజర్వేషన్ల సాధనే ప్రధాన లక్ష్యమని బీసీ జేఏసీ ఛైర్మన్ ఆర్.కృష్ణయ్య, వర్కింగ్ ఛైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్ అన్నారు. ఈ నెల 18న తలపెట్టిన తెలంగాణ బంద్‌లో సబ్బండ కులాలు భారీగా పాల్గొని చరిత్ర సృష్టించాలని పిలుపునిచ్చారు. బంద్‌కు అన్ని రాజకీయ పార్టీల మద్దతు కూడగడుతున్నట్లు ప్రకటించారు. బుధవారం కాచిగూడలోని హోటల్ అభినంద్ గ్రాండ్‌లో 130 బీసీ కుల సంఘాలు, 30 బీసీ సంఘాలు, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. పెంచిన బీసీ రిజర్వేషన్లను తగ్గించేందుకు పలువురు అనేక రకాలుగా కుట్రలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. దీనికి వారు కోర్టులను వేదికలుగా చేసుకుంటున్నారని విమర్శించారు. రాష్ట్ర బంద్‌ను విజయవంతం చేయడం ద్వారా బీసీల డిమాండ్లను దేశ వ్యాప్తంగా వినిపించ గలుగుతామని వారు అన్నారు.



బీజేపీ కార్యాలయంలో బాహాబాహీకి దిగిన నేతలు

బీసీల బంద్‌కు బీజేపీ మద్దతు

మా పార్టీతోనే బీసీలకు న్యాయం: రాంచందర్ రావు

హైదరాబాద్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): బీసీల హక్కుల కోసం బీసీ సంఘాల జేఏసీ నాయకులు పిలుపునిచ్చిన బంద్‌కు తమ పార్టీ సంపూర్ణ మద్దతు తెలుపుతుందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు అన్నారు. బుధవారం బీజేపీ ఎంపీ, బీసీ సంఘం నేత ఆర్.కృష్ణయ్య నాయకత్వంలో బీసీ జేఏసీ నాయకులు బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో రాంచందర్‌రావును కలిశారు. ఈ నెల 18 తేదీన బీసీల బంద్‌కు మద్దతునివ్వాలని కోరారు. ఈ సందర్భంగా రాంచందర్ రావు మాట్లాడుతూ.. బీసీలకు తమ పార్టీ అండగా నిలుస్తోందని చెప్పారు.

బీజేపీ, బీసీ నేతల మధ్య డిష్యూం డిష్యూం

ఆర్. కృష్ణయ్య బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావును కలిసిన సందర్భంగా ఫొటోలు దిగేందుకు నాయకులు పోటీ పడ్డారు. ఈ క్రమంలో బీజేపీ నేతలు, బీసీ సంఘాల నేతలకు మధ్య మాటా మాటా పెరిగింది. వాగ్వాదం తీవ్ర రూపందాల్చి ఘర్షణకు దారితీసింది. కృష్ణయ్య, రామచందర్ రావు వారించినా ఘర్షణకు దిగిన నాయకులు వెనక్కి తగ్గకపోవడంతో వాతావరణం ఉద్రిక్తతకు దారితీసింది. ఇందుకు సంబంధించిన వీడియోలు వైరల్ అయ్యాయి.



రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలు అందజేస్తున్న కేటీఆర్, మాగంటి సునీత

జూబ్లీహిల్స్‌లో మూడో రోజు 10 నామినేషన్లు

బంజారాహిల్స్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉపఎన్నికల నామినేషన్ ప్రక్రియలో భాగంగా బుధవారం 10 మంది అభ్యర్థులు నామినేషన్లు వేశారు. మొత్తం 13 సెట్ల నామినేషన్లు దాఖలయ్యాయి. బీఆర్ఎస్ తరఫున మాగంటి సునీత.. పార్టీ నేతలు కేటీఆర్, తలసాని శ్రీనివాస్ యాదవ్, పద్మారావు గౌడ్‌లతో కలిసి రెండు సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. అంతకు ముందు ఆమె.. కుమార్తెలు దిశిర, అక్షర కుమారుడు వాత్సల్యనాథ్‌తో కలిసి జూబ్లీహిల్స్ శ్రీపెద్దమ్మ తల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇక, స్వతంత్ర అభ్యర్థులుగా చిట్టిబోయిన సులోచనా రాణి, చలికా పార్వతి, చిట్టిబోయిన నటరాజా, మొహమ్మద్ అక్బరుద్దీన్, జమాల్పూర్ మహేశ్‌కుమార్, రహమాన్ షరీఫ్, కాంతే సాయన్న, అలయన్స్ ఆఫ్ డెమోక్రటిక్ రీఫార్మ్స్ పార్టీ తరఫున బుడ్డయ్య అంబోజు, ప్రజావెలుగు పార్టీ తరఫున ప్రవీణ్‌కుమార్ అరోళ్ల నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు. ఇప్పటి వరకు మొత్తం 30 నామినేషన్‌లు దాఖలయ్యాయి.

4 కిలోల బంగారం, రూ.32 లక్షల నగదు

మాగంటి సునీత తన ఆస్తుల వివరాలను అఫిడవిట్‌లో పేర్కొన్నారు. చేతిలో రూ.38,800 ఉండగా.. మూడు బ్యాంకుల్లోని ఖాతాల్లో కలిపి సుమారు రూ.32 లక్షలు, నాలుగు కిలోల బంగారం సహా బాండ్లు, షేర్లు, మ్యూచువల్ ఫండ్స్, వెండి ఆభరణాలు ఉన్నాయని, వాటి విలువ రూ.6,18,54,274గా పేర్కొన్నారు. స్థిరాస్తులు జూబ్లీహిల్స్ రోడ్ నంబర్ 34లో ఒక ప్లాటు, గోపన్నపల్లిలో మరో ప్లాటు ఉన్నాయని, వాటి విలువ రూ.6.11 కోట్లని తెలిపారు. ముగ్గురు పిల్లల పేరిట రూ.4.62 కోట్ల విలువైన షేర్లు, ఆభరణాలు, రూ.8 కోట్ల విలువైన స్థిరాస్తులు ఉన్నాయని పేర్కొన్నారు. తన పేరిట 4.44 కోట్లు, పిల్లల పేరుపై రూ.6 కోట్ల అప్పు ఉన్నట్లు తెలిపారు.

అబిడ్స్ పోస్టాఫీసులో నేటి నుంచి 24/7 సేవలు

» జీపీవో చీఫ్ పోస్ట్‌మాస్టర్ ప్రసాద్

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ జనరల్ పోస్టాఫీసు (జీపీవో) బుధవారం నుంచి రాత్రి పూట కూడా సేవలు అందిస్తుందని అబిడ్స్ జీపీవో చీఫ్ పోస్ట్‌మాస్టర్ ప్రసాద్ తెలిపారు. జీపీవోలో రాత్రి 8 గంటల నుంచి ఉదయం 8 గంటల వరకు నైట్ డ్యూటీ ఆపరేషన్స్ ప్రారంభించామన్నారు. ఇకపై, స్పీడ్ పోస్ట్ బుకింగ్, డెలివరీ వంటి సేవలు 24 గంటల పాటు అందుబాటులో ఉంటాయని, ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని జీపీవో చీఫ్ ప్రసాద్ సూచించారు.

48 గంటల్లో రైతుల ఖాతాల్లో ధాన్యం డబ్బు!

» మద్దతు ధరతోపాటు సన్నాలకు బోనస్

» 8,342 కొనుగోలు కేంద్రాల ద్వారా 80 లక్షల టన్నుల ధాన్యం సేకరణ

» జిల్లా కలెక్టర్లతో సమీక్షలో మంత్రి ఉత్తమ్

హైదరాబాద్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఈ సీజన్‌లో 8,342 కొనుగోలు కేంద్రాల ద్వారా 80 లక్షల టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి రికార్డు సృష్టిస్తామని, ధాన్యం సేకరించిన 48 గంటల్లోనే రైతు ఖాతాలో డబ్బు జమ చేస్తామని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రకటించారు. సన్నాలకు అదనంగా ఒక క్వింటాలుకు రూ.500 చొప్పున బోనస్ కూడా చెల్లిస్తామని తెలిపారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా తగిన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ మేరకు ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియపై అన్ని జిల్లాల కలెక్టర్లతో మంత్రి ఉత్తమ్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా బుధవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఖరీఫ్ ప్రణాళిక ప్రకారం చేపట్టనున్న 80 లక్షల టన్నుల ధాన్యం(40 లక్షల టన్నుల దొడ్డు ధాన్యం, 40 లక్షల టన్నుల సన్న ధాన్యం) సేకరణ ఓ రికార్డు అవుతుందన్నారు. ధాన్యం సేకరణకు రాష్ట్ర వ్యాప్తంగా 8,342 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తామని, ధాన్యంకొనుగోలుకు రూ.22 వేల కోట్ల నుంచి రూ.23 వేల కోట్లు నిధులు కేటాయించినట్టు చెప్పారు. నిజామాబాద్, కామారెడ్డి, మెదక్, సిద్దిపేట, నల్లగొండ జిల్లాల్లో 1,205 కొనుగోలు కేంద్రాలు ఇప్పటికే ప్రారంభించినట్లు వెల్లడించారు. ధాన్యం కాంటా పూర్తయ్యి వివరాలు నమోదు చేసిన 48 గంటల వ్యవధిలో రైతుల ఖాతాల్లో ధాన్యం డబ్బులు జమ చేస్తామని ప్రకటించారు. అందువల్ల తూకం నుంచి డేటా ఎంట్రీ వరకు సిబ్బంది కచ్చితమైన సమయపాలన పాటించేలా చూసుకోవాలని అధికారులను ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు కావాల్సిన మౌలిక వసతులతో పాటు ధాన్యం తడవకుండా రక్షణకు టార్పాలిన్లు అందుబాటులో ఉండాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో తనతోపాటు పౌరసరఫరాల శాఖ కమిషనర్‌ను సంప్రదించాలని, 24 గంటలూ తాను అందుబాటులో ఉంటానని ఉత్తమ్ పేర్కొన్నారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియ విజయవంతంగా పూర్తయ్యేందుకు అధికారులు, సిబ్బంది సహకరించాలని కోరారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియలో ఏమైనా ఇబ్బందులు ఎదురైతే రైతులు హెల్ప్‌లైన్ నెంబరు- 1800-425-00333/1976కు ఫోన్ చేయాలని ఉత్తమ్ సూచించారు.



కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రులు ఉత్తమ్, తుమ్మల, సీఎస్

హ్యామ్‌రోడ్ల నిర్మాణానికి రేపు టెండర్ నోటిఫికేషన్ : మంత్రి సీతక్క

గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడమే లక్ష్యంగా హైబ్రిడ్ యాన్యుటీ మోడ్ (హ్యామ్) విధానంలో రోడ్ల నిర్మాణం చేపట్టాలని నిర్ణయించినట్లు మంత్రి సీతక్క తెలిపారు. ఇందుకోసం ఈ నెల 17న టెండర్ నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. టెండర్ ప్రక్రియ పూర్తయిన వెంటనే పనులు ప్రారంభమవుతాయన్నారు. 40 శాతం ప్రభుత్వం నిర్మాణ దశలో చెల్లిస్తుందని, మిగిలిన 60శాతాన్ని కాంట్రాక్టర్లు బ్యాంకుల ద్వారా సమీకరిస్తారని తెలిపారు. కాగా రాష్ట్రవ్యాప్తంగా పెద్దఎత్తున హ్యామ్ విధానంలో రోడ్ల నిర్మాణం చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించిందని, ఈమేరకు గురువారం క్యాబినెట్ సమావేశంలో కీలక నిర్ణయం తీసుకోనున్నట్లు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు. రోడ్ల నిర్మాణం విషయంలో సీఎం రేవంత్‌రెడ్డి దృఢ నిశ్చయంతో ఉన్నారని, వచ్చే 30 నెలల్లో నాణ్యమైన రోడ్లు అంటే అంతా తెలంగాణ వైపు చూస్తారన్నారు.

జూబ్లీహిల్స్ బీజేపీ అభ్యర్థి లంకల దీపక్ రెడ్డి

న్యూఢిల్లీ, బంజారాహిల్స్, అక్టోబరు15(ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉప ఎన్నికకు బీజేపీ తన అభ్యర్థిని ప్రకటించింది. పార్టీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు లంకల దీపక్ రెడ్డి(49)ని తమ అభ్యర్థిగా బీజేపీ నాయకత్వం ఖరారు చేసింది. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులను ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి అరుణ్‌సింగ్ బుధవారం జారీ చేశారు. జూబ్లీహిల్స్ అభ్యర్థిగా లంకల దీపక్ రెడ్డిని బీజేపీ కేంద్ర ఎన్నికల కమిటీ భేటీలో నిర్ణయించినట్లు సోమవారం 'ఆంధ్రజ్యోతి' దినపత్రికలో వార్త ప్రచురితమైన సంగతి తెలిసిందే. 2023 శాసనసభ ఎన్నికల్లో బీజేపీ తరఫున జూబ్లీహిల్స్ నుంచి పోటీ చేసిన దీపక్ రెడ్డి 25,866 ఓట్లు సాధించి మూడో స్థానంలో నిలిచారు. ఆ ఎన్నికల్లో ఓటమి పాలైనప్పటికీ పార్లమెంట్ ఎన్నికల్లో కీలకంగా వ్యవహరించిన దీపక్ రెడ్డికే తిరిగి టికెట్ కేటాయించాలని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డితోపాటు రాష్ట్ర పార్టీ నాయకత్వం పట్టుబట్టింది. దీంతో అధిష్ఠానం దీపక్ రెడ్డికే టికెటు ఖరారు చేసింది. జూబ్లీహిల్స్ ఉపఎన్నిక నవంబరు 11న జరగనుంది. 14వ తేదీన ఫలితం వెలువడనుంది.

రైసుమిల్లులు, చెక్‌పోస్టుల్లో విజిలెన్స్ ఆకస్మిక తనిఖీలు

హైదరాబాద్, అక్టోబర్ 15 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్, మహబూబ్‌నగర్, వరంగల్‌లో రైసుమిల్లులు, చెక్‌పోస్టుల్లో విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలు మంగళవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించాయి. కరీంనగర్ జిల్లాలోని రైస్ మిల్లర్లు సీఎంఆర్ ధాన్యాన్ని అక్రమంగా తరలించారని ఫిర్యాదులు వచ్చిన క్రమంలో అధికారులు ఈ సోదాలు నిర్వహించారు. తాడికల్ గ్రామంలోని ఓ రైస్‌మిల్లులో రూ.6.73కోట్ల విలువైన 31,234 క్వింటాళ్ల కస్టమ్ మిల్లింగ్ స్టాక్ దారి మళ్లినట్లు గుర్తించామని, తదుపరి చర్యల నిమిత్తం పౌరసరఫరాల శాఖకు లేఖ రాశామని విజిలెన్స్ అధికారులు తెలిపారు. మహబూబ్‌నగర్ జిల్లా రాయకల్ టోల్ ప్లాజా వద్ద జడ్చర్ల, కొడంగల్ రూట్‌లో నిర్వహించిన తనిఖీల్లో ఓవర్‌లోడ్, జీఎస్టీ ఉల్లంఘనలకు సంబంధించి రూ.7.6లక్షలు జరిమానా విధించడంతో పాటు 12వాహనాలు సీజ్ చేశామని వివరించారు.

ఆడబిడ్డ ఆవేదనను అవమానిస్తారా?: హరీశ్‌రావు

హైదరాబాద్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): భర్తను కోల్పోయిన బాధలో కన్నీటిపర్యంతమైన మాగంటి గోపినాథ్ భార్య, బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత ఆవేదనను అవమానించేలా మంత్రులు అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. ఆమె తన భర్తను తలుచుకొని.. కన్నీళ్లు పెట్టుకుంటే.. దాన్ని కూడా రాజకీయం చేయడం దుర్మార్గమని పేర్కొన్నారు. విజ్ఞత మరచి విచక్షణలేకుండా కాంగ్రెస్ చిల్లర రాజకీయాలు చేస్తోందని, విజ్ఞులైన ప్రజలు మంచి, చెడును ఆలోచించి తగినతీర్పును ఇస్తారన్నారు. బీజేపీ మహిళా నాయకులు కళావతి, బి.లక్ష్మి, శైలజ, ఆర్కే లక్ష్మి తదితరులు హరీశ్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. బుధవారం తెలంగాణ భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో వారికి గులాబీ కండువా కప్పి.. పార్టీలోకి ఆహ్వానించిన అనంతరం ఆయన మాట్లాడారు. జూబ్లీహిల్స్‌లో భర్తను కోల్పోయిన సునీతను ఉప ఎన్నికలో ఓడగొట్టేందుకు కాంగ్రెస్ 20 వేల దొంగఓట్లను కూడగట్టుకొందని, బిహార్‌లో ఓటు చోరీ అంటున్న రాహుల్ గాంధీ.. జూబ్లీహిల్స్‌లో ఓటు చోరీపై మాట్లాడాలని డిమాండ్ చేశారు. నిజాయితీగా ఉండమని రేవంత్‌కు ఆయనే బుద్ధి చెప్పాలన్నారు. రాష్ట్రాన్ని పాలిస్తున్న కాంగ్రెస్ ప్రజలను అడుగడుగునా మోసగిస్తుంటే.. కేంద్రంలోని బీజేపీ నిధులు ఇవ్వకుండా.. అభివృద్ధిని అడ్డుకొంటున్నదని ఆయన విమర్శించారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84, RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.

స్వాగతం - సుస్వాగతం







పలు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపన కార్యక్రమాల కోసం కర్నూలు, నంద్యాలకు..
శ్రీ మల్లిఖార్జున స్వామి దర్శనార్థం, శ్రీశైలంకు విచ్చేయుచున్న
మన భారత ప్రధానమంత్రి **శ్రీ నరేంద్ర మోదీ** గారికి స్వాగతం సుస్వాగతం

NAVAYUGA

NAVAYUGA ENGINEERING COMPANY Ltd.

AN ISO 9001:2015 - (QMS), ISO 14001:2015 - (EMS), ISO 45001:2018 - (OHSMS) COMPANY
Corp Office: 379, Road No.10, Jubilee Hills, Hyderabad- 500033
Tel: +91-40-44557789, Email: nec@navayuga.com